



www.navabhoomi.in | epaper.navabhoomi.in

RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY

నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 23 బుధవారం | జులై 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 308

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur





రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసిన

## డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్..!

## రాష్ట్రపతి భవన్‌లో మర్యాదపూర్వక భేటీ

- ధన్‌ఖర్ రాజీనామాతో ఖాళీ అయిన ఉపరాష్ట్రపతి స్థానం
- హరివంశ్ రాష్ట్రపతిని కలిసిన దృశ్యం చర్చనీయాంశం
- రాజ్యసభ ఛైర్మన్‌గా తాత్కాలికంగా హరివంశ్ బాధ్యత
- విపక్ష ఆందోళనలతో సభ వాయిదా
- ఆరోగ్య కారణాలనే ధన్‌ఖర్ రాజీనామాకు నేపథ్యం
- సతీమణి మద్దతుతో ధన్‌ఖర్‌కు వైద్య సహాయం
- జూలై 17వ తేదీ నుంచే ఆరోగ్య సమస్యలు తీవ్రత

2



న్యూఢిల్లీ-నవభూమి ప్రతినిధి

రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. సోమవారం సాయంత్రం జగదీప్ ధన్‌ఖర్ ఉప రాష్ట్రపతిగా రాజీనామా చేసిన నేపథ్యంలో ఆయన రాష్ట్రపతిని కలువడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రపతి భవన్ 'ఎక్స్' పోస్ట్‌లో భేటీకి సంబంధించిన చిత్రాన్ని షేర్ చేసింది. రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపింది. జగదీప్ ధన్‌ఖర్ పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజే పదవికి రాజీనామా చేసి అందరికీ షాక్ ఇచ్చారు. మంగళవారం రాజ్యసభలో ఉదయం హరివంశ్ సభకు అధ్యక్షత వహించారు. అయితే, విపక్షాల ఆందోళనలతో ప్రారంభమైన కొద్దిసేపటికే రాజ్యసభ కార్యకలాపాలు బుధవారానికి వాయిదాపడ్డాయి. ఉపరాష్ట్రపతి రాజీనామా కారణంగా రాజ్యసభ ఛైర్మన్ పదవి సైతం ఆటోమేటిక్‌గా ఖాళీ అయ్యింది.

## ధన్‌ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం

- రాష్ట్రపతి ఆమోదంతో ధన్ ఖడ్ రాజీనామా తక్షణ అమలులోకి
- అనారోగ్య కారణాల వల్ల రాజీనామా చేసిన ఉపరాష్ట్రపతి
- దేశానికి సేవలందించిన ధన్ ఖడ్‌ను ప్రశంసించిన ప్రధాని



న్యూఢిల్లీ-నవభూమి ప్రతినిధి

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోదం తెలిపారు. ఆయన రాజీనామా వెంటనే అమలులోకి వస్తుందని ప్రకటించారు. ఈ మేరకు ధన్ ఖడ్ రాజీనామాను ఆమోదిస్తున్నట్లు సంతకం చేసి లేఖను హోంశాఖకు పంపించారు. కాగా, సోమవారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కాగా ఛైర్మన్ హోదాలో జగదీప్ ధన్ ఖడ్ రాజ్యసభ కార్యక్రమాలను సజావుగా నిర్వహించారు.తొలిరోజు కార్యకలాపాలు ముగిసి సభ మంగళవారానికి వాయిదా పడిన తర్వాత ధన్ ఖడ్ తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించారు. అనారోగ్య కారణాల వల్ల ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆయన రాజీనామా లేఖను సమర్పించారు. తన రాజీనామాను వెంటనే ఆమోదించాలని రాష్ట్రపతిని కోరారు. కాగా, ఉపరాష్ట్రపతితో పాటు పలు పదవులు నిర్వర్తించిన జగదీప్ ధన్ ఖడ్ దేశానికి ఎంతో సేవలందించారని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. ధన్ ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ముర్ము ఆమోదం తెలిపిన తర్వాత ప్రధాని మోదీ ఈ మేరకు ట్వీట్ చేశారు.

ఆర్టీసీకి రూ.6,700

## కోట్ల రికార్డు

- 6,700 కోట్ల విలువైన ఉచిత ప్రయాణ రికార్డు
- 200 కోట్ల మహిళా ప్రయాణాలు పూర్తి చేసిన ఆర్టీసీ
- మహాలక్ష్మి పథకం అపూర్వ విజయం
- ప్రభుత్వ నిధులతో సేవల విస్తరణ
- బస్సుల సంఖ్య పెంపు, కొత్త వాహనాల కొనుగోలు
- ఎలక్ట్రిక్ బస్సులకు ప్రాధాన్యత
- మహిళల ఆర్థిక స్వాతంత్ర్యానికి మద్దతుగా పథకం
- ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతానికి సంకల్పం

2




హైదరాబాద్-నవభూమి బ్యూరో

తెలంగాణ ఆర్టీసీ అరుదైన రికార్డును సాధించింది. ఇప్పటివరకు 200కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని వినియోగించుకున్న నేపథ్యంలో తెలంగాణ ఆర్టీసీ మరో మైలురాయిని దాటినట్టు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత సక్సెస్ ఫుల్ గా మహిళలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది. ఇప్పటివరకు 200కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని వినియోగిం చుకున్న క్రమంలో వారంతా వినియోగించుకున్న ఉచిత ప్రయాణం విలువ 6,700కోట్ల రూపాయలుగా నమోదైనట్టు ఆర్టీసీ పేర్కొంది. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం సూపర్ సక్సెస్ మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు కోసం తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీకి ఎప్పటికప్పుడు నిధులను విడుదల చేస్తోంది. దీంతో 6,700 కోట్ల రూపాయల అరుదైన రికార్డును సాధించింది ఆర్టీసీ. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ కీలక నిర్ణయం ఆర్టీసీకి లాభాలు తెచ్చిపెట్టింది. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం సూపర్ సక్సెస్ అయిందని తెలంగాణ ఆర్టీసీ ప్రకటించింది.ఆర్టీసీ కీలక నిర్ణయాలు మహిళా ప్రయాణికుల సంఖ్య పెరగడంతో, ఆర్టీసీ బస్సుల వినియోగం అధికం కావడంతో బస్సులసంఖ్య పెంచాలని, కొత్త బస్సులను కొనుగోలు చేయాలని, ఎలక్ట్రిక్ బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది తెలంగాణ ప్రభుత్వం. దీంతోపాటే రేపు రాష్ట్రవ్యాప్తంగా సంబరాలకు సిద్ధమైంది. రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీ పాలన ప్రభుత్వంలో అమలు చేస్తున్న మహా లక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎలాంటి అవాంతరాలు లేకుండా సాగింది. సంబరాలకు పిలుపునిచ్చిన మంత్రి పొన్నం ఈ మైలు రాయి సాధించిన నేపథ్యంలో రేపు రాష్ట్ర వ్యాప్తంగా 97 ఆర్టీసీ డిపో లు, 341 బస్ స్టేషన్ లలో సంబరాలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. మహాలక్ష్మి పథకం ఆర్టీసీ బస్సులలో ప్రయాణ సౌకర్యాలను

ఉప రాష్ట్రపతిగా

## కూటమి కింగ్?

- రాజ్యాంగ ప్రక్రియ ప్రారంభం
- ఎన్డీఏకి స్పష్టమైన ఆధిక్యం
- నితీష్ పేరు ప్రస్తావనలోకి..
- బీజేపీ నేతల మద్దతు
- జేడీయూ మౌనం ఆసక్తికరం
- కుర్మీ ఓటు లెక్కచేసిన వ్యూహం
- తేజస్వీ విమర్శలు
- వయస్సుపై విమర్శల వెల్లువ




2

న్యూఢిల్లీ-నవభూమి ప్రతినిధి


ఉపాధ్యక్షుడు జగదీప్ ధన్‌ఖర్ సోమవారం సాయంత్రం తన పదవికి రాజీనామా చేశారు. ఆరోగ్య కారణాల దృష్ట్యా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాజీనామా లేఖ పంపించారు. తన ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడానికి, వైద్యుల సలహా మేరకు రాజీనామా చేస్తున్నట్లు ఈ లేఖలో తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(ఏ) ప్రకారం వెంటనే తన రాజీనామా అమల్లోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. ధన్ ఖర్ రాజీనామాతో కొత్త ఉపరాష్ట్రపతి ఎన్నికకు మార్గం సుగమమైంది. 74 సంవత్సరాల ధన్‌ఖర్ 2022 ఆగస్టులో ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన పదవీకాలం 2027 వరకు ఉంది. రాజ్యసభ ఛైర్మన్ కూడా అయిన ధన్‌ఖర్.. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన రోజే తన పదవికి రాజీనామా చేయడం గమనార్హం. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఉపరాష్ట్రపతి ఎలక్టోరల్ కాలేజీలో భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి మెజారిటీ ఉంది. ఆ పార్టీ ప్రతిపాదించే నాయకుడు ఉప రాష్ట్రపతి పదవికి ఎంపిక కావడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ పరిస్థితుల మధ్య కొత్త ఉప రాష్ట్రపతి ఎవరు అవుతారనే చర్చ ఊపందుకుంటోంది. అదే సమయంలో బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ తెరపైకి వచ్చింది. ఆయనను తదుపరి ఉప రాష్ట్రపతిగా నియమించాలనే డిమాండ్లు ఊపందుకుంటోన్నాయి.. ప్రత్యేకించి బిహార్ రాజకీయాల్లో. నితీష్ కుమార్ గత 20 సంవత్సరాలుగా రాజకీయ అనుభవం కలిగి ఉండటం, కేంద్ర, రాష్ట్ర రాజకీయాలలో ఆయన పాత్రను పరిగణనలోకి తీసుకుని నితీష్ కుమార్ పేరును బీజేపీ ఎమ్మెల్యే హరి భూషణ్ ఠాకూర్ బచౌల్ ప్రతిపాదించారు. ఈ పదవికి నితీష్ కుమార్ అన్ని విధాలా సమర్థుడని అన్నారు. నితీష్ కుమార్‌ను ఉపరాష్ట్రపతిగా చేయాలనే డిమాండ్‌ను ఆయన సొంత పార్టీ జనతాదళ్ (యునైటెడ్) కాకుండా బీజేపీ లేవనెత్తడం ఇక్కడ గమనించాల్సిన విషయం. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న ప్రస్తుత తరుణంలో కుర్మీ సామాజిక వర్గానికి చెందిన నితీష్ కుమార్ ను ఉప రాష్ట్రపతిని చేస్తే బీసీ ఓటు బ్యాంక్ చెక్కు చెదరదని బిహార్ బీజేపీ చెబుతోంది. సుదీర్ఘకాలంగా ముఖ్యమంత్రిగా ఉంటూ

భారత్‌కు అమెరికా

## వార్నింగ్

- రష్యా చమురుకు 100% సుంకం
- భారత్‌కు అమెరికా వార్నింగ్
- చైనా-బ్రెజిల్‌కు అదే హెచ్చరిక
- ట్రంప్ తరపున కఠిన నిర్ణయం
- ఉక్రెయిన్‌కు మద్దతు లేనిదే సమస్య
- 500% టారిఫ్ బిల్లు సిద్ధం
- భారత్ వాణిజ్యంపై ప్రభావం

2



వాషింగ్టన్-నవభూమిబ్యూరో

భారత్‌కు అగ్రరాజ్యం అమెరికా మరోసారి కీలక హెచ్చరికలు జారీ చేసింది. రష్యా నుంచి ఆయిల్ దిగుమతి చేసుకుంటే 100 శాతం సుంకాలు విధించనున్నట్లు యూఎస్ సెనేటర్ లిండ్సే గ్రాహమ్ హెచ్చరించారు. భారత్ మాత్రమే కాకుండా రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేసే చైనా , బ్రెజిల్ వంటి దేశాలకు కూడా ఇలాంటి హెచ్చరికలే చేశారు. రష్యా నుంచి తక్కువ ధరకు ఆయిల్ కొనుగోలు చేసి యుద్ధం కొనసాగించేందుకు సహకరిస్తున్న దేశాల ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తామంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.ఉక్రెయిన్, రష్యా మధ్య యుద్ధం ఆపేందుకు అగ్రరాజ్యం అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో రష్యా

## కాంగ్రెస్‌కు పెద్ద షాక్..

- ఆ 199 కోట్లకు పన్ను కట్టాల్సిందే..!

2



న్యూఢిల్లీ-నవభూమి ప్రతినిధి

కాంగ్రెస్ పార్టీకి పెద్ద షాక్ తగిలింది. తమ పార్టీకి విరాళంగా వచ్చిన రూ.199 కోట్ల డబ్బుపై పన్ను మినహాయింపు కోసం చేస్తున్న ప్రయత్నం బెడిసికొట్టింది. మంగళవారం ఆదాయ పన్ను అప్పిల్లేట్ ట్రిబ్యునల్ ఆ పార్టీ అప్పీల్‌ను తిరస్కరించింది. గతంలో ఆదాయ పన్ను అధికారులు తీసుకున్న నిర్ణయాన్నే ట్రిబ్యునల్ సమర్థించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌కు రిలీఫ్ ఇవ్వబోమని తేల్చి చెప్పింది. దాంతో, ఏం

ఏపీలో జిల్లాలకు

## కొత్త పేర్లు

- కొత్త పేర్లు-కొత్త సరిహద్దులపై దృష్టి
- మంత్రుల బృందం ఏర్పాటైంది
- విజయానంద్ జారీ చేసిన జీవో
- ప్రత్యేక కార్యదర్శి కన్వీనర్‌గా నియామకం
- చరిత్ర, భౌగోళికత ఆధారంగా పేర్ల పరిశీలన
- మండల, డివిజన్ కేంద్రాల దూరాలపై అధ్యయనం జిల్లా కేంద్రాల మార్పు సంభవం



2

అమరావతి-నవభూమి ప్రతినిధి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రంలో అధికారలో ఉన్న తెలుగుదేశం- జనసేన- భారతీయ జనతా పార్టీ సంకీర్ణ కూటమి ప్రభుత్వం.. అన్ని జిల్లాల సరిహద్దులను పునర్వ్యవస్థీకరించడానికి రంగం సిద్ధం చేసింది. వాటికి కొత్త పేర్లు పెట్టనుంది. కొత్త సరిహద్దులనూ నిర్ధారించనుంది. దీనికోసం- మంత్రుల బృందం ఏర్పాటైంది కూడా. అనగాని సత్యప్రసాద్- రెవెన్యూ, పొంగూరు నారాయణ- మున్సిపల్ పరిపాలన, వంగలపూడి అనిత- హోం, బీసీ జనార్ధన్ రెడ్డి- రోడ్లు భవనాలు, నిమ్మల రామానాయుడు- జల వనరులు, నాదెండ్ల మనోహర్- పౌర సరఫరాలు, సత్యకుమార్- వైద్య ఆరోగ్య శాఖ.. ఇందులో ఉన్నారు." ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్.. జీవో విడుదల చేశారు. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి.. ఈ బృందానికి కన్వీనర్ గా వ్యవహరిస్తారు. మంత్రుల బృందం చేపట్టాల్సిన కార్యక్రమాలను జీవోలో పొందుపరిచారు. దీనికి గల

త్వరలో డ్రైవర్‌లేని

## 'రాపిడ్ పాడ్ ట్యాక్సీ'లు

- హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యకు కొత్త పరిష్కారం
- డ్రైవర్‌లేని పాడ్ ట్యాక్సీలకు గ్రీన్ సిగ్నల్
- హెచ్ఎండీఏ - యుఎంటీఏల సంయుక్త యత్నం
- రోజుకు రెండు లక్షల ప్రయాణికుల సామర్థ్యం
- భూసేకరణ అవసరం లేకుండా ప్రణాళిక
- రాయదుర్గ్ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ దాకా
- కాచిగూడ-ఎయిర్‌పోర్ట్ మార్గాల్లో ఏర్పాటు



2

హైదరాబాద్-నవభూమి బ్యూరో

రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీతో హైదరాబాద్ నగరం ట్రాఫిక్ సమస్యతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. సాధారణ సమయాల్లోనే కాకుండా, వర్షాలు కురిసినప్పుడు నగరంలోని ప్రధాన రహదారులు జలమయం కావడంతో గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనే దిశగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ ప్రత్యామ్నాయ రవాణా విధానాలపై దృష్టి సారించింది. చేపట్టిన అధ్యయనంలో విదేశాల్లో పలు నగరాల్లో విజయవంతంగా అమలవుతున్న పర్సనల్ రాపిడ్ ట్రాన్సిట్ విధానం హైదరాబాద్‌కు అనువుగా ఉంటుందని తేలింది. ఈ PRT వ్యవస్థలో చిన్న 'పాడ్స్' (బాక్సులు) ఉంటాయి, వీటిలో 4-6 మంది ప్రయాణికులు తమ లగేజీతో సహా సౌకర్యవంతంగా ప్రయాణించవచ్చు. డ్రైవర్ రహితంగా, పూర్తిగా ఆటోమేటిక్‌గా, బ్యాటరీతో నడిచే ఈ పాడ్‌లు వాయు కాలుష్యానికి ఆస్కారం లేకుండా రోజుకు 2 లక్షల మంది వరకు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చగలవు.ఈ పీఆర్టీ వ్యవస్థ ఏర్పాటుకు ఉన్న అదనపు ప్రయోజనం భూసేకరణ అవసరం లేకపోవడం.

బెట్టింగ్ యాప్ కేసు.. ఈడీని సమయం కోరిన

## రానా దగ్గుబాటి, మంచు లక్ష్మి

- నలుగురికి నోటీసులు జారీ చేసిన ఈడీ
- షూటింగ్ బిజీ కారణంగా సమయం కోరిన రానా దగ్గుబాటి
- తనకు కేటాయించిన తేదీన హాజరు కాలేనని సమాచారం ఇచ్చిన మంచు లక్ష్మి

2



హైదరాబాద్-నవభూమి బ్యూరో

బెట్టింగ్ యాప్‌ల కేసు విచారణకు హాజరయ్యేందుకు సినీ నటులు రానా దగ్గుబాటి, మంచు లక్ష్మి ఈడీని గడువు కోరారు. బెట్టింగ్ యాప్‌ల కేసులో విచారణకు హాజరు కావాలని వీరితో పాటు ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండలకు కూడా ఈడీ నోటీసులు జారీ చేసింది.రేపు రానా దగ్గుబాటి విచారణకు హాజరు కావాల్సి ఉండగా, షూటింగ్ నిమిత్తం సమయం కావాలని ఆయన కోరారు. షూటింగ్ బిజీ కారణంగా తన షెడ్యూల్‌ను మార్చాలని

## బ్రిటన్ కు బై బై చెప్పేస్తున్న బిలియనీర్

- బ్రిటన్ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర అసంతృప్తితో ఉన్న జాన్ ఫ్రెడ్రిక్సెన్
- "బ్రిటన్ అధోగతి పాలైంది' అంటూ విమర్శలు




**లండన్-నవభూమి:** బ్రిటన్ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర అసంతృప్తితో ఉన్న కుబేరుడు జాన్ ఫ్రెడ్రిక్సెన్ దేశాన్ని వీడుతున్నారు. "బ్రిటన్ అధోగతి పాలైంది" అని తీవ్రంగా విమర్శిస్తున్న ఈ బ్రిటీష్ బిలియనీర్ ఇప్పుడు ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. 2

## రెండోరోజూ గందరగోళమే..

2

పార్లమెంట్ ఉభయసభలు రేపటికి వాయిదా



**న్యూఢిల్లీ-నవభూమిప్రతినిధి:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు వరుసగా రెండో రోజూ ఎలాంటి చర్చ లేకుండా తుడిచిపెట్టుకు పోయాయి. బీహార్ లో కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ పేరుతో ఓటర్ల జాబితా ను సవరిస్తుండటాన్ని వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు ఆందోళన చేస్తున్నాయి. లోక్‌సభలో, రాజ్యసభ లో ప్రతిపక్ష ఎంపీలు ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు

తగ్గేదేలే అంటున్న

## రోజా

- రోజా వ్యాఖ్యలతో రాజకీయ భగ్గుమన్న వివాదం
- డిప్యూటీ సీఎం పవన్‌పై ఘాటు ఆరోపణలు
- హెలికాప్టర్లలో తిరుగుతూ - రోజా వ్యంగ్యవాక్యం
- "వైసీపీ వస్తే మీరూ పారిపోతారు" -రోజా హెచ్చరిక
- గాలి భాను తీవ్ర విమర్శలు - రోజా కన్నీళ్లతో ఫిర్యాదు
- పవన్‌కు పిచ్చి ముదిరిందా? - రోజా ప్రశ్న



2

అమరావతి-నవభూమి ప్రతినిధి

అనుచిత, అభ్యంతరక వ్యాఖ్యలను సహించేది లేదని కూటమి ప్రభుత్వం హెచ్చరిస్తున్నా, వైసీపీ, టీడీపీ నేతలు తగ్గేదేలే అంటున్నారు. పోటాపోటీగా దూషణలకు దిగుతూ రాజకీయంగా రచ్చ చేస్తున్నారు. తాజాగా నగరి మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఆర్కే రోజాపై సిట్టింగు ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ తీవ్ర విమర్శలు చేశారు. దీనిపై కన్నీళ్లు పెట్టుకున్న మాజీ మంత్రి రోజా ఎమ్మెల్యేపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆమెకు కౌంటరుగా టీడీపీ కూటమి నేతలు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై రోజా చేసిన వ్యాఖ్యల వీడియోను బయటపెట్టారు. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. కూటమి నేతలను లక్ష్యంగా చేసుకుని

# తెలంగాణలో అతిభారీ వర్షాలు.. నాలుగు జిల్లాలకు ఐఎండీ రెడ్ అలెర్ట్..!



**హైదరాబాద్-నవభూమి:** ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలంగాణలో ఈ నెల 26 వరకు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మంగళవారం కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో అతిభారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆయా జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. అలాగే, ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, భూపాలపల్లి, కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలుపడుతాయని చెప్పింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే సూచనలున్నాయని చెప్పింది. ఈ మేరకు ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది. ఇక నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, వికారాబాద్, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. అలాగే, జులై 24, 26 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ వివరించింది.




## రెండు గంటల ముందే వర్షం సమాచారం..



**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాలు నగరాన్ని అతలాకుతలం చేశాయి. కుండ పోత వర్షానికి ప్రధాన రహదారులు నదులను తలపించాయి, ముఖ్యంగా గచ్చిబౌలి ప్రాంతంలో అయితే రహదారులు నీట మునిగాయి. రోడ్లపై భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. అయితే, ఈ వర్షం గురించి ముందస్తు సమాచారం లేకపోవడం నగరవాసులకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రజలు సాధారణ రోజువారీ కార్యకలాపాల నిమిత్తం రోడ్లపైకి వచ్చి, ఊహించని విధంగా కురిసిన వర్షానికి భారీ ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లలో చిక్కుకుని, తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి తీవ్రంగా శ్రమించారు.ఇక నుంచి ఆ ఇబ్బందులు ఉండవ్. హైదరాబాద్ నగరవాసులకు ఇకపై వర్ష సూచన రెండు గంటల ముందే చేతికి అందనుంది. నగరవాసులను అలర్ట్ చేసేందుకు హైడ్రా అధికారులు వినూత్న సాంకేతికతను అమలు చేస్తున్నారు. తొలిసారిగా, నగరంలో సెల్‌టవర్ల వారీగా వాతావరణ సమాచారం %వామీ%ల రూపంలో పంపే కార్యక్రమాన్ని హైడ్రా ప్రారంభించింది. ఏ డివిజన్ పరిధిలో వర్షం కురవనుందో తెలుసుకొని, ఆయా సెల్‌టవర్ల పరిధిలోని ఫోన్ నంబర్లకు సంక్షిప్త సందేశాలు పంపుతున్నారు. ఈ తరహా సాంకేతికతను నగరంలో ఉపయోగించడం ఇదే మొదటిసారి. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సహకారంతో హైడ్రా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. భవిష్యత్తులో మూడు గంటల ముందుగానే కచ్చితమైన వాతావరణ సమాచారాన్ని అందించేందుకు కసరత్తు చేస్తోంది.గతంలో ఐదు నుంచి పది ప్రాంతాల వాతావరణ సమాచారం మాత్రమే లభించేది. ఆ తర్వాత, జీహెచ్ఎంసీ పరిధిలోని 30 సర్కిళ్లకు వాతావరణ శాఖ వేర్వేరుగా సమాచారం ఇచ్చేది. జీహెచ్ఎంసీ, హైడ్రా వరుస సంప్రదింపుల ఫలితంగా, కొంతకాలంగా 150 డివిజన్లకు వేర్వేరుగా సమాచారాన్ని రూపొందిస్తున్నారు. ఇటీవల వరకు వాతావరణ శాఖ ఇచ్చే సమాచారం అధికారులకే పరిమితమయ్యేది. ఇప్పుడు, సెల్‌టవర్ల సిగ్నళ్ల ఆధారంగా, ఏ ప్రాంతంలో వర్షం కురవబోతుందో అక్కడున్న వారికి %వామీ%ల రూపంలో సమాచారం అందించాలనే హైడ్రా ఆలోచనతో ప్రజలు ముందే అప్రమత్తమవుతున్నారు.

కేంద్రం ప్రవేశపెట్టిన 'సచేత్' యాప్ వినియోగదారుల సెల్ నంబర్లకు కూడా హైడ్రా వాతావరణ సమాచారాన్ని చేరవేస్తోంది. ఒకేసారి 5 లక్షల మందికి %వామీ%లు పంపిస్తున్నట్లు హైడ్రా అదనపు సంచాలకులు పాపయ్య తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలకు కూడా వర్ష సమాచారాన్ని పంపుతున్నామని ఆయన చెప్పారు. సంబంధిత ప్రాంతాల్లోని వర్షాకాల అత్యవసర బృందాలను అప్రమత్తం చేసి, రోడ్లపై నీరు నిలవకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. వర్షాలు, విపత్తుల సమయంలో ఇబ్బందులు ఉంటే నగరవాసులు హైడ్రా కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లకు 90001 13667, 87124 06901, 040 2955 5500 కాల్ చేయాలని సూచిస్తున్నారు.

## బ్రిటన్‌కు బై బై చెప్పేస్తున్న బిలియనీర్

**(1వపేజీ తరువాయి)**లండన్‌లోని తన 337 మిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ. 2,900 కోట్లు) విలువైన విలాసవంతమైన భవనాన్ని అమ్మకానికి పెట్టారు. ఆయన దుబాయ్‌కి తన మకాం మార్చాలని నిశ్చయించుకున్నారు. ఫ్రెడ్రిక్సెన్ ఒక్కరే కాదు, చాలా మంది సంపన్నులు బ్రిటన్‌ను వీడి ఇతర దేశాలకు వెళుతున్నారు. అందుకు బలమైన కారణాలే ఉన్నాయి.

**ఎందుకు ఈ సంపన్నుల వలస?**

నార్వేలో జన్మించి, షిప్పింగ్ వ్యాపారంలో రాణించి, బ్రిటన్‌లో తొమ్మిదవ అత్యంత ధనవంతుడిగా ఎదిగిన ఫ్రెడ్రిక్సెన్, బ్రిటన్ ప్రభుత్వ ఆర్థిక విధానాలు మరియు పన్నుల పెరుగుదలపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ప్రభుత్వ విధానాలను భరించలేకే బ్రిటన్ కు గుడ్ బై చెబుతున్నారు. లేబర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాన్-డొమిసిల్ పన్ను విధానం రద్దు (ఇది విదేశాల్లో ఆదాయాన్ని ఆర్జించే సంపన్నులకు పన్ను మినహాయింపులు ఇచ్చేది), మూలధన లాభాల పన్ను పెంపు (ఆస్తుల విక్రయం ద్వారా వచ్చే లాభాలపై పన్ను), మరియు జాతీయ బీమా సహకారాల పెరుగుదల వంటివి సంపన్నులకు తీవ్ర నష్టం చేకూరుస్తున్నాయి. ఈ మార్పులు తమ ఆర్థిక భవిష్యత్తుకు అనుకూలంగా లేవని సంపన్నులు భావిస్తున్నారు.

**ఆందోళనకరమైన ధోరణి**

ఇది కేవలం ఫ్రెడ్రిక్సెన్ ఒక్కరి సమస్య కాదు, బ్రిటన్‌కు సంబంధించిన ఒక ఆందోళనకరమైన ధోరణిని ఇది సూచిస్తుంది. అంచనాల ప్రకారం, 2025లో సుమారు 16,500 మంది మిలియనీర్లు బ్రిటన్‌ను వీడి వెళ్లే అవకాశం ఉంది. వీరు దాదాపు 66 బిలియన్ పౌండ్ల (భారత కరెన్సీలో సుమారు రూ. 7.7 లక్షల కోట్లు) విలువైన పెట్టుబడులను, సంపదను వేరే దేశాలకు తరలించనున్నారు. ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక కేంద్రంగా, సంపన్నులకు స్వర్గధామంగా ఉన్న లండన్ నగరం, 2014 నుండి 30,000 మంది మిలియనీర్లను కోల్పోయింది.

**ఇతర ప్రధాన కారణాలు**

బ్రిటన్ యూరోపియన్ యూనియన్ నుంచి వైదొలిగిన తర్వాత ఏర్పడిన ఆర్థిక అనిశ్చితి, పౌండ్ విలువ తగ్గడం, మరియు లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రాముఖ్యత కోల్పోవడం వంటివి కూడా సంపన్నులు పారిస్, దుబాయ్, ఆమ్‌స్టర్‌డామ్ వంటి ఇతర ప్రముఖ ఆర్థిక కేంద్రాలకు వెళ్ళడానికి బలమైన కారణాలుగా నిలుస్తున్నాయి. సంపన్నుల ఈ వలస బ్రిటన్ ఆర్థిక వ్యవస్థకు దీర్ఘకాలంలో తీవ్ర నష్టాన్ని, సవాళ్లను కలిగించే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## రెండోరోజూ గందరగోళమే..

**(1వపేజీ తరువాయి)**ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు.లోక్‌సభలో స్పీకర్, రాజ్యసభలో డిప్యూటీ ఛైర్మన్ నచ్చజెప్పే ప్రయత్నం చేసినా సభ్యులు వినిపించుకోలేదు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. దాంతో సభల్లో గందరగోళం ఏర్పడింది. దాంతో ఉభయసభలు ముందుగా మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదాపడ్డాయి. ఆ తర్వాత ఉభయసభలు పునఃప్రారంభమైనప్పటికీ సేమ సీన్ రిపీట్ అయ్యింది. ఈ క్రమంలో ఉభయసభలను రేపటికి వాయిదా వేశారు.

## ఫ్రిజ్‌లో పెట్టిన మటన్ కూర తిని.. ఆర్టీసీ ఉద్యోగి మృతి



**హైదరాబాద్-నవభూమి:** నగరంలో బోనాల పండుగ ఎంత ఘనంగా నిర్వహిస్తారో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇక్కడ బోనాల వేడుకల్లో పాల్గొనడం కోసం ఎక్కడెక్కడో ఉన్న బంధు మిత్రులు తరలి వస్తుంటారు. అలానే ఓ ఆర్టీసీ ఉద్యోగి కూడా ఎంతో సంతోషంగా బోనాల పండుగ చేసుకున్నారు. బంధుమిత్రులను పిలిచి వారికి విందు ఇచ్చారు. భోజనంలో చికెన్, మటన్ వడ్డించారు. పండుగ అయిపోయింది. బంధువులు కూడా వెళ్లిపోయారు. అయితే పండుగ నాడు చేసిన మటన్ కాస్త మిగిలింది. దాన్ని ఫ్రిజ్‌లో పెట్టి మరుసటి రోజు తిన్నారు. ఇంకేముంది.. అలా మటన్ తిన్న వారంతా అస్వస్థతకు గురి కాగా.. సదరు ఆర్టీసీ ఉద్యోగి చనిపోయారు. ఈ విషాదకర సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.ఈ సంఘటన హైదరాబాద్, వనస్థలిపురంలో వెలుగు చూసింది. శ్రీనివాస్ అనే ఆర్టీసీ ఉద్యోగి ఒకరు ఫుడ్ పాయిజన్ కారణంగా మృతి చెందారు. మరో ఏడుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. చికిత్స పొందుతున్న వారి వివరాలు ఇలా ఉన్నాయి.. రజిత(38), జశ్విత(15), గౌరమ్మ(65), లహరి(17), సంతోష్ కుమార్(39), రాధిక(38), బేబీ కృతంగా (7).. వీరంతా బోనాల పండగ నాడు.. వండి, ఫ్రిజ్‌లో పెట్టిన మటన్, బోటి, చికెన్ తినడం వల్ల అస్వస్థతకు గురయ్యారని తెలుస్తోంది.

ఈ ఘటనలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందారు. మిగతా ఏడుగురు కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. తీవ్ర అస్వస్థతకు గురైన వారిని చింతలకుంటలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించి.. చికిత్స పొందుతున్నారు. అయితే వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వీరు మటన్ తిన్న రోజే అస్వస్థతకు గురయ్యారా.. లేక మరుసటి రోజు ఇలా ఆస్పత్రి పాలయ్యారా.. ఫుడ్ పాయిజన్‌కు గల కారణాలు ఏంటి అని విచారించే పనిలో ఉన్నారు. కుటుంబ సభ్యుల్లో ఎవరైనా దీనిపై స్పందిస్తేనే అసలేం జరిగింది అనే దానిపై ఓ క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది.అయితే ఈ మధ్యకాలంలో తెలంగాణలో ఫుడ్ పాయిజన్ కేసులు తరచుగా వెలుగు చూస్తున్నాయి. ముఖ్యంగా గిరిజన, గురుకుల పాఠశాలల్లో తరచుగా ఫుడ్ పాయిజనింగ్ కేసులు తెర మీదకు వస్తోన్న సంగతి తెలిసిందే. రెండు రోజుల క్రితం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉన్న సాయికుంట ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటన వెలుగు చూసింది. నలుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురి కావడంతో ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటన మరిచిపోకముందే హైదరాబాద్‌లో ఫుడ్ పాయిజన్ సంఘటన వెలుగులోకి వచ్చింది. ఫుడ్ పాయిజన్ కారణంగా ఆర్టీసీ ఉద్యోగి చనిపోవడం సంచలనంగా మారింది.

## రేషన్ కార్డుల్లో కొత్త పేర్లు.. మంత్రి పొన్నం కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఫిక్స్ చేసింది. జులై 25 నుంచి ఆగస్టు 10 వరకు సుమారు 10 రోజుల పాటు 7 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసేందుకు రెడీ అవుతోంది. ప్రతి నియోజకవర్గంలోని మండల పరిధిలో రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. అలానే రేషన్ కార్డు రాని వారు కంగారు పడాల్సిన పని లేదని.. రాష్ట్రంలో రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని.. కార్డు రాని వారు మీసేవాలో కానీ.. లేదంటే ప్రజాపాలనలో మరో సారి దరఖాస్తు చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే రేషన్ కార్డుల్లో కొత్త పేర్లు చేరుస్తారా.. లేదా అనే దానిపై అందరిలో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ వివరాలు..రాజకీయాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ కలెక్టరేట్?లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన కొత్త రేషన్ కార్డుల పంపిణీ, సీజనల్ వ్యాధులను అరికట్టడంపై తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. తెలంగాణలో దాదాపు 10 సంవత్సరాల తర్వాత.. కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నామని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం పంపిణ చేసే రేషన్ కార్డులో కొత్త పేర్లను కూడా కలిపేందుకు అవకాశం కల్పించామని తెలిపారు. హైదరాబాద్?లో సుమారు 43 వేల కొత్త రేషన్ కార్డులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మంత్రి పొన్నం చెప్పుకొచ్చారు. ఇంకా లక్షకు పైగా దరఖాస్తులు పెండింగ్?లో ఉన్నాయని తెలిపారు. వాటన్నింటిని పరిశీలించిన తర్వాత అర్హులైన వారికి మళ్లీ కార్డులు పంపిణీ చేస్తామని వెల్లడించారు.అయితే హైదరాబాద్, పరిసర జిల్లాల్లో రేషన్ కార్డుల అర్హుల ఎంపిక ప్రక్రియ కొంత ఆలస్యంగా జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పుకొచ్చారు. పెండింగ్ అప్లికేషన్ ప్రాసెస్ వెరిఫికేషన్ తొందరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని పని చేయాలని సూచించారు. రేషన్ కార్డుల జారీ, అప్లికేషన్ల ప్రక్రియలో ఎక్కడా ఆలస్యం చేయకుండా.. సివిల్ సప్లయ్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయం చేసుకొని వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని పొన్నం చెప్పుకొచ్చారు.


# తగ్గేదేలే అంటున్న రోజా



**(1వపేజీ తరువాయి)**రోజా చేస్తున్న వ్యాఖ్యలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఓ మీడియా చానల్ తో మాట్లాడిన రోజా కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని చెబుతున్నారు. వైసీపీ అధికారంలోకి వస్తే పారిపోతారని హెచ్చరించడంతోపాటు డిప్యూటీ సీఎం పవన్ పై రోజా ఘాటు వ్యాఖ్యలు చేయడంతో ఈ వివాదం కొత్తమలుపు తీసుకుంది. "ఈ ఎమ్మెల్యేలు గాల్లో గెలిచిన గాలి.." అంటూ రోజా అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని విమర్శిస్తున్నారు. ఒక్కరు కూడా ప్రజల వద్దకు వెళ్లి ఏం కష్టమో అడగరని ఆక్షేపించారు. రేపు వైసీపీ అధికారంలోకి వస్తే టీడీపీ, జనసేన నాయకులు హైదరాబాదుకు కాదు అమెరికాకు పారిపోతారని రోజా హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వీకెండ్ నాయకులు అంటూ రోజా కామెంట్ చేశారు. ప్రజలకు రేషన్ పంపిణీ చేసే వాహనాలకు డబ్బులు లేవని చెబుతూ, వీళ్లు మాత్రం హెలికాప్టర్, విమానాల్లో తిరుగుతున్నారని ఆరోపించారు. వైసీపీ నాయకులను ఇబ్బంది పెడితే వందకు వంద చెల్లిస్తామని రోజా ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇక పవన్ కల్యాణ్ కు పిచ్చి బాగా ముదిరిందని.. ఎక్కడికి వెళితే అక్కడ పుట్టానంటాడని రోజా ఎద్దేవా చేశారు. చివరకు సుబ్రహ్మణ్యస్వామి అభిమానిని అంటూ చెప్పుకోవడంపైనా రోజా విమర్శలు గుప్పించారు. తనపై ఎమ్మెల్యే చేసిన విమర్శలతో కంటపడిన రోజా.. ఇతర నాయకులపై నోటికొచ్చినట్లు మాట్లాడవచ్చా? అంటూ జనసేన నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇక రోజా వ్యవహారశైలిపై స్పందించిన శాప్ ఛైర్మన్ రవినాయుడు మీడియాతో మాట్లాడుతూ రోజాకు కౌంట్ డౌన్ స్టార్ట్ అయిందని హెచ్చరించారు. మరో పది రోజుల్లో ఆమె అరెస్టు ఖాయమంటూ రవినాయుడు వ్యాఖ్యానించారు.

## ఎక్కువ జీతం ఉన్నవాళ్లకే హెచ్-1బీ వీసా.. ట్రంప్ మరో బాంబు

**వాషింగ్టన్-నవభూమి బ్యూరో:** అమెరికాలో ప్రస్తుత నెలకున్న పరిస్థితులు ముఖ్యంగా వలసదారుల విషయంలో ట్రంప్ అవలంభిస్తున్న విధానాలతో ఆందోళన నెలకుంది. ఈ క్రమంలో అమెరికా హెచ్ 1 బీ వీసాల విషయంలో భారీగా మార్పులు చోటుచేసుకుంటున్నాయనే ప్రచారం నిజమేనని అమెరికా తెలుగు లీగల్ కన్సల్టెంట్ భూమిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. వీసా దరఖాస్తులు, జారీలో గందరగోళంగా ఉందని, అపాయింట్‌మెంట్ ఇచ్చినా సోషల్ మీడియా వెట్టింగ్ కారణంగా రిజక్ట్ అవుతున్నాయని చెప్పారు. రెడ్డిట్ అకౌంట్ వివరాలు యాప్‌లో కనిపించడం లేదని వీసాను తిరస్కరించారని చెప్పారు. జాతీయ భద్రత పేరుతో వీసాలను రద్దుచేస్తున్నారని, ఈ విషయంలో ఏ మాట్లాడటానికి ఉండదన్నారు. అమెరికాకు ప్రతిభావంతులు, నైపుణ్యం కలిగిన వ్యక్తులే కావాలని ట్రంప్ యంత్రాంగం కోరుకుంటోందని, అందుకే వీసీ ప్రక్రియలో కఠిన నిబంధనలు అమలు చేస్తోందని శ్రీనివాసరెడ్డి తెలిపారు.




## త్వరలో డ్రైవర్‌లేని 'రాపిడ్ పాడ్ ట్యాక్సీ'లు

**(1వపేజీ తరువాయి)**ప్రస్తుతం ఉన్న రోడ్ల మధ్యలో లేదా రోడ్లకు ఇరు వైపులా ఈ సేవలను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నారు. అధ్యయనం చేస్తున్న మార్గాల్లో రోడ్లకు ఇరువైపులా తగినంత స్థలం ఉండటం ఈ ప్రాజెక్టుకు మరింత అనువుగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. సేవలను ఏర్పాటు చేయడానికి గతంలో కొన్ని ప్రధాన మార్గాలు ప్రతిపాదించారు. కాచిగూడ - ఎంజీబీఎస్ - జూపార్కు - ఎయిర్‌పోర్టు, రాయదుర్గ్ మెట్రో స్టేషన్ - ఫైనాన్షియల్ డిస్ట్రిక్, రాయదుర్గ్ మెట్రో స్టేషన్ - నాలెడ్జ్ సిటీ మార్గాల్లో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.ఈ మార్గాలు ప్రధానంగా నగరంలోని ఐటీ కారిడార్, వాణిజ్య కేంద్రాలు, రద్దీగా ఉండే ప్రాంతాలను కలుపుతూ లాస్ట్ మైలు అనుసంధానతను మెరుగుపరచడానికి ఉపయోగపడతాయని భావిస్తున్నారు. వ్యవస్థ అమలులోకి వస్తే హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలు గణనీయంగా తగ్గుతాయని, ప్రయాణ సమయం ఆదా అవుతుందని, నగరంలో ప్రజా రవాణా వ్యవస్థ మరింత పటిష్టమవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసిన డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్..!

**(1వపేజీ తరువాయి)**ఉపరాష్ట్రపతి ఎగువ సభకు ఎక్స్-అఫిషియో ఛైర్మన్. ఈ పరిస్థితుల్లో ఆయన రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం తెలుపడంతో వర్షాకాల సమావేశాల్లో రాజ్యసభ కార్యకలాపాలు మొత్తం డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ చూసుకోనున్నారు.పార్లమెంట్ సమావేశాల తొలిరోజున జగదీప్ ధన్‌ఖర్ చురుగ్గానే కనిపించారు. ఉదయం సభలో సానుకూలంగా చర్చలు జరపాలని ఆయన సభ్యులకు సూచించారు. జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసన తీర్మాన నోటీసును అంగీకరించిన ఆయన.. ప్రక్రియను వివరించారు. జస్టిస్ శేఖర్ యాదవ్‌పై సమర్పించిన అభిశంసన నోటీసులో ఒక ఎంపీ డబుల్ సంతకంపై విచారణను చేయనున్నట్లు తెలిపారు. అయితే, ఆరోగ్య కారణాలు పేర్కొంటు ఆయన తక్షణం అమలులోకి వచ్చేలా ఆయన పదవికి రాజీనామా చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపిన రాజీనామా లేఖలో వైద్యుల సూచన మేరకు ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఇచ్చేందుకు రాజీనామా చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.ఆయన మార్చిలో ఎయిమ్స్‌లో చేరారు. ఆ తర్వాత వైద్యులు ఆయనను ఢిల్లీ వెలుపలకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. జూన్‌లో ఉత్తరాఖండ్‌లోని కుమావున్ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన వేదికపైనే స్పృహ కోల్పోయారు. ఆ రోజు వేడి పరిస్థితులు ఉన్నట్లుగా అధికారులు తెలిపారు. ఈ నెల ప్రారంభంలో ఆయన కేరళలో పర్యటించారు. ఈ సమయంలో ఆరోగ్యం క్షీణించగా.. భార్య ఆయనకు అండగా ఉన్నారు. జులై 17న ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో స్వల్పంగా అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయన భార్య మంచినీళ్లు తీసుకువచ్చి ఇవ్వగా పరిస్థితి మెరుగైంది. ఈ క్రమంలోనే ఆయన ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వైద్యుల సూచనల మేరకు కీలక బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు తెలుస్తున్నది.

## ఉప రాష్ట్రపతిగా కూటమి కింగ్?

**(1వపేజీ తరువాయి)**వస్తోన్న నితీష్ కుమార్ ను ఈ ఎన్నికల్లో ఓడించాలంటూ జేడీయూ- కాంగ్రెస్ ఇతర ప్రతిపక్ష పార్టీలు ఓటర్లకు పిలుపునిస్తోన్నాయి. నితీష్ కుమార్ వయస్సును ప్రస్తావిస్తూ విమర్శలు గుప్పిస్తోన్నాయి. ఆయన పనితీరుపై సైతం ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. బిహార్ పీఠంపై వేరొకరికి అవకాశం ఇవ్వాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ విషయాన్ని ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ పలుమార్లు మీడియా సమావేశాల్లో ప్రస్తావించారు. ఈ పరిణామాల మధ్య నితీష్ కుమార్ ను ఉప రాష్ట్రపతిని చేయాలనే డిమాండ్ ఊపందుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. నితీష్ కుమార్ గత 20 ఏళ్లుగా బీహార్‌కు సేవ చేస్తున్నారని, రాజకీయాల్లో ఆయనకు సుదీర్ఘ అనుభవం ఉందని హరిభూషణ్ ఠాకూర్ అన్నారు.

## ఏపీలో జిల్లాలకు కొత్త పేర్లు

**(1వపేజీ తరువాయి)**మార్గదర్శకాలను నిర్ధారించారు. ఇప్పుడు మనుగడలో ఉన్న జిల్లాల పేర్ల మార్పుపై అధ్యయనం చేస్తుందీ మంత్రుల బృందం. ప్రాంతీయ పరిస్థితులు, అక్కడి చరిత్రకు అనగుణంగా కొత్త పేర్లు పెట్టే అవకాశాలను పరిశీలిస్తుంది. అదే సమయంలో- జిల్లా, రెవెన్యూ డివిజిల్ లేదా మండల సరిహద్దులపై అధ్యయనం చేస్తుంది. దీనితో పాటు జిల్లా కేంద్రం, రెవెన్యూ డివిజన్, మండల కేంద్రానికి ఆయా గ్రామాల మధ్య దూరాన్ని అంచనా వేస్తుంది. దీనికి అనుగుణంగా జిల్లా కేంద్రాలను కూడా ఏర్పాటు చేసే అవకాశాలు లేకపోలేదు. ఈ క్రమంలో ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తుంది. ప్రజా ప్రతినిధుల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తుంది. వీటన్నింటిని క్రోడీకరించిన అనంతరం సమగ్ర నివేదికను సాధారణ పరిపాలన మంత్రిత్వ శాఖకు అందజేస్తుంది. మూడు నెలల్లోగా ఈ నివేదిక అందే అవకాశం ఉందని తెలుస్తోంది.

## భారత్‌కు అమెరికా వార్నింగ్

**(1వపేజీ తరువాయి)**ను ఆర్థికంగా దెబ్బతీసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే ఉక్రెయిన్‌కు మద్దతు ఇవ్వకుండా రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తున్న దేశాలపై భారీ స్థాయిలో సుంకాలు విధించాలని యోచిస్తోంది. మాస్కోతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తున్న భారత్, చైనాపై 500 శాతం సుంకాలు (500 %ూవతీఎవత్ ్ఖతీఱటట%) విధిస్తామని ఇటీవలే హెచ్చరించిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి అలాంటి వార్నింగే ఇచ్చింది.రష్యా చమురు కొనుగోలు ఆపకపోతే భారత్, చైనా సహా మాస్కో వాణిజ్య భాగస్వాములైన దేశాలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ సుంకాలు విధిస్తారని లిండ్సే గ్రాహమ్ తాజాగా హెచ్చరించారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గ్రాహమ్ మాట్లాడుతూ.. 'రష్యా నుంచి ఆయిల్ దిగుమతి చేసుకునే భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు విధించబోతున్నారు. ఆయా దేశాలపై 100 శాతం టారిఫ్‌లు విధించనున్నారు. మీరు తక్కువ ధరకు ఆయిల్ కొని, యుద్ధం కొనసాగించేందుకు సహకరిస్తే అమెరికా మీ ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తుంది' అంటూ తీవ్రంగా హెచ్చరించారు.


**భారత్‌పై అమెరికా 500 శాతం సుంకాలు..!**

మాస్కోతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తున్న భారత్, చైనాపై 500 శాతం సుంకాలు (500 విధిస్తామంటూ రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహమ్ ఇటీవలే హెచ్చరించిన విషయం తెలిసిందే. ఇందుకోసం ఓ బిల్లును కూడా తీసుకురానున్న తెలిపారు. 'రష్యా ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ.. ఉక్రెయిన్‌కు సాయం చేయని దేశాల ఉత్పత్తులపై 500 శాతం సుంకం ఉంటుంది. భారత్ చైనా దేశాలు మాస్కో నుంచి 70 శాతం చమురు కొనుగోలు చేస్తున్నాయి' అని అన్నారు.రష్యాతో వాణిజ్య సంబంధాలను కొనసాగించే దేశాలపై అధిక సుంకాలు విధించేలా ట్రంప్ మద్దతుతో యూఎస్ సెనేట్‌లో బిల్లును తీసుకొస్తామని ఆయన తెలిపారు. ఈ బిల్లు వచ్చే నెలలోనే ప్రవేశ పెట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. కాగా, రష్యా నుంచి భారత్ పెద్ద మొత్తంలో ముడి చముర కొనుగోలు చేస్తున్న విషయం తెలిసిందే. చైనా సైతం మాస్కో నుంచి చమురును దిగుమతి చేసుకుంటోంది. దీంతో యూఎస్ తెచ్చే ఈ బిల్లు భారత్, చైనా దేశాలపై తీవ్ర ప్రభావం చూపనుంది.

## కాంగ్రెస్‌కు పెద్ద షాక్..

**(1వపేజీ తరువాయి)**చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు కాంగ్రెస్ నేతలు.కంద్రంలో వరుసగా మూడో పర్యాయం అధికారం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీకి ఆదాయ పన్నుఉచ్చు బిగుసుకుంటోంది. 2018-19లో పార్టీకి విరాళం రూపంలో రూ.199 కోట్లు వచ్చాయి. ఆ డబ్బుపై తప్పనిసరిగా పన్ను చెల్లించాల్సిందేనని ఆదాయపు పన్ను శాఖ అధికారులు కాంగ్రెస్‌కు స్పష్టం చేశారు. ఇదే విషయమై పలుమార్లు నోటీసులు కూడా పంపారు. అయితే.. కాంగ్రెస్ నాయకత్వం మాత్రం అవి డొనేషన్‌గా వచ్చిన డబ్బులని.. వాటిపై పన్ను విధించడం సమంజసం కాదని వాదిస్తోంది.

## హాకీ ప్లేయర్‌పై సామూహిక అత్యాచారం.. నలుగురు కోచ్‌లు అరెస్ట్



**సుందర్‌గఢ్-నవభూమి:** ఒడిశా రాష్ట్రం లోని సుందర్‌గఢ్ జిల్లాలో 15 ఏళ్ల హాకీ క్రీడాకారిణి పై ఆమెకు శిక్షణ ఇస్తున్న కోచ్‌లే సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ కేసులో నలుగురు హాకీ కోచ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. రూర్కెలా ( లోని సాయ్ సెంటర్‌లో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితురాలు గడిచిన రెండేళ్లుగా సాయ్ కేంద్రంలో హాకీ శిక్షణ పొందుతోంది. ఈ క్రమంలో జూలై 3న సాయంత్రం స్థానిక స్టేడియంలో కోచింగ్ సెషన్ ముగిసిన తర్వాత నలుగురు కోచ్‌లు ఆ క్రీడాకారిణిని ఒక లాడ్జికి తీసుకెళ్లారు. అక్కడ వారు తనపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు ఆరోపించింది. ఈ విషయం ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలుంటాయని



బెదిరించినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. జూలై 21 రాత్రి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు చర్యలు చేపట్టారని, నలుగురు శిక్షకులను అదుపులోకి తీసుకున్నారని భువనేశ్వర్ డీసీపీ ప్రతీక్ సింగ్ తెలిపారు. నలుగురు కోచ్‌లపై పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. సోమవారం కోర్టులో బాధితురాలి వాంగ్మూలం నమోదు చేశారు. కాగా ఈ ఘటన క్రీడా వర్గాల్లో

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3
హైదరాబాద్
బుధవారం
23 । జూలై । 2025

## ఎయిర్ ఫోర్స్ కీలక నిర్ణయం.. 62 ఏళ్లు సేవలందించిన మిగ్-21 యుద్ధ విమానాలకు గుడ్‌బై..!



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత వైమానిక దళం కీలక నిర్ణయం తీసుకున్నది. మిగ్-21 యుద్ధ విమానాలను ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి దశలవారీగా ఫ్లీట్ నుంచి తొలగించనున్నది. మిగ్-21 జెట్‌లను ప్రస్తుతం 23 స్క్వాడ్రాన్ నిర్వహిస్తోంది. వారిని పాంథర్స్‌గా పిలుస్తుంటారు. ప్రస్తుతం ఇవి రాజస్థాన్‌లోని నల్ ఎయిర్‌బేస్‌లో ఉన్నాయి. ఈ మిగ్-21 విమానాల స్థానంలో ఎల్‌సీఏ మార్క్1ఏ విమానాలతో భర్తీ చేయనున్నట్లు ఎయిర్‌ఫోర్స్ అధికార వర్గాలు తెలిపాయి. మిగ్ 21 భారత్ తొలి సూపర్‌సోనిక్ యుద్ధ విమానం. దీన్ని 1963లో భారత వైమానిక దళంలో ప్రవేశపెట్టారు. ఈ విమానం 1960 నుంచి 70 సంవత్సరాల్లో సాంకేతికంగా అభివృద్ధి చేశారు. ప్రస్తుతం భారత వైమానిక దళం వద్ద మిగ్ 21 అనేక మోడల్స్ ఉన్నాయి. 1965 ఇండో-పాక్ యుద్ధం, 1971 బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం, 1999 కార్గిల్ యుద్ధం, 2019లో బాలాకోట్ వైమానిక దాడుల్లో మిగ్ 21 యుద్ధ విమానాలు కీలకపాత్ర పోషించాయి. బాలాకోట్ వైమానిక దాడుల సమయంలో అప్పటి వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ ఈ యుద్ధ విమానాన్నే నడిపిన విషయం తెలిసిందే. అదే సమయంలో ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ మిగ్ 21 సేవలు అందించాయని అధికార వర్గాలు తెలిపాయి. మిగ్-21ని రష్యా నుంచి భారత్ తీసుకువచ్చింది. ప్రభుత్వం 874 మిగ్-21లను కొనుగోలు చేసింది. ప్రపంచంలోని దాదాపు అరవై దేశాలు తమ ఫ్లీట్‌లో మిగ్ 21 యుద్ధ విమానాలను చేర్చుకున్నాయి. అయితే, ఇటీవల కాలంలో మిగ్-21 విమానాలు కూలిపోయిన విషయం తెలిసిందే. దాంతో క్రమంలో ఈ విమానాలను వెనక్కి తీసుకోవాలనే చర్చ మొదలైంది. భారత వైమానిక దళంలో మిగ్-21 చాలా సుదీర్ఘకాలం పాటు సేవలందించిందని, 1965 నుంచి ప్రతి సైనిక ఆపరేషన్‌లో పాల్గొందని ఎయిర్‌ఫోర్స్ వర్గాలు తెలిపాయి. సెప్టెంబర్‌లో చండీగఢ్‌లో జరిగే కార్యక్రమంలో వైమానిక దళం బైసన్ మిగ్ 21 విమానాలకు వీడ్కోలు పలుకనున్నది. ఈ కార్యక్రమానికి సీనియర్ వైమానిక దళ అధికారులు హాజరవుతారని సంబంధిత వర్గాలు వివరించాయి.

## రష్యాతో వాణిజ్యం.. మీ ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తాం : భారత్‌కు అమెరికా వార్నింగ్



**న్యూయార్క్-నవభూమి:** భారత్‌కు అగ్రరాజ్యం అమెరికా మరోసారి కీలక హెచ్చరికలు జారీ చేసింది. రష్యా నుంచి ఆయిల్ దిగుమతి చేసుకుంటే 100 శాతం సుంకాలు విధించనున్నట్లు యూఎస్ సెనేటర్ లిండ్సే గ్రాహమ్ హెచ్చరించారు. భారత్ మాత్రమే కాకుండా రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేసే చైనా , బ్రెజిల్ వంటి దేశాలకు కూడా ఇలాంటి హెచ్చరికలే చేశారు. రష్యా నుంచి తక్కువ ధరకు ఆయిల్ కొనుగోలు చేసి యుద్ధం కొనసాగించేందుకు సహకరిస్తున్న దేశాల ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తామంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఉక్రెయిన్, రష్యా మధ్య యుద్ధం ఆపేందుకు అగ్రరాజ్యం అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో రష్యా ను ఆర్థికంగా దెబ్బతీసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే ఉక్రెయిన్‌కు మద్దతు ఇవ్వకుండా రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తున్న దేశాలపై భారీ స్థాయిలో సుంకాలు విధించాలని యోచిస్తోంది. మాస్కోతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తున్న భారత్, చైనాపై 500 శాతం సుంకాలు విధిస్తామని ఇటీవలే హెచ్చరించిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి అలాంటి వార్నింగే ఇచ్చింది. రష్యా చమురు కొనుగోలు ఆపకపోతే భారత్, చైనా సహా మాస్కో వాణిజ్య భాగస్వాములైన దేశాలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ సుంకాలు విధిస్తారని లిండ్సే గ్రాహమ్ తాజాగా హెచ్చరించారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గ్రాహమ్ మాట్లాడుతూ.. 'రష్యా నుంచి ఆయిల్ దిగుమతి చేసుకునే భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు విధించబోతున్నారు. ఆయా దేశాలపై 100 శాతం టారిఫ్‌లు విధించనున్నారు. మీరు తక్కువ ధరకు ఆయిల్ కొని, యుద్ధం కొనసాగించేందుకు సహకరిస్తే అమెరికా మీ ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తుంది' అంటూ తీవ్రంగా హెచ్చరించారు.

## ఈ విద్యా సంస్థల్లో ప్రవేశాలు తీసుకోవద్దు.. ఎంబీబీఎస్ విద్యార్థులకు ఎన్ఎంసీ హెచ్చరిక




**న్యూఢిల్లీ-నవభూమి:** బెలిజ్‌లోని సెంట్రల్ అమెరికా ఈశాన్య తీరంలో ఉన్న వైద్య సంస్థల్లో అలాగే ఉజ్బెకిస్తాన్‌లోని ఒక వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చేయాలనుకునే విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవద్దని నేషనల్ మెడికల్ కమిషన్‌హెచ్చరించింది. బెలిజ్‌లోని సెంట్రల్ అమెరికన్ హెల్త్ అండ్ సైన్సెస్ యూనివర్సిటీ, కొలంబస్ సెంట్రల్ యూనివర్సిటీ, వాషింగ్టన్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ అండ్ సైన్సెస్‌తో సహా మూడు వైద్య సంస్థలలో అడ్మిషన్ తీసుకోవద్దని ఎన్ఎంసీ ఒక నోటీసులో భారతీయ విద్యార్థులకు సూచించింది. భారతీయ వైద్య విద్య ప్రమాణాలను పాటించకపోవడం, క్యాంపస్ మౌలిక సదుపాయాలు సరిగ్గా లేకపోవడం, నాణ్యత లేని క్లినికల్ శిక్షణ సౌకర్యాలు, భారతీయ విద్యార్థులపై వేధింపులు వంటి ఆందోళనల నేపథ్యంలో ఎన్ఎంసీ ఈ హెచ్చరికను జారీ చేసింది.

## బిల్డింగ్ లిఫ్టులో మూత్ర విసర్జన.. డెలివరీ బాయ్‌కి దేహశుద్ధి..

**ముంబై- నవభూమి:** మహారాష్ట్ర రాజధాని ముంబై లో బ్లింకిట్ డెలివరీ బాయ్ జుగుప్స కలిగించే పని చేశాడు. విరార్ వెస్ట్ లోని సీడీ గురుదేవ్ బిల్డింగ్ లిఫ్ట్‌లో మూత్ర విసర్జనకు పాల్పడ్డాడు. దాంతో ఆ డెలివరీ బాయ్‌పై కేసు నమోదైంది. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించి పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేశారు. డెలివరీ బాయ్ తన ఎడమ చేతిలో పార్శిల్ పట్టుకుని లిఫ్ట్ లోపల కనిపించాడు. లిఫ్ట్‌లో కొద్దిసేపు అటూఇటూ తిరిగిన అతడు తర్వాత ఒక మూలలో మూత్ర విసర్జన చేశాడు. భవనంలోని నివాసితులు లిఫ్ట్‌లో మూత్రం ఉండటాన్ని గమనించి సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు.

# భర్తను నదిలో తోసిన భార్య కేసులో ట్విస్ట్

## అతడిపైనే కేసు పెట్టిన పోలీసులు!



**రాయ్‌చూర్-నవభూమి:** వారం రోజుల కిందట భర్తను నదిలోకి తోసేసిన భార్య కేసు కర్ణాటకలో సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. తాజాగా, ఈ కేసు ఊహించని మలుపు తిరిగింది. భర్తపైనే పోలీసులు కేసు నమోదు చేసి లోపల వేశారు. ఎందుకంటే అతడి భార్య మైనర్ కావడమే ఇందులో పెద్ద ట్విస్ట్. తనను చంపడానికి ప్రయత్నించిన భార్యపై కేసు నమోదుచేయాలంటూ పోలీసు స్టేషన్‌కు వెళ్లిన భర్తకు పోలీసులు షాకిచ్చారు. అతడిపై పోక్సో చట్టం కిందట కేసు నమోదు చేశారు.

కర్ణాటకలోని రాయచూర్ జిల్లాలో ఉన్న శక్తినగర్‌కు చెందిన తాతప్పకు యాదగిర్ జిల్లాలోని వడిగేరి గ్రామానికి చెందిన గెట్టెమ్మతో మూడు నెలల క్రితం వివాహమైంది. ఈ జంట సరదాగా తిరిగొద్దామని బైక్‌పై వడిగేరికి వెళ్లి ఉదయం తిరుగు పయనమయ్యారు. అయితే, మార్గం మధ్యలో కృష్ణానదిపై ఉన్న గుర్జాపూర్ బ్రిడ్జిపై ఫొటోలు దిగాలని భావించారు. అలా భర్త తన ఫోన్‌ను భార్య చేతికి ఇచ్చి సెల్ఫీ తీయమని చెప్పి ఆయన బ్రిడ్జి చివరన నిలబడ్డాడు. గెట్టెమ్మ సెల్ఫీ తీస్తున్నట్లు నమ్మించి భర్తను నదిలోకి తోసేసింది. ఆ తర్వాత తాతప్ప తల్లికి ఫోన్ చేసి ఆయన నదిలో పడిపోయాడని చెప్పింది.

అదృష్టవశాత్తూ నదిలో పడిన తాతప్ప బ్రిడ్జి పక్కనే కొద్ది దూరంలో ఉన్న రాయిపైకి చేరుకుని "నన్ను రక్షించండి.. నా భార్య పారిపోకుండా పట్టుకోండి" అంటూ పెద్దగా కేకలు వేశాడు. దీంతో సమీపంలో చేపలు పడుతున్న జాలర్లు గమనించి తాతప్పను తాడు సహాయంతో ఒడ్డుకు చేర్చారు. పైకి వచ్చిన తాతప్ప.. భార్యే తనను నదిలోకి తోసేసిందని ఆగ్రహం వ్యక్తంచేశాడు. అతడి భార్య మాత్రం తాను తోయలేదని, ఆయనే ప్రమాదవశాత్తు నదిలో పడిపోయాడని వాదించింది. కాగా, మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో ప్రియుడి సాయంతో భర్తను చంపిన భార్య.. శవాన్ని ఇంట్లోనే పూడ్చిపెట్టింది.

ఈ విషయమై శక్తినగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ బస్వరాజ్ స్పందించారు. ఈ ఘటన జరిగిన విషయం వాస్తవమేనని తెలిపారు. భార్యాభర్తల మధ్య పంచాయతీ ఉందని, వారి కుటుంబ సభ్యులు మాట్లాడుకొని ఫిర్యాదు చేస్తామని అన్నట్లు ఎస్ఐ తెలిపారు. అయితే, ఇదే కేసులో భార్య మైనర్ కావడంతో భర్తపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. భర్తను నదిలోకి తోసేసినట్లు భార్య పోలీసుల ఎదుట నేరాన్ని అంగీకరించింది. కానీ ఇప్పుడు సీన్ మారడంతో.. చట్టపరంగా భర్తపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు ఉపక్రమించారు.

## బోర్డర్‌లో 'అపాచీ' దండయాత్ర ఆరంభం..




**జోధ్‌పూర్-నవభూమి:** ప్రపంచంలోనే అత్యంత భయంకరమైన హెలికాప్టర్లుగా గుర్తింపు పొందిన AH-64E అపాచీ' క్రాఫ్ట్‌లు అధికారికంగా భారత సైన్యంలోకి చేరాయి. జోధ్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్క్వాడ్రన్ 15 నెలల అనంతరం మొదటి మూడు అపాచీ హెలికాప్టర్లను స్వీకరించింది. తొలిదశలో మొత్తం ఆరు హెలికాప్టర్ల తయారీకి ఒప్పందం చేసుకుంది. అమెరికాకు చెందిన బోయింగ్ తయారుచేసిన ఈ హెలికాప్టర్ల విడి భాగాలను హైదరాబాద్ శివార్లలో టాటా భాగస్వామ్యంతో తయారయ్యాయి. సైన్యంలో ఈ హెలికాప్టర్లు చేరడం భారత పశ్చిమ సరిహద్దు ముఖ్యంగా పాకిస్థాన్ సమీప ప్రాంతాల్లో అత్యంత కీలకంగా మారనుంది. ప్రస్తుతం సైన్యం వద్ద ఉన్న 'ధ్రువ్ రుద్ర', 'ప్రచండ' వంటి స్వదేశీ హెలికాప్టర్లకు సాయంగా ఈ సూపర్ పవర్ రోటర్ క్రాఫ్ట్‌లుగా నిలుస్తాయి. కాగా, అపాచీ హెలికాప్టర్లను భారత్ ఉపయోగించడం ఇదే మొదటిసారి కాదు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (పఠాన్‌కోట్, జోర్హాట్ వైమానిక స్థావరాలు) ఇప్పటికే చైనా సరిహద్దుల్లో వీటిని మోహరించింది. ఇప్పుడు సైన్యానికి కూడా అపాచీ సేవలు అందించనుంది. భారీగా ఆయుధాలు కలిగి ఉన్న అపాచీ క్రాఫ్ట్‌లో 30 AGM-230 చైన్ గన్, 70 AGM-హైడ్రా రాకెట్లు, ఆరు కిలోమీటర్ల దూరం నుంచి సాయుధ వాహనాలు, ట్యాంకులను నాశనం చేయగల AGM-114 హెల్ఫైర్ క్షిపణులు ఉంటాయి. అలాగే, గగనతలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణులను కలిగి ఉంటుంది. ఇవి ట్యాంకులకు మాత్రమే కాకుండా, హెలికాప్టర్లు, కూడా ధ్వంసం చేయగలువు. భారత సైన్యం , వైమానికదళం వెర్షన్లు ఒకేలా ఉంటాయి. దీనిలో -78 లాంగ్‌బో రాడార్ అపాచీకి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. హెలికాప్టర్ రోటర్‌పై అమర్చిన ఈ మిల్లీమీటర్ వేవ్ రాడార్ ఒకేసారి 128 లక్ష్యాలను గుర్తించి, వాటిలో 16 టార్గెట్లను ప్రాధాన్యతనుబట్టి దాడి చేయగలదు. రాడార్లకు చిక్కకుండా కొండల్లో దాక్కుని టార్గెట్‌ను గుర్తించి ఒక్కసారిగా బటయకు వచ్చి విరుచుకుపడే సామర్థ్యం దీని ప్రత్యేకత. ఈ హెలికాప్టర్లు డ్రోన్‌ల నుంచి ప్రత్యక్ష డేటా తీసుకునే సామర్థ్యం కలిగి ఉండటం వల్ల పైలట్లకు యుద్ధ భూమిపై పూర్తి అవగాహన లభిస్తుంది. శత్రుపై దాడులను సమన్వయం చేసేందుకు, కమాండర్‌కు బహుళ డొమైన్ సమాచారం అందించేందుకు ఇది దోహదపడుతుంది. ప్రస్తుత ఆరు అపాచీలకు మాత్రమే ఆర్డర్ చేసినప్పటికీ.. సైన్యం మరిన్ని హెలికాప్టర్లను కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నాయి. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే చర్చలలో ఉన్నట్లు సమాచారం. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం మే నెలలో చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత, భారత సరిహద్దులో అపాచీ హెలికాప్టర్లు సైన్యంలోకి ప్రవేశించడంతో శత్రు కుట్రలకు చెక్ పెట్టే వీలు కలుగుతుంది. ఇవి ట్యాంకులు, ఉగ్రవాద శిబిరాలు, లాజిస్టిక్స్ కాన్వాయ్‌లు, రాడార్ కేంద్రాలపై అత్యంత వేగంగా, ఖచ్చితంగా దాడి చేయగలవు. బలమైన సురక్షణ వ్యవస్థలు, క్రాష్ రెసిస్టెంట్ డిజైన్, ఆర్మర్డ్ కాక్‌పిట్‌ల వల్ల ఇవి ఎటువంటి దాడినైనా తప్పించుకుని మిషన్‌ను పూర్తి చేయగలవు.

## గడ్చిరౌలిపై అర్బన్ నక్సల్స్ దుష్ప్రచారం చేస్తున్నారు: సీఎం ఫడ్నవీస్



**గడ్చిరౌలి-నవభూమి:** విదేశీ నిధులతో గడ్చిరోలిపై అర్బన్ నక్సల్స్ దుష్ప్రచారం చేస్తున్నారని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధికి దూరం చేస్తున్నారని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఆరోపించారు. లాయిడ్స్ మెటల్స్ అండ్ ఎనర్జీ లిమిటెడ్ సంస్థ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గడ్చిరౌలి జిల్లాలో జరిగిన వేర్వేరు ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. గడ్చిరౌలిలో నక్సలిజం తగ్గుతోందని, ప్రస్తుతం కొంత మంది నక్సలైట్లు మాత్రమే ఉన్నారని, వాళ్లను వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు అని, ఇక్కడి అడవుల్లో వాళ్లు ఉన్నారని ఆయన అన్నారు. హింసను వీడాలని నక్సలైట్లకు అప్పీల్ చేస్తున్నట్లు సీఎం ఫడ్నవీస్ తెలిపారు. ప్రధాన జీవనస్రవంతిలో కలవాలని కోరుతున్నట్లు చెప్పారు.

## అత్యంత సురక్షితమైన దేశాల్లో మనకంటే మెరుగైన స్థానంలో నిలిచిన పాకిస్థాన్..!



**కరాచీ-నవభూమి:** ప్రపంచంలోనే అత్యంత సురక్షితమైన దేశాల జాబితాలో మనకంటే (భారత్) దాయాది పాకిస్థాన్ మెరుగైన స్థానంలో నిలిచింది. నంబియో సేఫ్టీ ఇండెక్స్ ప్రకారం.. ప్రపంచంలో సురక్షిత దేశాల జాబితాలో భారత్ 66వ (55.7 సేఫ్టీ స్కోర్) స్థానంలో ఉండగా, పాక్ 65వ (56.3 సేఫ్టీ స్కోర్) స్థానంలో నిలిచింది. నంబియో భద్రతా సూచిక 147 దేశాలతో తాజాగా జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో ఫ్రాన్స్, స్పెయిన్ మధ్య పైరినీస్ పర్వతాల్లో ఉన్న చిన్న యూరోపియన్ దేశమైన అండోరా (84.7 సేఫ్టీ స్కోర్) తొలిస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో యూఏఈ (84.5 సేఫ్టీ స్కోర్), ఖతార్ (84.2 సేఫ్టీ స్కోర్), తైవాన్ (82.9 సేఫ్టీ స్కోర్) , ఒమన్ (81.7 సేఫ్టీ స్కోర్) దేశాలు మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయి. ఈ ఐదు దేశాల్లో ప్రపంచంలోనే అత్యంత బలమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయని ఇండెక్స్ డేటా పేర్కొంది. ఆయా దేశాల్లో భద్రతా పరిస్థితులు, నేరాల రేటు, ప్రజల జీవన ప్రమాణాలు పరిగణనలోనికి తీసుకొని ఈ ర్యాంకింగ్స్ ప్రకటించారు. ఈ ర్యాంకింగ్స్‌లో అమెరికా -89, బ్రిటన్ -87, చైనా -15, శ్రీలంక-59, బంగ్లాదేశ్-126 ర్యాంకులు పొందాయి. అమోన్ 147వ స్థానంలో నిలిచింది.


## కన్వర్ యాత్ర మార్గంలో హెూటళ్లపై లైసెన్స్ ప్రదర్శన.. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు



**లక్నో-నవభూమి:** కన్వర్ యాత్ర మార్గంలో దాబాలు, రెస్టారెంట్లు లైసెన్స్, రిజిస్ట్రేషన్ సమాచారం ప్రదర్శిం చాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొంది. "ప్రస్తుత దశలో హెూటల్ యజమానులంతా లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను చట్టబద్ధంగా ప్రదర్శించాలి. ఇందులో ఇతర అంశాల జోలికి మేము వెళ్లడం లేదు.. ఈ పిటిషన్‌ను ఇంతటితో ముగిస్తున్నాం" అని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొన్నట్టు ఏఎన్ఐ వార్తా సంస్థ నివేదించింది. కన్వర్ యాత్ర సాగే మార్గంలో దాబాలు, రెస్టారెంట్ల యజమానుల వివరాలను తెలియజేసే కోడ్ ప్రదర్శన తప్పనిసరి చేస్తూ ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఈ ఏడాది ప్రారంభంలో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిబంధనలపై అభ్యంతరాలు వ్యక్తమవుతుండాగానే.. ఉత్తరాఖండ్ ప్రభుత్వం కూడా ఇదే తరహా ఆదేశాలు వెలువరించింది. అయితే, ఇవి పౌరుల మౌలిక హక్కులను ఉల్లంఘించేలా ఉన్నాయని ఆరోపిస్తూ అకడమిక్ అపూర్వానంద్ జ్హా తదితరులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. "ఈ కోడ్ నిబంధనలు యజమానుల పేరు, గుర్తింపు వివరాలు బహిర్గతం చేస్తూ, మత వివక్షకు దారితీస్తాయి" అని వారు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లైసెన్స్ మాత్రమే తప్పనిసరి అని, యజమానుల మతపరమైన గుర్తింపును బహిర్గతం చేయడం చట్ట విరుద్ధమని వాదించారు. అంతేకాదు, ఇవి మైనారిటీ వర్గాలకు చెందిన వ్యాపారులపై మతపరమైన దాడులను ప్రేరేపించే ప్రమాదం ఉందని, వ్యాపారుల మౌలిక హక్కులను తీవ్రంగా దెబ్బతీస్తాయని పిటిషనర్లు హెచ్చరించారు. కాబట్టి, ప్రభుత్వం సాధారణ లైసెన్సింగ్ నిబంధనలకే పరిమితం కావాలని, అర్థంలేని సూచనలను వెంటనే రద్దు చేయాలని కోర్టును కోరారు. కాగా, గతేడాది కూడా యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు లైసెన్స్ ప్రదర్శించాలంటూ జారీ చేసిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. "వారు ఏ రకమైన ఆహారాన్ని విక్రయిస్తున్నారో మాత్రమే తెలియజేయాలి. యజమాని లేదా సిబ్బంది వివరాలు బహిర్గతం చేయాలని బలవంతం చేయరాదు' అని కోర్టు పేర్కొంది. అయితే, ఈ ఉత్తర్వులను యోగి ఆదిత్యనాథ్ సర్కారు మాత్రం సమర్థించుకుంది. యాత్ర సజావుగా సాగడానికి మాత్రమే ఈ ఉత్తర్వులు జారీచేసినట్టు తెలిపింది. మరోవైపు, కన్వర్ యాత్రను ఉద్దేశించి మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ ట్విట్టర్‌లో చేసిన పోస్ట్‌పై తీవ్ర దుమారం రేగిన సంగతి తెలిసిందే. రోడ్డుపై కన్వర్ యాత్రికుల వెళ్తున్న ఫోటో.. ఇంకోటి రోడ్డుపై ముస్లింలు నమాజ్ చేస్తోన్న ఫోటోలను షేర్ చేసిన ఆయన.. ఒకే దేశం రెండు చట్టాలా? అంటూ విమర్శలు గుప్పించారు.


## 20 ఏళ్లుగా 150కి పైగా లగ్జరీ కార్లు కొట్టేశాడు..

### చివరకు ఓ చిన్న తప్పుతో పోలీసులకు చిక్కాడు!



**జైపూర్-నవభూమి:** దేశవ్యాప్తంగా దాదాపు 150కి పైగా ఖరీదైన లగ్జరీ కార్లను దొంగిలించి, దశాబ్దాలుగా పోలీసులకు సవాల్ విసిరిన ఒక హైటెక్ దొంగను చెన్నై పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజస్థాన్‌కు చెందిన సత్యేంద్ర సింగ్ షెకావత్ అనే ఈ దొంగను పుదుచ్చేరిలో పట్టుకున్నారు. ఇతని అరెస్టుతో అనేక రాష్ట్రాల్లో నమోదు అయిన వందలాది కార్ల దొంగతనం కేసులకు తెరపడింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. 45 ఏళ్ల సత్యేంద్ర సింగ్ షెకావత్ ఉన్నత విద్యావంతుడు. ఇతను ఎంబీఏ పట్టభద్రుడు కాగా.. ఇతని తండ్రి ఆర్మీ అధికారిగా పదవీ విరమణ చేశారు. విలాసవంతమైన జీవితానికి అలవాటు పడిన సత్యేంద్ర.. సుమారు 20 సంవత్సరాలుగా ఈ హైటెక్ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. అయితే కేవలం లగ్జరీ కార్లను మాత్రమే లక్ష్యంగా చేసుకున్న ఇతడు.. పక్కా పథకం ప్రకారమే కార్లను కొట్టేశేవాడు. ముందుగా సర్వీసింగ్ సెంటర్లు, పార్కింగ్ ప్రదేశాల్లో వదిలి వేసిన ఖరీదైన కార్లను గుర్తించేవాడు. అనంతరం ఆ కారు యజమానులకు ఏ మాత్రం అనుమానం రాకుండా.. ఆ వాహనాల్లో రహస్యంగా జీపీఎస్ ట్రాకర్‌లను అమర్చేవాడు. జీపీఎస్ ద్వారా కారు ఎక్కడ ఉందో పసిగట్టి, అదును చూసి అత్యాధునిక పరికరాలతో వాటి కీ కోడ్‌లను డీకోడ్ చేసి, ఎలాంటి శబ్దం లేకుండానే కార్లను చాకచక్యంగా దొంగిలించేవాడు. దొంగిలించిన కార్లను నేరుగా రాజస్థాన్‌కు తీసుకెళ్లి.. అక్కడి నుంచి నేపాల్‌తో సహా ఇతర రాష్ట్రాలకు తరలించి అధిక ధరకు విక్రయించేవాడు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి వంటి పలు రాష్ట్రాల్లో ఇతనిపై వందల సంఖ్యలో కేసులు నమోదు అయ్యాయి. ఈ వ్యూహం కారణంగానే ఇన్నేళ్లుగా ఏ రాష్ట్ర పోలీసులు కూడా ఇతన్ని పట్టుకోలేకపోయారు. ఈ దొంగతనం ముఠా గుట్టు రట్టు కావడానికి చెన్నైలోని అన్నా నగర్‌లో జరిగిన ఒక దొంగతనం కేసు కీలకంగా మారింది. ముఖ్యంగా అన్నా నగర్‌కు చెందిన ఎత్తిరాజ్ రత్నం అనే వ్యక్తికి చెందిన ఖరీదైన కారు గత నెలలో చోరీకి గురైంది. ఈ ఘటనపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. అయితే ఎప్పుడూ సీసీటీవీ కెమెరాలు పరిశీలించి ముఖం కనిపించకుండా జాగ్రత్త పడే సత్యేంద్ర.. ఈ కేసులో మాత్రం ఓ కెమెరాను గుర్తించలేకపోయాడు. ఫలితంగా సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దొంగ జాడను గుర్తించిన పోలీసులు.. అతడు పుదుచ్చేరిలో నక్కి ఉన్నట్లు తెలుసుకున్నారు. వెంటనే అక్కడకు చేరుకుని సత్యేంద్ర సింగ్ షెకావత్‌ను అరెస్ట్ చేశారు. ఆపై విచారణ జరుపగా.. విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా పోలీసులు ఇతని నుంచి కీలక సమాచారాన్ని రాబట్టారు. 20 ఏళ్లలో 150కి పైగా కార్లను దొంగిలించినట్లు, వాటిని విక్రయించి కోట్లు సంపాదించినట్లు విచారణలో తేలింది. ఇతని హైటెక్ దొంగతనం పద్ధతులు పోలీసులనే ఆశ్చర్య పరిచాయి. సత్యేంద్ర సింగ్ షెకావత్‌ను కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఇతని అరెస్టుతో దేశవ్యాప్తంగా పలు కార్ల దొంగతనం కేసులు పరిష్కారం అయ్యే అవకాశం ఉంది.

## ఐఐటీ ఖరగ్‌పూర్‌లో మరో విద్యార్థి అనుమానాస్పద మృతి



**ఖరగ్‌పూర్-నవభూమి:** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఖరగ్‌పూర్‌లో మరో విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. సెకండియర్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విద్యార్థి చంద్రదీప్ పవార్ సోమవారం రాత్రి చనిపోయాడు. గత నాలుగు రోజుల్లో ఆ సంస్థ క్యాంపస్‌లో ఇది రెండో ఘటన కావడం గమనార్హం. సోమవారం రాత్రి భోజనం చేసిన తర్వాత చంద్రదీప్ వైద్యుడి సలహా మేరకు ఏదో మెడిసిన్ వాడినట్లు స్థానిక పోలీసులకు ఐఐటీ ఖరగ్‌పూర్ అధికారులు తెలియజేశారు. అతడు తీసుకున్న టాబ్లెట్ శ్వాసనాళంలో ఇరుక్కుపోయి, చివరికి అతని మరణానికి కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తంచేశారు. మధ్యప్రదేశ్ నివాసి అయిన చంద్రదీప్‌ను మొదట ఐఐటీ క్యాంపస్‌లోని ఆసుపత్రికి తరలించారు. అయితే వైద్యులు అప్పటికే అతడు చనిపోయినట్లు ధ్రువీకరించారు. విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పంపారు. అతని మరణానికి అసలు కారణం శవపరీక్ష నివేదిక వచ్చిన తర్వాతే తెలుస్తుందని అధికారులు వెల్లడించారు. స్థానిక పోలీసులు ఈ విషయంపై దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సోమవారం రాత్రే సమాచారం అందించడంతో వారు మంగళవారం ఉదయం ఖరగ్‌పూర్ చేరుకున్నారు. అయితే గత కొన్ని రోజులుగా చంద్రదీప్ ఒక రకమైన మానసిక ఒత్తిడితో బాధపడుతున్నట్లు సమాచారం. అందువల్ల అతని మరణంపై కొంత గందరగోళం నెలకొందని ఇన్‌స్టిట్యూట్‌లోని ఒక అధికారి తెలిపారు. ఈ నెల 18న కూడా మెకానికల్ ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థి రితం మండల్ మృతదేహం అతని హాస్టల్ గదిలో అనుమానాస్పద స్థితిలో కనిపించింది.

## కన్వర్ యాత్ర మార్గాల్లోని హెూటళ్లు లైసెన్సులు డిస్‌ప్లే చేయాలి: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ-నవభూమి:** ఉత్తరాది రాష్ట్రాల్లో కన్వర్ యాత్ర జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ నేపథ్యంలో దాఖలైన ఓ పిటీషన్‌పై స్పందిస్తూ.. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. క్యూఆర్ కోడ్‌ను హెూటళ్ల వద్ద పెట్టాలని యూపీ సర్కార్ ఇచ్చిన ఆదేశాలపై స్టే ఇచ్చేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. అయితే కన్వర్ యాత్ర మార్గంలో ఉన్న హెూటళ్లు అన్నీ తమ లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు డిస్‌ప్లే చేయాలని ఆదేశించింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 హైదరాబాద్
బుధవారం
23 । జులై । 2025



## ఎన్సీఈఆర్టీ బుక్స్ నుంచి పైకా తిరుగుబాటు తొలగింపు.. ఒడిశా మాజీ సీఎం ఆందోళన



న్యూఢిల్లీ-నవభూమి: ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్సీఈఆర్టీ పుస్తకాల నుంచి పైకా తిరుగుబాటు పాఠ్యాంశాన్ని తొలగించడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒడిశా వీరత్వానికి చిహ్నమైన ఆ తిరుగుబాటు గురించి పుస్తకాల్లో లేకుండా చేశారని ఆయన ఆరోపించారు. పైకా తిరుగుబాటు లేదా పైకా విద్రోహం గురించి పాఠ్యాన్ని ఎన్సీఈఆర్టీ తొలగించిందని, ఒడిశా చరిత్రలో అదో కీలక ఘట్టం అని, కానీ ఆ అంశాన్ని పాఠ్య పుస్తకాల నుంచి తొలగించడం సమంజసం కాదు అని పట్నాయక్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయన కేంద్ర విద్యాశాఖ మంత్రికి లేఖ రాశారు.

1817లో బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పైకా తిరుగుబాటు జరిగింది. సిపాయి ముటీనీకి 40 ఏళ్ల క్రితమే పైకా తిరుగుబాటు జరిగిందని, ఈ పాఠాన్ని టెక్స్ట్ బుక్స్ నుంచి ఎందుకు తీసి వేశారని ఆయన ప్రశ్నించారు. ఆ యోధులను అగౌరవపరచడమే అవుతుందన్నారు. పైకా తిరుగుబాటుదారుల పాఠ్యాంశాన్ని పునర్ పరిశీలించాలని ఒడిశా సీఎంను, కేంద్ర విద్యాశాఖ మంత్రిని కోరుతున్నట్లు మాజీ సీఎం పట్నాయక్ తెలిపారు.



## ఇ-గ్రంథాలయాల వికాసం నాలెడ్జ్ ఎకానమీకి పునాది

మన సమాజ అభివృద్ధికి మూలస్తంభంగా నిలిచే దారులలో "గ్రంథాలయాల"కు ఉన్న ప్రాధాన్యం అంతులేనిది. చదువు, పరిశోధన, భావన, చింతన అనే నాలుగు మూల్యాలకు గ్రంథాలయాలే ఆదిమ శ్రోతలు. కానీ ప్రస్తుత డిజిటల్ యుగంలో మనం ఎంతగా సాంకేతికంగా ముందుకు వెళ్తున్నామన్నదానితోపాటు, జ్ఞానాన్ని అందుబాటులోకి తేవడంలో ఎంత వెనుకపడుతున్నామో కూడ పరిశీలించాల్సిన సమయం ఇది. ప్రత్యేకంగా, ఇ-గ్రంథాలయాల ఏర్పాటు గురించి చర్చకు దారితీసే సందర్భాలు ఇప్పుడు దేశవ్యాప్తంగా గుర్తించబడుతున్నాయి. భారతదేశం వంటి జనసాంద్రత కలిగిన, భాషా వైవిధ్యమున్న దేశంలో ప్రస్తుతం సుమారు 54,854 గ్రంథాలయాలు ఉన్నాయని సమాచారం. కానీ ఆ గ్రంథాలయాలలో ఉన్న పుస్తకాల సగటు సంఖ్య కేవలం 5,700 మాత్రమే. ఇది అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చితే ఎంతో తక్కువ. ఉదాహరణకు, అమెరికాలో గానీ, యూరప్ దేశాల్లో గానీ, సాధారణంగా ప్రతి లైబ్రరీలో దాదాపు లక్షా ఎనిమిది వేల పుస్తకాలు ఉంటాయి. ఇది మిగిలిన ప్రపంచ దేశాల్లో ఉన్న "చదువు ప్రాధాన్యత" మరియు "గ్రంథాలయాల సామర్థ్యం"ను స్పష్టం చేస్తోంది. మన దేశంలోని లైబ్రరీలలో కేవలం 12 శాతానికే కంప్యూటర్లు ఉన్నాయి. వాటిలోనూ మళ్లీ కొన్ని గ్రంథాలయాలకే ఇంటర్నెట్ సదుపాయం ఉంది. అంటే, సాంకేతిక ప్రగతిలో మిగతా రంగాలా మనం లైబ్రరీ వ్యవస్థను డిజిటలైజ్ చేయలేకపోయాం. లైబ్రరీలలో పని చేస్తున్న సిబ్బంది సంఖ్య దేశవ్యాప్తంగా దాదాపు 12 లక్షల మందికి పైగా ఉన్నా, వారిలో కేవలం 10 శాతం మందికే లైబ్రరీ శాస్త్రంలో ప్రొఫెషనల్ అర్హతలు ఉన్నాయి. మిగిలినవారు అర్హతలేని సిబ్బందిగా కొనసాగుతున్నారు. ఇది గ్రంథాలయాల పరిపాలన నాణ్యతపై నేరుగా ప్రభావం చూపుతోంది. వృత్తిపరమైన శిక్షణ లేకుండా, ఆధునిక అవసరాల మేరకు సాంకేతిక పరిజ్ఞానం లేకుండా, గ్రంథాలయాల రూపు మారడం అసాధ్యం. భారత ప్రభుత్వ సంస్కృతి మంత్రిత్వ శాఖ నేషనల్ బుక్ ట్రస్ట్ సహకారంతో ప్రారంభించిన 'ఇ-పుస్తకాలయం' అనేది ఒక మంచి ప్రారంభం. ఇందులో 1000 పాఠ్యేతర పుస్తకాలు 22 భాషల్లో అందుబాటులో ఉన్నాయి. కానీ ఇది సరిపోదు. మన దేశ భాషా సంపద ఎంతో విశాలమైనది. దేశవ్యాప్తంగా వందలాది భాషలు, మాండలిక భాషలు ఉన్నాయి. వాటికి చెందిన సాహిత్యం, జానపద కథలు, నాటకాలు, గీతాలు, శాస్త్ర రచనలు అన్నింటినీ డిజిటలైజ్ చేసి ఈ-గ్రంథాలయాల్లో పొందుపరచాల్సిన అవసరం ఉంది.

ఈ విస్తృత భాషా సంపదను భద్రపరచడంలో ఇ-గ్రంథాలయాలే కీలకపాత్ర పోషించగలవు. ఇప్పటివరకు కొన్ని పరిశ్రమలు, సంస్థలు తాళపత్ర పుస్తకాలను డిజిటలైజ్ చేయడంలో పాల్గొన్నప్పటికీ, ఇది పెద్ద ఎత్తున ప్రభుత్వ ప్రయోజనంతో, పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్‌షిప్ మోడల్ ద్వారా సాధ్యపడే పని.

ఈ రోజుల్లో పిల్లల నుంచి పెద్దల వరకు సాంప్రదాయ పుస్తకాలకంటే ఇ-బుక్స్, ఆడియో పుస్తకాలు, గ్రాఫిక్ నవలలు, మల్టీమీడియా ఆధారిత పాఠ్యాలు వంటి వాటిపై ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ మారుతున్న పఠన సంస్కృతిని గుర్తించి, అందుకు అనుగుణంగా లైబ్రరీల ఆధారభూత వసతులను మార్చాల్సిన అవసరం ఏర్పడింది. ప్రతి గ్రామానికి, పట్టణానికి కనీసం ఒక డిజిటల్ లైబ్రరీ ఉండాలి. అందులో ఉచిత వైఫై, ఆన్‌లైన్ పాఠ్య వనరులు, వర్చువల్ లెర్నింగ్ ప్లాట్‌ఫాంలు, భాషానుగుణ శిక్షణ సాఫ్ట్‌వేర్‌లు ఉండాలి. లైబ్రరీలు బుక్ స్టోర్‌లుగా కాకుండా, నాలెడ్జ్ హబ్‌లుగా మారాలి. భారతదేశంలో సామాజిక మార్పు తీసుకురావడానికి విద్య కీలకం. విద్యలో పఠనానికి వేదికలుగా గ్రంథాలయాలు ఉండాలి. ఇందుకు స్ఫూర్తిదాయక ఉదాహరణలు మన చుట్టూ ఎన్నో ఉన్నాయి. ఉదాహరణకు, డార్జిలింగ్‌కు చెందిన సామాజిక సేవకురాలు ఆక్వి తామి, మహారాష్ట్రలో మహిళల కోసం ప్రత్యేక గ్రంథాలయాలు ఏర్పాటు చేశారు. ఇది మహిళల మధ్య విద్యాసాధనను ప్రోత్సహించడంలో కీలకపాత్ర పోషించింది. అలాగే, తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో తోపుడు బండి సాదిక్ అనే యువకుడు చదువును నడిచే బండిలో తీసుకెళ్లే ప్రయత్నం చేశాడు. ఈ ప్రయత్నాలు ఒక అవగాహనకు సంకేతం. అలాగే పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలు తమ గ్రంథాలయాలను ఓపెన్ ఆక్సెస్ మోడల్‌లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ లైబ్రరీలు, ఈ-బుక్ వాహనాలు ప్రవేశపెట్టాలి.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు డిజిటల్ మిషన్ పేరుతో ఎన్నో ప్రకటనలు చేస్తున్నప్పటికీ, పాఠశాలల స్థాయిలోనూ, గ్రామాల స్థాయిలోనూ లైబ్రరీలు స్థాపించడంలో పెద్దగా పురోగతిని చూపలేకపోతున్నాయి. ప్రభుత్వ గ్రంథాలయాల పునరుద్ధరణ పేరుతో ప్రారంభించిన పథకాలు దశాబ్దాలుగా నిద్రలోనే ఉన్నాయి. ప్రభుత్వాలు బడ్జెట్‌లో ప్రత్యేకంగా గ్రంథాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి. గ్రామ స్థాయిలో లైబ్రరీల నిర్వహణకు కమ్యూనిటీ వాలంటీర్ మోడల్‌ను ప్రవేశపెట్టాలి. గ్రంథాలయ వేదికగా చదువు, పఠనం, నైపుణ్యం, అన్వేషణ అనే నాలుగు దిశల అభివృద్ధికి మౌలిక సదుపాయాలు కల్పించాలి. జ్ఞానసంపత్తికి రక్షణ తాళపత్రాల నుంచి ఆర్కైవ్‌ల దాకామన సంస్కృతి, మన చరిత్ర, మన భాషలంతా పుస్తకాల రూపంలో, పాఠ్యరూపంలో పదిమందికీ అందుబాటులో లేనంతవరకు అవి మిగిలినవి కావు. తాళపత్ర గ్రంథాలు, ప్రాచీన కవిత్వం, లిఖిత గాథలు అన్నింటినీ డిజిటల్ ఫార్మాట్‌లో భద్రపరచి ఆర్కైవ్ సిస్టమ్లో పొందుపరచాల్సిన అవసరం ఉంది. ఇది మన భవిష్యత తరాల కోసం ఒక విలువైన మానవవనరుగా పనిచేస్తుంది. ఈ అభివృద్ధికి ప్రభుత్వాలకే కాదు, వ్యక్తుల, సంస్థల, స్వచ్ఛంద సంస్థల, విద్యార్థి సంఘాల పాత్ర కూడా కీలకం. ఇవి సంయుక్తంగా పని చేస్తేనే ఒక జ్ఞాన విప్లవం ప్రారంభమవుతుంది. గ్రంథాలయాలు కేవలం పుస్తకాల గదులు కావు. అవి చైతన్య కేంద్రాలు. అవి శిక్షణ శాలలు. అవి సామాజిక సమానత్వానికి వేదికలు. ఈ డిజిటల్ యుగంలో మన గ్రంథాలయాల చైతన్యం వెనకబడకూడదు. ఇ-గ్రంథాలయాల స్థాపన, పుస్తకాల డిజిటలైజేషన్, విభిన్న భాషల్లో వనరులు, సాంకేతిక శిక్షణ, ఇంటర్నెట్ అందుబాటు -ఇవన్నీ కలిసినప్పుడు మాత్రమే భారత జ్ఞానప్రపంచం నూతన తరం దిశగా పయనించగలదు.

ఇది కేవలం విజ్ఞానవేదిక నిర్మాణమే కాదు - భవిష్యత్ భారతాన్ని నిర్మించే ఉద్యమం కూడా.

## ఒక గిరిజన నేత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన ఋషితుల్య యోధుడు గాం మల్లుదొర



భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో అల్లూరి సీతారామరాజు పేరు తరతరాల గుండెల్లో గొప్ప గౌరవంతో పలికేది. ఆయనతో కలిసి మన్యం ప్రాంతాల్లో బ్రిటిష్ ఆధిపత్యానికి వ్యతిరేకంగా తలెత్తిన గిరిజన ఉద్యమాన్ని ముందుండి నడిపించిన ఆదివాసీ నాయకుడు గాం మల్లుదొర, తన జీవన పయనంలో దేశానికి శ్రమించి, త్యాగించి, చివరికి ఒక ప్రజా నాయకుడిగా చరిత్రకు ఓ సజీవ సాక్షిగా నిలిచిన మహనీయుడు. గాం మల్లుదొర జన్మించిన గ్రామం ఇప్పటి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కొయ్యూరు మండలం, లంకవీధి సమీపంలోని బట్టపనుకుల అనే చిన్న మారుమూల పల్లె. ఆయన తల్లిదండ్రులు బొగ్గదొర, అక్కమ్మ దంపతులు. ఆనాటి ఆదివాసీ కుటుంబాల్లో లాగే సాధారణ జీవితమే గడిపిన మల్లుదొర చిన్ననాటి నుంచే దయార్ద్ర స్వభావం, నైతిక బలం, ప్రజల పట్ల బాధ్యత అనే విలువలను ఆకళింపు చేసుకుంటూ పెరిగాడు. బ్రిటిష్ ప్రభుత్వం గిరిజనులపై చూపుతున్న అణచివేత, దోపిడీ, విచక్షణారహిత భూముల ఆక్రమణ మొదలైన అన్యాయాలు అతనిలో తిరుగుబాటుకు నాంది పలికాయి. అల్లూరితో ఏర్పడిన బంధం %-% విప్లవ మార్గంలో అడుగులు

బ్రిటిష్ పాలనలో గిరిజనులు ఎదుర్కొంటున్న దుర్మార్గాలను ఎదుర్కొనడంలో అల్లూరి సీతారామరాజుతో మల్లుదొర తొలిసారిగా కలిసిన సందర్భం 1921-22 కాలంలో. అల్లూరి అప్పటికే మన్యంలో తిరుగుతూ, గిరిజనులకు స్వాతంత్ర్యం, స్వచ్ఛంద జీవితం గురించి చైతన్యం కలిగిస్తున్నాడు. అటువంటి తరుణంలో మల్లుదొర అతనిని కలవడం అనేది భవిష్యత్తు ఉద్యమానికి ఒక ప్రాథమిక శిలాఫలకం. ఆయన అల్లూరికి కుడిభుజంగా మారాడు. అల్లూరి సైన్యంలో గాం సోదరులు ముఖ్యపాత్ర పోషించారు. మల్లుదొర ఆ సైన్యంలో అగ్రస్థానాన్ని సంపాదించుకున్నాడు. 1922 ఆగస్టు 22న చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై అల్లూరి దాడి చేశాడు. ఆ సైన్యంలో మల్లుదొర ప్రాథమిక నేతలలో ఒకడు. ఈ దాడి తరువాత బ్రిటిష్ ప్రభుత్వానికి గిరిజన తిరుగుబాటు పూర్తిగా తెలుస్తుంది. 1922 నుంచి 1924 వరకు సాగిన ఈ మన్యం విప్లవంలో మల్లుదొర క్రియాశీలకంగా పాల్గొన్నారు.

అరెస్టు, న్యాయపరమైన వేధింపులు

1923 సెప్టెంబర్ 17న మల్లుదొరను బ్రిటిష్ పోలీసులు నడింపాలెం అనే ప్రాంతంలో అరెస్టు చేశారు. విప్లవ కార్యకలాపాల్లో పాల్గొన్న నేతల వివరాలు చెప్పమని తీవ్ర హింసలకు గురిచేశారు. అయినప్పటికీ మల్లుదొర ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఈ కారణంగా అతనిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, వాల్తేరు ఏజెన్సీ కోర్టులో ప్రవేశపెట్టారు. 1924 అక్టోబర్ 23న న్యాయమూర్తి ఆయనకు మరణశిక్ష విధించారు. అయితే మద్రాస్ హైకోర్టులో అప్పీల్ చేసిన అనంతరం ఆ శిక్ష జీవితకాల కారాగార శిక్షగా మారింది. ఆయనను అప్పటి అండమాన్ కారాగారానికి పంపించారు. అక్కడే ఆయన 13 సంవత్సరాలు 6 నెలలపాటు శిక్ష అనుభవించారు. దుర్భర పరిస్థితుల్లో, తీవ్రమైన హింసల మధ్య అయినా తన ఆదర్శాల పట్ల ఏమాత్రం తగ్గలేదు. ఆజాద్ హింద్ దేశం ఆశతో జీవించాడు. స్వాతంత్ర్యానంతర ప్రజా జీవితంలో మల్లుదొర పాత్ర

దేశానికి స్వాతంత్ర్యం లభించిన అనంతరం మల్లుదొర జైలు నుంచి విడుదలయ్యారు. అప్పటికే ఆయన జీవితం అనేక క్షణాల్లో శారీరకంగా దెబ్బతిన్నా, మానసికంగా మాత్రం అసలు కుంగిపోలేదు. స్వగ్రామానికి తిరిగి వచ్చి ప్రజల మధ్యే జీవించాడు. 1952లో జరిగిన తొలి సాధారణ ఎన్నికల్లో విశాఖపట్నం లోకసభ రిజర్వ్ స్థానంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. పార్లమెంట్‌లో అడుగుపెట్టి, గిరిజనుల పోరాటానికి, మన్యం విప్లవానికి, అల్లూరి సీతారామరాజుకు ఉన్న గొప్ప స్మృతిని తన తొలి ప్రసంగంలో పంచుకున్నారు.

ఆ ప్రసంగం ముగిసిన తర్వాత నాటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ, మంత్రిమండలి సభ్యులంతా లేచి చప్పట్లు కొడుతూ అభినందించడం ఒక చారిత్రక ఘట్టంగా చర్చించబడింది. రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ కూడా మల్లుదొరను ప్రత్యేకంగా కలసి గౌరవించారు.

**తుదికాలంలో నిర్లక్ష్యం - ఓ విప్లవ వీరుడి మౌన విమర్శ**

అంతటి త్యాగస్వరూపుడు అయిన మల్లుదొర తన పదవీ కాలం తర్వాత పూర్తిగా రాజకీయాలలోనూ ప్రజా జీవితంలోనూ కనిపించకుండా పోయాడు. తన స్వగ్రామంలో తాను స్వయంగా జీవించడానికి ప్రయత్నించాడు. కానీ దారుణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. చివరకు అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి కొంత ఆర్థిక సహాయం చేయడంతోనే కుటుంబం బ్రతికింది. ఈ పరిస్థితే భారత స్వాతంత్ర్య పోరాటంలో పాలుపంచుకున్న ఎంతో మంది యోధులు తమ చివరి రోజుల్లో ఎదుర్కొన్న పరిస్థితుల జాడను మిగులుస్తోంది. వీరుల త్యాగాలను విస్మరించడం, వారి జీవన అవసరాలకు ప్రభుత్వాలు కనీస స్పందన చూపించకపోవడం స్వాతంత్ర్య భారతం మీదే ప్రశ్నార్థకంగా నిలుస్తుంది.

**చరిత్రకు నూతన పాఠం - మల్లుదొర నుండి నేర్చుకోవలసినది**

మల్లుదొర జీవితం ఒక ఆదర్శం. ఒక చీకటి కాలంలో వెలుగు చూపిన దీపం. అతను గిరిజన ఉద్యమ నాయకుడిగా మాత్రమే కాకుండా, సమాజ మార్పుకు ప్రజాశక్తిగా మారిన వ్యక్తి. ఆయన జీవితంలో సంక్షిప్తంగా చూస్తే:

బ్రిటిష్ వలస పాలనకు గిరిజన ప్రజల యుద్ధాన్ని ముందుండి నడిపిన యోధుడు

అల్లూరి సీతారామరాజుతో సమానంగా మన్యం విప్లవాన్ని నిర్మించిన సైనికుడు

కాలనీ శక్తులకు ఎదురు నిలబడి, జైలు జీవితాన్ని సహించీ, స్వతంత్ర భారతం చూడగలిగిన గొప్ప శౌర్యం కలిగిన వ్యక్తి

ఒక లోకసభ సభ్యుడిగా గిరిజనుల గొంతు అవటంతో పాటు, తన వేదికను ఉద్యమాల కోసం వినియోగించుకున్న సమర్థ నేత

చివరికి నిర్లక్ష్యం ఎదుర్కొన్న త్యాగమూర్తిగా చరిత్రకు తలదించేలా చేసిన ఒక ఉదాహరణ

ముగింపు

గాం మల్లుదొర భారత గిరిజన ఉద్యమ చరిత్రలో ఒక శాశ్వత శిల్పం. ఆయన జీవితాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలనే డిమాండ్ వాస్తవంగా సమాజానికి, యువతకు అవసరమైనది. ఎందుకంటే ఆయన త్యాగం, ఉద్యమ నిబద్ధత, ప్రజల పట్ల బాధ్యత - ఇవన్నీ ఒక నేటి నాయకుడిలో ఉండాల్సిన లక్షణాలే. మన్యం వీరుడు మల్లుదొర, చరిత్రలో కాకుండా మనిషి మనసుల్లో నిలిచి ఉండాలి.

-సహాయ మీడియా సర్వీస్

## జిఎస్ఎల్వి-ఎఫ్16: నిసార్‌తో అంతరిక్ష రంగంలో భారతదేశం కొత్త శకం



భారత సిద్ధంగా ఉంది. జి.ఎస్.ఎల్.వి-ఎఫ్16 అనే రాకెట్‌ను శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుండి జూలై 30, 2025 నాడు ప్రయోగించబోతోంది. ఇది కేవలం ఒక ప్రయోగం మాత్రమే కాదు. భూమిమ్మిన్నీ అర్థం చేసుకోవడంలో విప్లవాత్మక మార్పులు తేగల "నాసా-ఇస్రో సింథటిక్ ఎపర్చర్ రాడార్ (నిసార్)" అనేఈ ఉపగ్రహాజ్ని ఇది మోసుకుపోతుంది. ఇస్రో రూపొందించిన జి.ఎస్.ఎల్.వి భారీ ఉపగ్రహాలను భూమికి ఎత్తులో ఉండే కక్ష్యలోకి ప్రవేశపెడుతుంది. జాతీయ అవసరాల కోసం మన స్వంత ఉపగ్రహాలను ప్రయోగించే శక్తిని ఇది మనకు అందించింది. దీనిలో ప్రత్యేకత స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్ ఇంజిన్ ఉపయోయయుగించడం గమనార్హం. దీనిని గతంలో చాలా దేశాలు మన దేశానికి ఇవ్వడానికి నిరాకరించాయి.




నిసార్ - భారతదేశ భవిష్యత్తుకు ఒక అనివార్యమైన నేత్రం: ' నిసార్ ' ఉపగ్రహం నాసా ఇస్రోల మధ్య ఉమ్మడి ప్రాజెక్ట్ అయినప్పటికీ, ఇది మన దేశానికి అవసరమైన ఎంతో విలువైన కీలక సమాచారాన్ని అందిస్తుంది. దాదాపు 2800 కిలోల బరువున్న ఈ భూపరిశీలనా ఉపగ్రహంలోభూ ఉపరితలం, మంచు ప్రాంతాల గురించి మునుపెన్నడూ లేని విధంగా స్పష్టమైన సమాచారాన్ని అందించేఅత్యాధునిక ద్వంద్వ-ఫ్రీక్వెన్సీ (ఎల్-బ్యాండ్, ఎస్-బ్యాండ్) సింథటిక్ ఎపర్చర్ రాడార్ (ఎస్ఎఆర్) వ్యవస్థలు ఉన్నాయి. వీటి సామర్థ్యాలు మనదేశ విపత్తుల నిర్వహణకు, సిద్ధంగా ఉండటానికి అత్యంత కీలకం. హిమాలయ ప్రాంతం, ఈశాన్య రాష్ట్రాలు తరచుగా భూకంపాలు, కొండచరియలు విరిగిపడటానికి గురవుతాయి. నిసార్‌లోని రాడార్ వ్యవస్థ భూమిలో జరిగే అతి సూక్ష్మమైన మార్పులను గుర్తించగలదు. ఇది భూకంపాలు వచ్చే ప్రదేశాలను బాగా అర్థం చేసుకోవడానికి, కొండచరియలు పడే అవకాశం ఉన్న ప్రాంతాలను పర్యవేక్షించడానికి, ముందుగానే హెచ్చరికలు ఇవ్వడానికి ఎంతగానో సహాయపడుతుంది. ప్రతి సంవత్సరం భారతదేశంలో వచ్చే వరదలను పర్యవేక్షించడానికి ఇది అనివార్యం. మేఘాలు అడ్డుగా ఉన్నా, రాత్రిపూట కూడా చిత్రాలు తీయగల నిసార్ సామర్థ్యం వల్ల, వరద విస్తృతిని, నీటి మార్పులను, మరియు నష్టాన్ని నిజ సమయంలో అంచనా వేయవచ్చు. ఇది వరద నియంత్రణకు, సహాయక చర్యలకు, ముఖ్యంగా వర్షాకాలంలో ఇతర ఉపగ్రహాలు నిష్ప్రయోజనంగా మారినప్పుడు అమూల్యమైనది. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి, వాటి ప్రభావాలను తగ్గించడానికి నిసార్ ఎంతో దోహదపడుతుంది. హిమాలయాలు "ఆసియా జల గోపురం" గా, భారతదేశ నీటి భద్రతకు అత్యంత కీలకం. నిసార్ హిమాలయ పర్వతాలలోని హిమానీనదాలు, మంచు పలకల ఆరోగ్యానికి సంబంధించిన సమాచారాన్ని అందిస్తుంది. ఇది నీటి లభ్యతను అంచనా వేయడానికి, హిమానీనద సరస్సుల నుండి వచ్చే వరదలను అంచనా వేయడానికి, వాతావరణ మార్పుల ప్రభావాలను అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది. భారతదేశ విశాలమైన వ్యవసాయ రంగం, ముఖ్యమైన అటవీ సంపద వాతావరణ మార్పుల వల్ల నేరుగా ప్రభావితమవుతాయి. నిసార్ మొక్కల గుండా చొచ్చుకుపోయి సమాచారాన్ని సేకరించగలదు. ఇది అటవీ ఆరోగ్యాన్ని పర్యవేక్షించడానికి, వ్యవసాయానికి సంబంధించి నేల తేమను కొలవడానికి, పంటల ఆరోగ్యాన్ని, పెరుగుదలను ట్రాక్ చేయడానికి, దిగుబడులను అంచనా వేయడానికి చాలా విలువైనది. ఆధునిక వ్యవసాయానికి సహాయపడుతుంది. తద్వారా ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వం మెరుగుపడతాయి. సుదీర్ఘ తీరప్రాంతం, ద్వీపాలు ఉన్న మన్ దేశంలో సముద్ర మట్టాలు పెరగడం, తీరప్రాంత కోతకు ఎక్కువగా గురవుతుంది. నిసార్ తీరప్రాంతంలో జరిగే మార్పులను కచ్చితంగా కొలవగలదు. ఇది తీరప్రాంత నిర్వహణ, పట్టణ ప్రణాళిక, ప్రమాదంలో ఉన్న ప్రజలను కాపాడటానికి సహాయపడుతుంది. దేశంలోని స్థిరమైన వనరుల నిర్వహణ విధానాలకు పర్యావరణ క్షీణతను గుర్తించడానికి అవసరమైన సహజ వనరుల గురించి, భూగర్భజలాల తగ్గుదల నుండి చిత్తడి నేలల్లో మార్పుల వరకు

**నిసార్ సమాచారాన్ని, సమగ్ర చిత్రాన్ని అందిస్తుంది.**

**నాసా-ఇస్రో సహకార సమ్మేళనం:**

నాసా-ఇస్రో సహకారం ఎందుకు అన్నది సహజంగా అందరికీ తలెత్తే ప్రశ్న. అంతరిక్ష పరిశోధనలలో గొప్ప విజయాలు సాధించిన నాసాకు, ఎస్ఎఆర్ సాంకేతికతలో అపారమైన అనుభవం ఉంది. అయినప్పటికీ నిసార్ మిషన్ అనేది వ్యూహాత్మక సహకారానికి, వనరుల సమర్థవంతమైన వినియోగానికి ఒక గొప్ప ఉదాహరణ. నిసార్ మొట్టమొదటిసారిగా రెండు వేర్వేరు రాడార్ ఫ్రీక్వెన్సీలను ఒకేసారి ఉపయోగిస్తుంది. ఎల్-బ్యాండ్ (నాసా జెపిఎల్ - అందిస్తుంది) ఎస్-బ్యాండ్ (ఇస్రో అందిస్తుంది). ఈ రెండింటిని కలిపి ఉపయోగించడం వల్ల భూమి గురించి మునుపెన్నడూ లేని విధంగా సమగ్రమైన అవగాహన లభిస్తుంది. దాదాపు 1.5 బిలియన్ అమెరికన్ డాలర్ల అంచనా వ్యయంతో ఇలాంటి భారీ అంతరిక్ష మిషన్లు చాలా ఖరీదైనవి. కలిసి పనిచేయడం ద్వారా నాసా, ఇస్రో ఆర్థిక భారాన్ని, సాంకేతిక నష్టాలను పంచుకుంటాయి. ఇది మిషన్‌ను రెండు సంస్థలకు మరింత సాధ్యమయ్యేలా చేస్తుంది. నిసార్ భూమిపై ఉన్న దాదాపు అన్ని భూమి, మంచు ప్రాంతాలను ప్రతి పన్నెండు రోజులకు ఒకసారి పరిశీలిస్తుంది. ఈ ప్రపంచవ్యాప్త సమాచారం వాతావరణ మార్పులు, భూపలకల కదలికలు వంటి పెద్ద విషయాలను అర్థం చేసుకోవడానికి చాలా ముఖ్యం. ఈ సహకారం వల్ల ఎక్కువ మంది శాస్త్రవేత్తలు డేటాను ఉపయోగిస్తారు. దీనివల్ల ఎక్కువ శాస్త్రీయ ప్రయోజనం లభిస్తుంది. అంతేకాదు నిసార్ నుండి వచ్చే డేటా ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలకు, ప్రజలకు ఉచితంగా బహిరంగంగా లభిస్తుంది. ఇటువంటి సహకారాలు దేశాల మధ్య బలమైన సంబంధాలను నమ్మకాన్ని పెంచుతాయి. ఇస్రోకు, ఈ భాగస్వామ్యం అంతర్జాతీయ స్థాయిలో ఇంత పెద్ద మిషన్‌లో పనిచేయడంలో అమూల్యమైన అనుభవాన్ని అందిస్తుంది. సామర్థ్యం పెంపుదలకు తోడ్పడుతుంది. నాసాకు, ఇస్రో వంటి సమర్థవంతమైన తక్కువ ఖర్చుతో పనిచేసే సంస్థతో కలిసి పనిచేయడం వారి లక్ష్యాలను సాధించడానికి ఒక ప్రయోజనకరమైన మార్గాన్ని అందిస్తుంది. జి.ఎస్.ఎల్.వి-ఎఫ్16 మిషన్ నిసార్ ఉపగ్రహంతో కలిసి భారతదేశానికి ఒక ద్వంద్వ విజయం. ఇది క్లిష్టమైన భారీ ఉపగ్రహాలను ముఖ్యమైన కక్ష్యలలోకి ప్రయోగించడంలో మన దేశం సాధించిన స్వావలంబనను స్పష్టం చేస్తుంది. అంతకు మించి నిసార్ కేవలం ఒక శాస్త్రీయ ఆసక్తి మాత్రమే కాదు. ఇది ఒక అత్యంత ముఖ్యమైన సాధనం. ఇది భారతదేశానికి అత్యంత ముఖ్యమైన పర్యావరణ సవాళ్లను ఎదుర్కోవడానికి, విపత్తుల సంసిద్ధతను బలోపేతం చేయడానికి, ఆహార నీటి భద్రతను నిర్ధారించడానికి, రాబోయే దశాబ్దాలకు స్థిరమైన అభివృద్ధి వ్యూహాలను రూపొందించడానికి మునుపెన్నడూ లేని విధంగా సమాచారాన్ని అందించే ఒక ప్రత్యేకమైన "నేత్రం" లాంటిది ఈ ప్రయోగం.

జనక మోహన రావు దుంగ
8247045230

## పల్లె మాయం

పల్లె బాటలో పాడేదెవరు
పచ్చని తల్లికి హరివిల్లు
నాగలి తొక్కిన అడుగుల జాడలు,
పాటల పల్లకిలా ఊరంతా సందళ్ళు

పిల్లకాలువ పక్కన మామిడి వెదురు నీడ,
పెంకుటిళ్లపైన గూడు కట్టుకున్న పక్షి జాడ
చెరువులో ఈత కొట్టేవారి కేరింతల హోరు
పెరిగిన గాలిలోని పల్లె వాసన మరువలేను

చెరువు నీటిలో చందమామ,
చెట్టు నీడలో పల్లె కథలు,
అరటితోట పువ్వుల్లో అలలు,
మట్టిలో కథ చెప్పే వాడు రైతన్న.

రైతన్న చేతులు మట్టి వాసనగా,
బురదలో అడుగులు బంగారంగా,
గింజలలో బతుకులు ఆశగా,
కోతలలో సంక్రాంతి పండుగగా.

అదంతా ఒకప్పటి రైతన్నకు
మట్టే మాణిక్యం
పొలమే సగం బలం
పచ్చని పైరు ఒక జ్ఞాపకం

ఇప్పుడూ...
వొగ్గిన నడుము నల్లని భూమిని దీవిస్తే,
కంకణాలకే మించిన కౌలు దిగుతుంది
మొక్కవేసిన పడుచుల పాటలే గీతం,
మొక్కలో మల్లెపూవుగా మారే పాటలే చైతన్యం


మారిపోయిన పల్లె, మిగిలిపోయిన జ్ఞాపకం,
జోడెళ్ళ సవారీ మ్యూజియాల్లో తారసపడగా
చెరువు పారక దాగిన నిత్యకావ్యం,
విత్తనాల్లో మాటలై మిగిలిన జానపదం

అనుబంధాల పల్లె మాయం అయ్యింది,
అన్నదాత బతుకు సాయం అయ్యింది,
పట్టణపు దారిలో వలసై పోయింది,
పాటలే మిగిలాయి .. జానపద గీతంగా.

-షహనాజ్



## శ్రావణమాసంలో గజలక్ష్మీ యోగం.. శివానుగ్రహంతో ఈ రాశుల వారికి ఇక అన్నీ మంచిరోజులు



శ్రావణ మాసం శివారాధనకు అత్యంత పవిత్రమైన సమయం. ఈ నెలలంతా శివ భక్తులు ఉపవాసం, పూజలు, రుద్రాభిషేకంలో పాల్గొంటు శివుడి ఆశీస్సులు చేస్తుంటారు. శ్రావణ మాసం జులై 25న మొదలై ఆగస్టు 23 వరకు కొనసాగనున్నది. ఈ సమయంలో అనేక శుభ యోగాలు ఏర్పడనున్నాయి. పలు రాశుల అదృష్టానికి ద్వారాలు తెరువనున్నాయి. వేద జ్యోతిషశాస్త్రం ప్రకారం.. సంపద, వైభవం, అందానికి చిహ్నమైన మిథునరాశిలో గురువు, శుక్రుడి సయోగం కారణంగా గజలక్ష్మీ రాజయోగం ఏర్పడనున్నది. దాంతో పాటు సూర్యుడు, గురువులు సైతం స్థానం మార్చుకోబోతున్నారు. దాంతో ద్విద్వాదశ యోగం సైతం ఏర్పడబోతున్నది. దాంతో అదృష్టం వరించడంతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగనున్నది. అంతే కాదు సూర్యుడు కర్కాటకంలో ఉండి బుధుడితో కలిసిన సమయంలో బుధాదిత్య యోగం ఏర్పడనున్నది. తెలివితేటలు, నాయకత్వం సామర్థ్యం పెరుగుతుంది. ఈ శుభ యోగాల కారణంగా పలురాశులవారికి అదృష్టం వరించనున్నది. ఆ అదృష్ట రాశులవారెవరో తెలుసుకుందాం రండి..!

**వృషభ రాశి**

శ్రావణ మాసంలో ఏర్పడనున్న ద్విద్వాదశ యోగంతో వృశ్చిక రాశివారికి చాలా శుభప్రదంగా ఉంటుంది. ఈ యోగంతో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తికానున్నాయి. ఇప్పటి వరకు పదే పదే నిలిచిన పనులన్నీ ఒక్కొక్కటిగా పూర్తిచేస్తారు. అలాగే, కొత్త ఆదాయానికి మార్గాలు తెరుచుకుంటాయి. ఇది మీ ఆర్థిక స్థితిని బలోపేతం చేస్తుంది. శివుడి ఆశీస్సులతో ఈ సమయంలో మీ కష్టానికి తగిన ప్రతిఫలం పొందుతారు. కుటుంబ జీవితంలో ఆనందం వెల్లివిరియడంతో పాటు శాంతి నెలకొంటుంది. ఇంట్లో జరుగుతున్న పరస్పర విభేదాలు, సమస్యలు తొలగిపోతాయి. తోబుట్టువులతో సంబంధాల్లో మాధుర్యం ఉంటుంది. పరస్పర సహకారం పెరుగుతుంది. ఉద్యోగస్తులకు ఆయా రంగాల్లో గౌరవం ఉంటుంది. కెరియర్‌లో పురోగతి ఉంటుంది. మరోవైపు, ఈ సమయంలో చేసిన ప్రణాళికలు విజయవంతమవుతాయి. లాభదాయకంగా ఉంటాయి. వ్యాపారులు తమ వ్యూహాలకు పదునుపెడుతారు.

**కన్యా రాశి**

శ్రావణమాసంలో కన్యారాశి వారికి చాలా శుభాలు కలుగనున్నాయి. గురు, సూర్యుల ద్విద్వాదశ యోగం ఏర్పడడంతో మంచి ఫలితాలుంటాయి. ఈ సమయంలో మీరు ప్రతి రంగంలోనూ విజయం సాధించే అవకాశం ఉంది. ముఖ్యంగా చాలా కాలంగా అసంపూర్ణంగా ఉన్న పనులు ఇప్పుడు పూర్తవుతాయి. కుటుంబ సంబంధాలు కూడా బలపడతాయి. విదేశాలకు వెళ్లాలని ఎవరైనా ప్రణాళిక వేస్తుంటే వారికి ఆ దిశగా శుభవార్త వినే అవకాశాలున్నాయి. విదేశీ పర్యటనకు సైతం అవకాశం ఉంటుంది. ఈ సమయం ఉద్యోగస్తులకు చాలా అనుకూలంగా ఉంటుంది. మీరు చేసే కష్టపడి పని చేసేతత్వంతో ప్రశంసలు పొందుతారు. నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి. దాంతో మీరు కొత్త బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంటుంది. ఉన్నత స్థానానికి చేరుకుంటారు. జీతం పెరుగుతుంది. పదోన్నతికి అవకాశం ఉంది. ఈ సమయంలో మీకు మీ తండ్రి, గురువులాంటి వ్యక్తి నుంచి పూర్తి మద్దతు లభిస్తుంది. ఇది మీరు మీ లక్ష్యాన్ని సాధించడంలో సహాయపడుతుంది.



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9
హైదరాబాద్
బుధవారం
23 । జులై । 2025

# అలుపెరుగని సీఎం.. ఫడ్నవిస్‌పై శరద్ పవార్ ప్రశంసలు




**ముంబై-నవభూమి:** మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ మంగళవారంతో 55వ సంవత్సరంలోకి అడుగు పెట్టారు. ఆసక్తికరంగా పార్టీలకు అతీతంగా ఎన్‌సీపీ-ఎస్‌పీ చీఫ్ శరద్ పవార్ ఆయనను ప్రశంసలతో ముంచెత్తారు. రాష్ట్రాభివృద్ధికి అలుపెరగని కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఫడ్నవిస్ పుట్టినరోజు సందర్భంగా ఆయన ప్రజాజీవితం, సాధించిన విజయాలపై 'మహారాష్ట్ర నాయక్' అనే పేరుతో కాఫీ టేబుల్ బుక్‌ను విడుదల చేశారు. ఈ పుస్తకంలో పవార్ ఒక ఆర్టికల్ కూడా రాశారు. ఫడ్నవిస్ ఎంతో చురుకైన పనీతీరు ప్రదర్శిస్తుంటారని, ఆయన అంకితభావం, శక్తి శ్లాఘనీయమనీ, అలుపెరగకుండా ఎలా పనిచేస్తుంటారని తరచు తాను ఆశ్చర్యపోతుంటానని పవార్ ఆ వ్యాసంలో ప్రశంసల జల్లు కురిపించారు.ప్రధాని అభినందనలు..ఫడ్నవిస్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. మహారాష్ట్ర ప్రగతి, పేదలు, బడుగు వర్గాల అభ్యున్నతికి ఫడ్నవిస్ అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఆయురారోగ్యాలతో అచిరకాలం ప్రజాసేవ కొనసాగించాలని అభిలషించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సైతం ఫడ్నవిస్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ప్రగతి, జవాబుదారీతనం, సుపరిపాలనతో మహారాష్ట్రను ప్రగతిపథం వైపునకు నడుపుతున్న ప్రజాకర్షణ కలిగిన నేత దేవేంద్ర ఫడ్నవిస్ అని ప్రశంసించారు. ఆయురారోగ్యాలతో చిరకాల ప్రజాసేవ సాగించాలని సిద్ధవినాయకుని ప్రార్థిస్తున్నట్టు పేర్కొన్నారు.

## ఇంతకీ ఆమె ఏం చేసిందంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:** పొలంలో వరి నాట్లు వేస్తున్న సమాజ్ వాదీ నేత, ఎంపీ ప్రియా సరోజ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆమె తన పూర్వీకుల గ్రామం వారణాసిలో అమూల్ డైరీ సమీపంలోని కరాఖియావ్‌లో గ్రామస్తులతో కలిసి ఆమె వరి నాట్లు వేశారు. అందుకు సంబంధించిన వీడియోను ఆమె తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేసింది. ఈ వీడియోపై పార్టీ కార్యకర్తలతోపాటు మద్దతుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. లోక్ సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీ ప్రియా సరోజ్ ఇలా గ్రామానికి వచ్చి వరి నాట్లు వేయడం సంతోషంగా ఉందని అంటున్నారు. అంతేకాదు నెటిజన్లు సైతం ఆమెను ఆకాశానికి ఎత్తేస్తున్నారు.గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లోని మచ్లిషహర్ (రిజర్వ్‌డ్) లోక్‌సభ స్థానం నుంచి సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థిగా బరిలో ప్రియా సరోజ్ నిలిచి.. గెలిచారు. ఆమె తండ్రి తుఫానీ సరోజ్. ఆక్న జౌన్‌పూర్‌లోని కెరకట్ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే ప్రియా సరోజ్.. వృత్తిరీత్యా సుప్రీంకోర్టు న్యాయవాది. తొలిసారి ఎన్నికల బరిలో దిగి ఆమె విజయం సాధించింది.ఇక అలీఘడ్‌కు చెందిన భారత క్రికెటర్ రింకు సింగ్‌తో ఇటీవల ఆమెకు నిశ్చితార్థం జరిగింది. ఈ ఏడాది నవంబర్‌లో వీరి వివాహం జరగనుంది. అందుకు ముహూర్తం సైతం ఖరారైంది. మరోవైపు తాను తమ పొలంలో జులై 20వ తేదీన పాల్గొన్నానని ఎంపీ ప్రియా సరోజ్ స్పష్టం చేశారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 21 నుంచి ఆగస్ట్ 21వ తేదీ వరకు జరగనున్నాయని గుర్తు చేశారు. ఆ క్రమంలో ఈ సమావేశాల్లో పాల్గొనేందుకు తాను ఢిల్లీ వెళ్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

## ఈ నిశ్శబ్ద యోధుడికి వందనాలు



**ముంబై-నవభూమి:** మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా తన సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్'లో తాజాగా ఒక ఆసక్తికర పోస్ట్ చేశారు. ఒక పెద్దాయన రిక్షాతో రోడ్లపై చెత్త సేకరిస్తున్న వీడియో పోస్ట్ చేశారు. అయితే, ఆ పెద్దాయన వివరాలు చూసిన తర్వాత మాత్రం ఎవరైనా ఒక్కసారిగా ఆలోచనలో పడాల్సిన పరిస్థితి.
రోడ్లపై చెత్త సేకరిస్తున్న సదరు వ్యక్తి పేరు ఇందర్ జిత్ సింగ్ సిద్ధూ. వయసెంతో తెలుసా.. 88 సంవత్సరాలు. ఆయనొక రిటైర్డ్ పోలీస్ అధికారి. చాలా కాలంగా ఆయన నిత్యకృత్యం ఏంటంటే.. ప్రతీ రోజు ఉదయాన్నే ఆరు గంటల నుంచి ఆ రిక్షా బండితో రోడ్లపై ఉన్న చెత్త సేకరించి, కాలనీని పరిశుభ్రంగా ఉంచడం. చండీగఢ్ సెక్టార్ 49 లోని వీధుల్లో ఆయన నిత్యం ఈ పని చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారు.ఇంతకీ ఆ పెద్దాయన ఆ బాధ్యతను ఎందుకు తీసుకున్నారో తెలిస్తే మరింత ఆశ్చర్యపోవాల్సిన పరిస్థితి. స్వచ్ఛ సురేక్షణ్ జాబితాలో నగర పరిశుభ్రతకు గాను చండీగఢ్ కి తక్కువ ర్యాంకు రావడంతో ఆయన ఈ పనికి పూనుకున్నారు. ఎవరెవరి మీదో ఫిర్యాదులు చేయడమెందుకని నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో తన వంతు కృషి చేస్తున్నారు.పలువురు వేసే చెత్తను వయస్సుతో సంబంధం లేకుండా తొలగించడం అనేది వెలకట్టలేని పని. ఈ ఏఐ యుగంలో పరుగు.. పరుగుల జీవితాలకు ఇందర్ జిత్ సింగ్ వంటి వాళ్ల అడుగుజాడలు దేశ ప్రగతికి ప్రశాంతమైన మార్గాలే కదా.. ఈ వీధుల యోధుడికి ఎవరైనా సలాం పెట్టాల్సిందే.

## నన్ను మీరు కొడితే.. గవర్నర్ ఆసక్తికర వ్యాఖ్యలు



**ముంబై-నవభూమి:** మరాఠీలో మాట్లాడేందుకు నిరాకరించారనే కారణంగా మహారాష్ట్రలో జరుగుతున్న దాడులపై ఆ రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ సూటిగా స్పందించారు. భాషపై హింసాత్మక ఘటనల వల్ల రాష్ట్రంలో పెట్టుబడులకు విఘాతం కలుగుతుందని, ఇది దీర్ఘకాలంలో మహారాష్ట్రకు నష్టం కలిగిస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరి మాతృభాషను మనం గౌరవించాల్సి ఉంటుందని చెప్పారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు తమిళనాడులో తాను చూసిన ఒక ఘటనను ఈ సందర్భంగా ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో షేర్ చేశారు.
'తమిళనాడు ఎంపీగా నేను ఉన్నప్పుడు ఒకరోజు హైవే మీదుగా వెళుతున్నాను. కొందరు వ్యక్తులను అక్కడి వాళ్లు కొడుతుండటం నా కంటపడింది. డ్రైవర్‌ను వెంటనే కారు ఆపమని కిందకు దిగారు. దాడికి పాల్పడిన వారు నన్ను చూసి పారిపోయారు. దెబ్బలు తిన్నవారు మాత్రం అక్కడే ఉన్నారు. ఏమి జరిగిందని అడిగాను. వాళ్లు హిందీలో మాట్లాడారు. నాకు మాత్రం మార్..మార్.. అనే మాట మాత్రమే అర్థమైంది. అక్కడి హోటల్ యజమానిని పిలిచి అడగాను. వాళ్లకు తమిళం రాదని, తమిళంలో మాట్లాడమంటూ వాళ్లపై దాడి ప్రయత్నం జరిగిందని ఆయన నాతో చెప్పాడు' అని రాధాకృష్ణన్ వివరించారు. 'మీరు నన్ను కొట్టినంత మాత్రాన అప్పటికప్పుడు మరాఠీ మాట్లాడగలనా? అది అసాధ్యం. తమిళనాడు ఘటనలో గాయపడిన వారికి ఏదైనా తినమని చెప్పి, వారు లారీలో కూర్చున్న తర్వాతే అక్కడి నుంచి ముందుకు కదిలాను' అని రాధాకృష్ణన్ వివరించారు.
తమిళనాడు ఘటనను షేర్ చేయడంపై అడిగినప్పుడు ఆయన మాట్లాడుతూ, ఇలాంటి విద్వేష ఘటనల వల్ల పెట్టుబడిదారులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు రారని, అందువల్ల దీర్ఘకాలంలో రాష్ట్రానికి నష్టం జరుగుతుందని చెప్పారు. పెట్టుబడిదారులు కానీ, పరిశ్రమలు కానీ రానప్పుడు మహారాష్ట్రకు మనం హాని చేసినట్టే అవుతుందన్నారు.హిందీ మాట్లాడటం రాదు..తనకు హిందీ అర్థం చేసుకోవడం, మాట్లాడటం రాధని రాధాకృష్ణన్ చెప్పారు. అది తనకు ఒక అడ్డంకేనని ఆయన అంగీకరించారు.
మనం వీలున్నన్ని భాషలు నేర్చుకోవాలని, మాతృభాషను చూసి గర్వించాలని, ఆ విషయంలో రాజీ పడాల్సిన అవసరం లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. మరాఠీలో మాట్లాడని పలువురిపై ఉద్ధవ్ థాకరే శివసేన కార్యకర్తలు, ఎంఎన్‌ఎస్ చీఫ్ రాజ్‌థాకరే అనుచరులు ఇటీవల దాడులు జరిపిన ఘటనలు వెలుగుచూసిన నేపథ్యంలో గవర్నర్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

### పెళ్లయిన పాతికేళ్లకు 25 ఏళ్ల మేనల్లుడితో

# మహిళ ప్రేమాయణం.. చివరకు పారిపోయి!



**సిద్ధార్థనగర్-నవభూమి:** ఈమధ్య కాలంలో పెళ్లై భర్త, ఇద్దరు, ముగ్గురు పిల్లలు ఉన్న మహిళలు కూడా.. తమ పిల్లల వయసున్న వారితో పారిపోతున్నారు. కాబోయే అల్లుళ్లు, కాబోయే వియ్యంకుడు, వారి బంధువులు, ఇతరులతో ప్రేమలో పడిపోతూ.. కుటుంబాలను కాదనుకుని ఇంట్లోంచి వెళ్లిపోతున్నారు. ఇప్పటికే ఇలాంటి ఎన్నో ఘటనలు జరగ్గా.. తాజాగా అలాంటి ఘటనే మరోటి చోటు చేసుకుంది. ముఖ్యంగా పెళ్లి అయి పాతికేళ్లు అవుతుండగా.. నలుగురు పిల్లలు కూడా ఉన్న ఓ తల్లి.. తన పిల్లల వయుసున్న మేనల్లుడితో ప్రేమలో పడింది. అది చాలదన్నట్లుగా కుటుంబ సభ్యులు అందరినీ వదిలేసి అతడితో పారిపోయింది. ఇక్కడితో కథ అయిపోలేదు. ఇక్కడే మొదలైంది.ఉత్తర ప్రదేశ్‌లోని సిద్ధార్థ్ నగర్ జిల్లాకు చెందిన ఓ మహిళకు 25 ఏళ్ల క్రితమే పెళ్లి అయింది. భర్తతో పాటు ఆమెకు నలుగులు పిల్లలు ఉన్నారు. వారిలో ఇద్దరు ఆడ పిల్లలు కాగా.. మరో ఇద్దరు కుమారులు ఉన్నారు. అందులో పెద్ద కుమార్తె వయసు 20 ఏళ్లు కాగా, రెండో అమ్మాయికి 18 ఏళ్లు. ఇక మూడో అబ్బాయికి 17 సంవత్సరాల వయసు కాగా నాలుగో అబ్బాయికి 10 ఏళ్లు. భార్యా పిల్లల పోషణ కోసం ఇంటి పెద్ద అయిన భర్త తీవ్రంగా కష్ట పడుతున్నాడు. ఇంటికి దూరంగా ఉంటూ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని సాకుతు న్నాడు. అయితే పిల్లలను చూసుకుంటూ ఇంట్లోనే ఉండే మహిళ వద్దకు.. ఆమె మేనల్లుడు వచ్చేవాడు. బంధువు.. అందులోనూ మేనల్లుడు కావడంతో తరచుగా ఇంటికి చేరుకునేవాడు. తన పిల్లల వయసున్న వాడే కావడంతో అందరూ అతడిని సాదరంగా ఆహ్వానించేవారు. ఈక్రమంలోనే మేనల్లుడిపై ఆ అత్తకు ప్రేమ పుట్టింది. అతడికీ ఆమెపై ప్రేమ ఉండగా.. అది కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఇంట్లో ఎవరూ లేని సమయాల్లో శారీరకంగా కలిసేవాళ్లు. ఇలా చాలా రోజులుగా చాటుమాటుగా వ్యవహారం సాగిస్తున్నారు. అయితే ఇదంతా కష్టం అవుతుండడంతో.. ఇంట్లోంచి పారిపోవాలని నిర్ణయించుకున్నారు. ఏడాది క్రితం ఓరోజు ఇద్దరూ కలిసి వెళ్లిపోయారు.కోర్టులో వివాహం కూడా చేసుకున్నారు. తల్లి వయసున్న మహిళను పెళ్లి చేసుకోగా అంతా ఆశ్చర్చపోయారు. ఎవరేమనుకున్న తనకు అత్తే కావాలని అతడు, భర్త వద్దు మేనల్లుడితోనే ఉంటానని మహిళ తెగేసి చెప్పింది. దీంతో కుటుంబ సభ్యులు కూడా వీరిద్దరినీ వదిలేశారు. ఆపై ఆరు నెలల పాటు వీరిద్దరూ సంతోషంగా గడిపారు. కానీ కాలం గడుస్తున్నా కొద్దీ గొడవలు ప్రారంభం అయ్యాయి. దీంతో తట్టుకోలేకపోయిన మహిళ మళ్లీ భర్త వద్దకు వచ్చేసింది. పిల్లలను చూసుకుంటూనే జీవిస్తానని చెప్పగా.. పెద్ద మనసు చేసుకున్న అతడు ఇంట్లోకి ఆహ్వానించాడు. ఇదే సమయంలో.. మేనల్లుడు కూడా తాను ఇక ఆమెతో ఉండలేనని పోలీసులకు స్పష్టం చేశాడు. ఈ పరిణామాలతో అంతా సద్దుమణి గిందనుకున్నారు.ఆరు నెలలు వీరిద్దరూ ఎవరి ఇళ్లలో వారు చక్కగానే ఉన్నారు. కానీ ఆ తర్వాతే ఓ ఊహించని మలుపు చోటు చేసుకుంది. ముఖ్యంగా మళ్లీ మహిళ తన మేనల్లుడి వద్దకు వెళ్లిపోయింది. ఇలా ఈ విషయం గ్రామ పంచాయతీ కోసం పెద్దల వద్దకు చేరింది. ఈ సందర్భంగానే.. ఆ మహిళ ఎటువంటి సంకోచం లేకుండా.. తాను తన మేనల్లుడితోనే కలిసి జీవించాలనుకుం టున్నానని, భర్త వద్దకు తిరిగి వెళ్లడానికి సిద్ధంగా లేనని స్పష్టం చేసింది. ఆమె దృఢమైన నిర్ణయం విన్న తర్వాత.. భర్త కూడా తీవ్ర వేదనతో ఆమె కోరికను అంగీకరించక తప్పలేదు. తన భార్యను ఆమె ప్రియుడితోనే వెళ్లిపోవడానికి అంగీకరించినట్లు మీడియాకు తెలిపాడు.

# అమెరికా పౌరసత్వానికి రహస్య మార్గాలు!




**న్యూయార్కు-నవభూమి:** అమెరికా పౌరసత్వాన్ని పొందడం, ముఖ్యంగా అక్రమంగా దేశంలోకి ప్రవేశించిన వారికి ఇది ఒక అసాధ్యమైన లక్ష్యంగా అనిపించవచ్చు. అయితే ఆశ్చర్యకరంగా, కొంతమంది అక్రమ వలసదారులు కూడా పౌరసత్వాన్ని పొందడంలో విజయవంతమవుతున్నారు. కొందరు చట్టబద్ధమైన మార్గాలను అనుసరిస్తే మరికొందరు వ్యవస్థలో ఉన్న "గ్రే ఏరియాల" ద్వారా తమ మార్గాన్ని సుగమం చేసుకుంటున్నారు. -పౌరసత్వానికి కొన్ని సాధారణ మార్గాలు అక్రమంగా దేశంలో ఉన్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో చట్టబద్ధమైన మార్గాల ద్వారా పౌరసత్వం పొందే అవకాశాలు ఉన్నాయి. అమెరికా పౌరుడిని వివాహం చేసుకోవడం పౌరసత్వం పొందడానికి ఒక సాధారణ మార్గం. ఈ వివాహ బంధం నిజమైనదని ప్రభుత్వం నమ్మితే, అక్రమంగా దేశంలోకి ప్రవేశించిన వారి గతాన్ని కొంతవరకు విస్మరిస్తారు. ఈ ప్రక్రియలో నిజమైన సంబంధాన్ని నిరూపించగలగడం చాలా కీలకం. నకిలీ వివాహాలు తీవ్రమైన పరిణామాలకు దారితీస్తాయి. తమ స్వదేశానికి తిరిగి వెళ్లడంపై తీవ్రమైన భయం ఉన్నవారు ఆశ్రయం కోరుకోవచ్చు. వారి దరఖాస్తును ప్రభుత్వం ఆమోదిస్తే, వారికి రక్షణ హోదా లభిస్తుంది. కాలక్రమేణా ఇది గ్రీన్‌కార్డ్, ఆపై పౌరసత్వానికి దారితీస్తుంది. కొన్ని నేరాలకు బాధితులుగా మారి పోలీసు విభాగానికి సహకరించిన వారికి యూ వీసా ద్వారా అవకాశం కలుగుతుంది. ఇది గ్రీన్‌కార్డ్‌కు మార్గం వేస్తుంది, అయితే ఈ ప్రక్రియకు చాలా కాలం వేచి ఉండాల్సి రావచ్చు. సాధారణంగా విదేశీయుల కోసం ఉద్దేశించినప్పటికీ, స్టూడెంట్ లేదా టూరిస్ట్ వీసాలపై వచ్చి, వీసా గడువు ముగియకముందే దరఖాస్తు చేసుకున్నవారు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవచ్చు. కొందరికి ఇది గ్రీన్‌కార్డ్‌కు దారితీస్తుంది.డాకా , టీపీఎస్ ఈ కార్యక్రమాలు వలసదారులను తాత్కాలికంగా రక్షిస్తూ, భవిష్యత్తులో చట్టపరమైన మార్గాలకు అవకాశం కల్పించేలా ఉంటాయి. నెల్లూరులో మరో కీలక నేత ఔట్.. ఉచ్చుబిగిస్తున్న ప్రభుత్వం - ప్రమాదకరమైన, అనధికారిక మార్గాలు కొంత మంది అక్రమ మార్గాలను అనుసరించడానికి ప్రయత్నిస్తారు, ఇవి తీవ్రమైన పరిణామాలకు దారితీస్తాయి. చాలా మంది నకిలీ పత్రాలు లేదా నకిలీ వివాహాల ద్వారా అమెరికాలో ఉండడానికి ప్రయత్నిస్తారు. అయితే, ఇవి అతి ప్రమాదకరమైన మార్గాలు. ఒకసారి పట్టుబడితే జీవితకాల నిషేధాన్ని ఎదుర్కొనాల్సి వస్తుంది. కొంతమంది అమెరికా వెలుపల పెళ్లి చేసుకుని, అక్కడి నుంచే గ్రీన్‌కార్డ్‌కు దరఖాస్తు చేస్తారు. అయితే, వారు ఆరు నెలలకు పైగా అక్రమంగా ఉన్నట్లయితే, వారికి 3 నుంచి 10 సంవత్సరాల నిషేధం ఎదురవుతుంది.అయితే ప్రత్యేకమైన మాఫీ ఉంటే తప్ప. వీసా ముగిసినవారే ఎక్కువ ఆశ్చర్యకరం గా చాలా మంది అక్రమ వలసదారులు మొదట చట్టబద్ధంగా అమెరికాలోకి ప్రవేశించినవారే. వీసా గడువు ముగిసిన తర్వాత అక్రమంగా ఉండిపోతారు. వీరు అమెరికా సమాజానికి సేవలు అందిస్తూ, పన్నులు చెల్లిస్తూ, కుటుంబాలను పోషిస్తూ జీవిస్తున్నారు.అయితే ఎప్పుడూ నిర్బంధాలు, బహిష్కరణ భయంతో జీవించాల్సి వస్తుంది. లోపభూయిష్టమైన ఇమ్మిగ్రేషన్ వ్యవస్థ ఈ సమస్యకు అసలైన మూల కారణం నాసిరకంగా తయారైన ఇమ్మిగ్రేషన్ వ్యవస్థ. దీన్ని సరిచేయడానికి కేవలం కఠిన నియమాలు సరిపోవు. వాస్తవాలను ప్రతిబింబించేలా, సరళమైన, న్యాయమైన మార్గాలు అవసరం. ఇది కేవలం నిబంధనల గురించి కాదు. మనుషుల జీవితాల గురించి కూడా. వారు అమెరికాలో భాగమయ్యారు.. కానీ వారి పత్రాలు అలా చెప్పకపోవడమే పెద్ద సమస్యగా మారనుంది.

# మంత్రి కుర్చీ... ఆ జిల్లాల నేతలు అంతేనా ?



**విజయవాడ-నవభూమి:** ఏపీలో కీలకమైన జిల్లాగా క్రిష్ణా ఉంది. దీనిని రాజకీయంగా చైతన్యవంతమైన జిల్లాగా పేర్కొంటారు. క్రిష్ణా జిల్లా నాడిని పట్టుకుంటే చాలు మొత్తం అర్థం అవుతుంది అని చెబుతారు ఏపీలో రాజకీయ రాజధానిగా క్రిష్ణాకు పేరుంది. అటువంటి జిల్లాలో రాజకీయంగా ఆధిపత్యం చేసే సామాజిక వర్గంగా కమ్మలు ఉంటారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఈ జిల్లా నుంచి వారికి బెర్త్ గ్యారంటీ. ఆఖరుకు జగన్ హయాంలో సైతం మూడేళ్ళ పాటు ఈ జిల్లా నుంచి కొడాలి నాని మంత్రిగా పనిచేశారు. భారత్ పై అమెరికా వివాదాస్పద హెచ్చరికలు! అయితే 2024లో మాత్రం సీన్ మారింది. ఉమ్మడి క్రిష్ణా జిల్లా నుంచి ఇద్దరికి మంత్రి పదవులు దక్కాయి. ఆ ఇద్దరూ బలమైన బీసీ నేతలే కావడం విశేషం. వారిలో ఒకరు సీనియర్ నేత కొలుసు పార్థసారథి అయితే మరొకరు కొల్లు రవీంద్ర. ఈ ఇద్దరికీ మంత్రి పదవులు దక్కడంతో కమ్మ సామాజిక వర్గానికి బెర్త్ లేకుండా పోయింది. ఇక మంత్రి పదవి విషయంలో ఆశలు పెట్టుకున్న వారిలో టీడీపీ నుంచి వసంత క్రిష్ణ ప్రసాద్ ఉన్నారు. ఆయన వైసీపీ నుంచి తొలిసారి 2019లో గెలిచారు. 2024 ఎన్నికల ముందు టీడీపీలోకి వచ్చారు. రెండోసారి అలా గెలిచారు ఆయన వైసీపీలోనే మంత్రి పదవి మీద ఆశపడినా కుదరలేదు. ఇక కూటమి ప్రభుత్వంలో గ్యారంటీ అనుకున్నా అదేంటో అందలం అందలేదు. గన్నవరం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన యార్లగడ్డ వెంకట్రావు మంత్రి పదవిని కోరుకుంటున్నారు. ఆయన కూడా రేసులోనే ఉన్నారని అంటున్నారు. ఎందుకంటే సీనియర్ నేత వల్లభనేని వంశీని ఆయన ఓడించారు కాబట్టి. ఇక బీజేపీ నుంచి సీనియర్ నేత కేంద్రంలో మంత్రి పదవిని నిర్వహించిన సుజనా చౌదరి ఉన్నారు. ఇక గుంటూరు జిల్లాలో సీనియర్లు అనేక మంది కమ్మ సామాజిక వర్గంలో మంత్రి పదవి కోసం చూస్తున్నారు. వారిలో ఈ మధ్యనే ఎమ్మెల్సీ అయిన ఆలపాటి రాజా ఉన్నారు. అలాగే ప్రత్తిపాటి పుల్లారావు, ధూళిపాళ్ళ నరేంద్ర, ఎరపతినేని శ్రీనివాస్ ఉన్నారు. ఇక్కడ ఇద్దరు కమ్మ నేతలు మంత్రులుగా ఉన్నారు. ఒకరు నారా లోకేష్ మరొకరు నాదెండ్ల మనోహర్. దాంతో ఈ ఇద్దరి బెర్తులు కదలవు కాబట్టి కొత్తగా కమ్మ వారికి చాన్స్ ఉండదనే అంటున్నారు. అదే విధంగా క్రిష్ణా జిల్లాలో కూడా మంత్రి వర్గ విస్తరణ జరిగినా కూడా వారి ఆశలు నెరవేరవని అంటున్నారు. ఇక ఏపీ కేబినెట్ లో చంద్రబాబు నారా లోకేష్ నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమర్ ఉన్నారు. మొత్తం మంత్రివర్గంలో ఇరవై శాతం వాటా అన్న మాట. వీరిలో ఎవరూ కదిలేది లేదు. దాంతో ఏపీలో కొత్తగా ఆ సామాజిక వర్గం నుంచి ఎవరూ ఆశలు పెట్టుకోవాల్సింది ఉండదని మరో నాలుగేళ్ళు ఇలాగే గడిపేయడానికి రెడీ కావాల్సిందే అని అంటున్నారు.

# డెలివరీ బాయ్ రేప్ చేశాడని టెక్కీ ఫిర్యాదు... కట్ చేస్తే బిగ్ ట్విస్ట్!

**పూణే-నవభూమి:** పూణేలోని తన అపార్ట్ మెంట్ లో డెలివరీ ఏజెంట్ గా నటిస్తూ ఒక వ్యక్తి తనపై అత్యాచారం చేశాడని 22 ఏళ్ల ఐటీ ప్రొఫెషనల్ ఆరోపణ చేసింది. ఈ మేరకు జూలై 3న ఆ మహిళ పోలీసులను ఆశ్రయించింది. ఈ సందర్భంగా... ఒక డెలివరీ ఏజెంట్ తన ఫ్లాట్ లోకి ప్రవేశించి, తనను అపస్మారక స్థితిలోకి నెట్టి, అత్యాచారం చేశాడని ఆరోపించింది. ఇందులో బిగ్ ట్విస్ట్ నెలకొంది. అవును... తనపై ఓ డెలివరీ ఏజెంట్ అత్యాచారం చేశాడని, అంతకంటే ముందు తనను అపస్మారక స్థితిలోకి నెట్టాడంటూ ఓ మహిళా టెకీ పోలీసులకు ఫిర్యాదు చేసింది! అయితే ఈ ఫిర్యాదుపై జరిపిన దర్యాప్తులో.. అది కట్టుకథ అని తేలింది. దీంతో... పోలీసులు రివర్స్ లో ఆమె పైనే కేసు నమోదు చేశారు. ఈ విషయం నెట్టింట సంచలనంగా మారుతుంది! వివరాల్లోకి వెళ్తే... ఓ వ్యక్తి డెలివరీ ఏజెంట్ గా నటిస్తూ తనపై అత్యాచారం చేశాడని పుణెకు చెందిన ఓ టెకీ (22) ఈ నెల 3న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో... అతడు దొంగతనంగా తన ఫ్లాట్ లోకి వచ్చాడని.. తనను స్పృహ కోల్పోయేలా చేసి, అత్యాచారం చేశాడని పేర్కొంది! ఆ సమయంలో.. ఆ వ్యక్తి తన ఫొటోలు తీశాడని ఆరోపించింది. అంతేకాదు.. ఈ విషయం బయటకు చెప్తే వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేస్తానని బెదిరిస్తూ మెసేజ్ లు చేసినట్లు తెలిపింది. దీనికి సంబంధించి పలు సాక్ష్యాలను కూడా ఆమె సమర్పించిందని చెబుతున్నారు.

## వాళ్లెవరు, వాళ్ల హోదా ఏమిటి.. నిలదీసిన శశిథరూర్



**న్యూఢిల్లీ-నవభూమి:** కాంగ్రెస్ వైఖరికి భిన్నంగా వెళ్తున్న తిరువనంతపురం ఎంపీ శశథరూర్ కు, కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు కె.మురళీధరన్‌కు మధ్య మాటలు తూటాలు పేలుతున్నాయి. జాతీయభద్రత విషయంలో పార్టీలకు అతీతంగా స్పందించాలంటూ శశిథరూర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై మురళీధరన్ గత ఆదివారంనాడు ఘాటుగా స్పందించారు. ఆయన తమతో లేడని, ఇకపై కేరళలో జరిగే కాంగ్రెస్ కార్యక్రమాలకు ఆయనను పిలవమని స్పష్టం చేశారు. దీనిపై శశిథరూర్ తాజాగా స్పందించారు. అలాంటి వ్యాఖ్యలు చేయడానికి ఏదో ఒక ప్రాతిపదిక ఉండొచ్చనీ, వాళ్లెవరు? వాళ్ల హోదా ఏమిటి? నేను తెలుసుకోవాలనుకుంటున్నానని వ్యాఖ్యానించారు.జాతీయ భద్రతపై శశిథరూర్ గత శనివారంనాడు చేసిన వ్యాఖ్యలు ఆయనకూ, మురళీధరన్‌కూ మధ్య మాటలయుద్ధానికి దారితీసింది. కొచ్చిలో ఓ హైస్కూలు విద్యార్థి అడిగిన ఒక ప్రశ్నకు శశిథరూర్ సమాధానమిస్తూ, మన సాయుధ దళాలకు, మన ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం సరైనదేనని తాను నమ్మడం వల్ల అనేక మంది తనను విమర్శించారని, అయితే తన వైఖరి సరైనదేనని నమ్మి దానిపై నిలబడ్డానని చెప్పారు. రాజకీయాలు అంటేనే పోటీ అని, తనలాంటి వాళ్లు పార్టీని గౌరవిస్తారని, అయితే జాతీయ భద్రత విషయానికి వచ్చేసరికి మనం ఇతర పార్టీలతో కలిసి పనిచేయాల్సిన అవసరం వస్తుందని అన్నారు. అలాంటి సందర్భాల్లో ఒక్కోసారి పార్టీలు ధానిని అవిధేయతగా భావిస్తుంటాయని, అదే పెద్ద సమస్య అని అన్నారు. జాతీయ భద్రతకు తాను ఎప్పుడూ తొలి ప్రాధాన్యతనిస్తానని, ఏ రాజకీయ పార్టీ అయినా దేశాన్ని మెరుగుపరచాలనే కోరుకుంటుందని చెప్పారు. సిద్ధాంతాల పరంగా పార్టీల మధ్య వైరుధ్యాలు ఉన్నా సురక్షితైన భారత్‌కు అవన్నీ కట్టుబడి ఉండాలన్నారు. జాతీయ ఐక్యతకు రాజకీయాలు అడ్డుకారాదని అన్నారు.దీనిపై మురళీధరన్ వెంటనే స్పందించారు. థరూర్ తమలో లేరని, ఆయన తన వైఖరి మార్చుకునేంత వరకూ తిరువనంతపురంలో జరిగే కాంగ్రెస్ కార్యక్రమాలను ఆయనను పిలిచేది లేదని చెప్పారు. ఆయన కాంగ్రెస్‌పైన, ఇందిరాగాంధీపై పదేపదే దాడి చేస్తున్న కారణంగా ఆయనతో సహకరించేందుకు తాము సిద్ధంగా లేమని అన్నారు. థరూర్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడని, ఆయనపై ఏ చర్యలు తీసుకోవాలన్నది కాంగ్రెస్ అధిష్ఠానమే నిర్ణయించాలని పేర్కొన్నారు.తమలో ఒకరు కాదంటూ కాంగ్రెస్ యూనిట్ నేత తనపై చేసిన వ్యాఖ్యలపై శశిథరూర్ సూటిగా స్పందించారు. ఈ మాటలు అంటున్న వాళ్లకు ఏదో ఒక ప్రాతిపదిక ఉన్నట్టు కనిపిస్తోందని అన్నారు. అసలు వాళ్లు ఎవరు, పార్టీలో వారి హోదా ఏమిటనేది తాను తెలుసుకోవాలనుకుంటున్నట్టు చెప్పారు.

## సమస్యలేవీ లేవు, ఫ్యూయల్ స్విచ్ లాకింగ్‌పై తనిఖీలు ముగించిన ఎయిర్ ఇండియా

**న్యూఢిల్లీ-నవభూమి:** తమ అన్ని బోయింగ్ 787, 737 విమానాలలో ఇంధన నియంత్రణ స్విచ్ లాకింగ్ మెకానిజంపై తనిఖీలు పూర్తయ్యాయని ఎయిర్ ఇండియా ప్రకటించింది. ఈ తనిఖీలలో ఎలాంటి సమస్యలు లేవని తేలిందని ఆ సంస్థ స్పష్టం చేసింది. కాగా, అహ్మదాబాద్ విమాన ప్రమాదం తర్వాత ఎయిర్ ఇండియా తన దగ్గరున్న అన్ని బోయింగ్ ఫ్లైట్లలో ఇందన స్విచ్ మెకానిజం మీద ముందు జాగ్రత్తగా తనఖీలు చేపట్టిన సంగతి తెలిసిందే.ఎయిర్ ఇండియా జూలై 12న స్వచ్ఛందంగా తమ బోయింగ్ విమానాల్లో తనిఖీలను ప్రారంభించి, నిర్దేశించిన నిర్ణీత కాలపరిమితిలోపు వాటిని పూర్తి చేసింది. ఇదే విషయాన్ని నియంత్రణ సంస్థకు కూడా తెలియజేశామని ఎఐ ఒక ప్రకటనలో పేర్కొంది. కాగా, గత నెల అహ్మదాబాద్‌లో కూలిపోయిన 171 విమానానికి సంబంధించి గత ఆరు నెలల్లో ఎయిర్ ఇండియా నివేదికలలో ఎటువంటి దోషాలు కనిపించలేదని పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ నిన్న పార్లమెంటుకు తెలియజేశారు. రాజ్యసభ ఎంపీ జాన్ బ్రిట్టాస్ రాసిన లిఖితపూర్వక ప్రశ్నకు సమాధానంగా మంత్రి ఈ ప్రకటన చేశారు.ఇలా ఉండగా, జూన్ 12న అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం ప్రమాదానికి గురై ఒక్కరు మినహా మిగిలిన 241 మంది ప్రయాణీకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విమానం మెడికల్ హాస్టల్ బిల్డింగ్ మీద కూలడంతో 19 మంది విగతజీవులయ్యారు. ఇలా మొత్తంగా 260 మంది మరణించారు.

## మరణ శిక్ష నుంచి తప్పించుకున్న నిమిష..! త్వరలో విడుదల..?



**న్యూఢిల్లీ-నవభూమి:** హత్య కేసులో యెమెన్‌లో మరణశిక్ష ఎదుర్కొంటున్న కేరళ నర్సు నిమిష ప్రియ శిక్ష రద్దు చేశారు. ఈ విషయాన్ని క్రైస్తవ మత ప్రచారకుడు, గ్లోబల్ పీస్ ఇనిషియేటివ్ వ్యవస్థాపకుడు డాక్టర్ కె.ఎ. పాల్ ప్రకటించారు. యెమెన్ రాజధాని సనా నుంచి ఒక వీడియో సందేశం విడుదల చేశారు. నిమిష త్వరలో భారతదేశానికి తిరిగి వస్తారని అన్నారు. భారత ప్రభుత్వ అధికారులు, యెమెన్ నాయకులతో వరుసగా పది రోజులు పగలు, రాత్రి చర్చించి ఈ గొప్ప విజయాన్ని సాధించానని వెల్లడించారు. ఇందుకు సహకరించిన ప్రధాని నరేంద్ర మోదీకి, యెమెన్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కేఏ పాల్ నిమిష ప్రియ విడుదలపై తన ఎక్స్ ఖాతాలో ఓ వీడియో పోస్ట్ చేశారు. అందరి ప్రార్థనలు, గత 10 రోజులుగా చేస్తున్న కృషి ఫలించి నిమిష ప్రియకు విధించిన మరణశిక్ష రద్దయిందని ప్రకటించారు. ఈ విజయానికి కారకులైన యెమెన్ నాయకులకు, ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. దేవుని దయవల్ల యెమెన్ రాజధాని సనా జైలు నుంచి నిమిష విడుదలై త్వరలో భారతదేశానికి రాబోతోందని వెల్లడించారు.
నిమిషను సురక్షితంగా ఇంటికి తీసుకెళ్లడానికి భారత ప్రభుత్వం దౌత్యవేత్తలను పంపించేందుకు అంగీకరించిందని తెలిపారు. ఆమెను సనా జైలు నుంచి స్వదేశానికి తెచ్చేందుకు భారత ప్రభుత్వం లాజిస్టిక్స్ ఏర్పాట్లు చేసుకోవచ్చని అన్నారు.కాగా, జులై 16న నిమిషకు విధించాల్సిన ఉరిశిక్ష వాయిదా పడిన సంగతి తెలిసిందే. కేరళ గ్రాండ్ ముఫ్తీ షేక్ అబుబకర్ అహ్మద్ అప్పటి నుంచి విదేశాంగ మంత్రిత్వ శాఖ యెమెన్‌లోని స్థానిక అధికారులతో నిరంతర చర్చలు జరుపుతోంది. సనాలో జైలు శిక్ష అనుభవిస్తున్న నిమిష ప్రియకు సాధ్యమైనంత సహాయం అందిస్తున్నట్లు వెల్లడించింది. ఈ సున్నిత విషయంలో ప్రియ కుటుంబానికి చట్టపరమైన సహాయం చేయడానికి ఒక న్యాయవాదిని నియమించిందని ప్రభుత్వ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలియజేశారు. షరియా చట్టం ప్రకారం క్షమాభిక్ష లేదా క్షమాపణ కోసం చేసే ప్రయత్నాలకు సహకరిస్తుందని అన్నారు.



## ఈ మందులు చెత్త బుట్టలో వేయొద్దు..

కాలం చెల్లిన కొన్ని మందులను చెత్తబుట్టలో పారేయడం ప్రమాదకరమని కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ చెబుతోంది. నొప్పి, ఆందోళన మొదలైన సమస్యలకు వాడే ట్రమడాల్, టాపెంటడాల్, డైజిపామ్, ఆక్సికోడోన్, ఫెంటానిల్ వంటి 17 రకాల మందులు ఎంతో ప్రభావవంతమైనవని ఔషధ నియంత్రణ సంస్థ వెల్లడించింది. వైద్యులు సూచించిన రోగులు మినహా వాటిని ఎవరు తీసుకున్నా, తీవ్రమైన ప్రభావాన్ని కనబరుస్తాయనీ, ప్రాణాలకు కూడా ప్రమాదం ఉంటుందనీ, కొన్నిసార్లు ఒక్క డోసు తీసుకున్నా ప్రాణాలు పోయే అవకాశాలు ఉంటాయిని ఔషధ నియంత్రణ సంస్థ హెచ్చరిస్తోంది. అలాంటి ఆ మందులు మిగిలిపోయినా, కాలం చెల్లినా, లేదా లేబుల్ చిరిగిపోయినా చెత్త బుట్టలో పారేయవద్దని సూచిస్తోంది. అలా పారేస్తే, వాటిని పొరపాటున చిన్న పిల్లలు, పారిశుద్ధ్య కార్మికులు, జంతువులు తినే ప్రమాదం ఉందని తెలిపింది. ఆ మందులు జంతువులు తాగే నీటిలో కలిసే ప్రమాదం కూడా లేకపోలేదని వివరించింది. చెత్తలోకి చేరిన ఆ మందులు అక్రమార్కుల చేతిల్లోకి చేరుకుంటే అవి దుర్వినియోగం అవడం లేదా మళ్లీ మార్కెట్‌లోకి చేరుకునేప్రమాదం ఉందని హెచ్చరించింది. అందుకే ఆ మందులను టాయిలెట్‌లో వేసి ఫ్లష్ చేయాలని సూచించింది.



# డిప్రెషన్ మందులతో నాడీ సంబంధ ముప్పు

**డిప్రెషన్, ఆందోళన, నిద్రలేమి వంటి మానసిక సమస్యలకు వినియోగించే మందులు, కొన్ని సందర్భాల్లో మన శరీరంలోని నాడీ వ్యవస్థపై తీవ్రంగా ప్రభావం చూపే ప్రమాదం ఉన్నట్లు తాజా అధ్యయనాలూ హెచ్చరిస్తున్నాయి. అంతేకాదు, ఈ మందుల వలన ప్రాణాంతకమైన నాడీ సంబంధిత వ్యాధి అమియోట్రోఫిక్ లేటరల్ స్క్లెరోసిస్ (ఎఎల్ఎస్) కి కారణమయ్యే అవకాశముందని, ప్రముఖ న్యూరాలజీ జర్నల్ "జామా న్యూరాలజీ"లో ఇటీవలే ప్రచురితమైన అధ్యయనం స్పష్టం చేస్తోంది.**



ప్రపంచాన్ని శాస్త్ర విజ్ఞానంతో ఆలోచింపజేసిన స్టీఫెన్ హాకింగ్‌ను ముద్దుపెట్టుకున్న వ్యాధి అదే ఎఎల్ఎస్. కేవలం 21ఏళ్ల వయసులోనే ఈ వ్యాధికి గురైన ఆయన, జీవితం చివరి వరకు చక్రాల కుర్చీపైనే జీవించి, గొప్ప విజ్ఞానాన్ని ప్రపంచానికి అందించారు. అదే వ్యాధి ఇప్పుడు మానసిక మందుల వలన కూడా వచ్చే ప్రమాదం ఉన్నట్లు స్వీడన్ పరిశోధకుల అధ్యయనం వెల్లడించింది.

ఈ పరిశోధనలో భాగంగా స్వీడన్ నాడీ శాస్త్రవేత్తలు 1000 మందికిపైగా ఎఎల్ఎస్ బాధితుల వివరాలను, 5000 మందికిపైగా ఆరోగ్యవంతుల సమాచారాన్ని విశ్లేషించారు. అందులో ఆసక్తికరమైన విషయమేంటంటే, డిప్రెషన్, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యల చికిత్సలో వాడే మందులు తీసుకున్న వారు, కాలక్రమంలో ఎఎల్ఎస్ బారిన పడినట్లు స్పష్టమైంది. అర్థం చేసుకోవాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ మందులు తీసుకునే సమయంలో ఎఎల్ఎస్ ప్రారంభ దశలో ఉండే మానసిక లక్షణాలు కనిపించవచ్చు. వాటిని అగాథంగా పరిశీలించకుండా, మానసిక మందులు మాత్రమే వాడించడం వలన అసలు వ్యాధి గుర్తించబడే కాలం ఆలస్యమవుతుండడం వల్ల, చికిత్సకు అవసరమైన సమయం వృథా అవుతోంది. ఇది ఆ వ్యక్తి కోలుకునే అవకాశాలను మరింత క్షీణతకు నెట్టేస్తోంది.

హైదరాబాద్‌లోని దర్మశిల నారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సీనియర్ న్యూరాలజీ కన్సల్టెంట్ డాక్టర్ పాండు రంగ మాట్లాడుతూ "ఎఎల్ఎస్ ప్రారంభ దశలో డిప్రెషన్, ఆందోళన, నిద్రలేమి వంటి లక్షణాలు ఉండడం సహజం. వాటిని మానసిక రుగ్మతలుగా తప్పుగా అర్థం చేసుకుని, సంబంధిత మందులు వాడటం వలన అసలైన వ్యాధిని గుర్తించకుండా మిగిలిపోతుంది" అని హెచ్చరించారు.

ఢిల్లీ సర్ గంగారామ్ హాస్పిటల్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అన్న రోహత్గి మాట్లాడుతూ – "ఈ మందుల వలన ఎఎల్ఎస్ వస్తుందనే కచ్చితమైన ఆధారాలు లేనప్పటికీ, నాడీ సంబంధిత లక్షణాలు ఉన్నవారికి మానసిక మందులు ఇవ్వడంలో అప్రమత్తంగా ఉండాలి" అన్నారు. వైద్యులు, మానసిక వ్యాధుల చికిత్సలో ముందు జాగ్రత్త చర్యలుగా ఎఎల్ఎస్ వంటి తీవ్రమైన నాడీ వ్యాధుల స్క్రీనింగ్ కూడా చేయాల్సిన అవసరం ఉందని సూచించారు.

ఇక్కడ ముఖ్యంగా గుర్తుంచుకోవలసింది మానసిక ఆరోగ్య సమస్యలు ఎక్కువవుతున్న నేపథ్యంలో, వాటికి సరైన గుర్తింపు, విచారణ లేకుండా దాదాపుగా నిద్ర మాత్రలు, డిప్రెషన్ మందులు వినియోగించడం ఒక సామాన్యపు ధోరణిగా మారిపోయింది. కానీ ఈ సరళ చికిత్స వెనుక మరింత తీవ్రమైన సమస్యలు దాగి ఉండే ప్రమాదం ఉంది. ప్రతి ఔషధానికి, ప్రతి శరీరానికి వేర్వేరు ప్రతిస్పందన ఉంటుంది. కనుక నసల మానసిక సమస్యల పట్ల అవగాహన పెంపొందించి, అవి శారీరక వ్యాధుల సంకేతం కావచ్చన్న శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించాల్సిన అవసరం ఉంది.

ఇక డిప్రెషన్ఎల్ఎస్ సంబంధాన్ని పరిశీలిస్తే, నాడీ కణజాలం క్షీణతకు దారితీసే మార్గాల్లో మానసిక ఒత్తిడికి సైతం ఒక పాత్ర ఉండొచ్చని శాస్త్రవేత్తలు అనుమానిస్తున్నారు. శరీరంలోని మోటార్ న్యూరాన్ల (చలనం కలిగించే నాడీకణాలు) శక్తిని పోగొట్టే ఎఎల్ఎస్, ప్రారంభ దశలో మానసిక అస్వస్థత రూపంలోనే లక్షణాలు చూపుతుందని ఈ పరిశోధనలు సూచిస్తున్నాయి. దీంతో డిప్రెషన్‌ను శారీరక వ్యాధుల 'లక్షణంగా' గుర్తించాల్సిన అవసరం ఉందని స్పష్టమవుతోంది.

మానసిక వైద్యానికి వాడే SSRIs, Benzodiazepines, Hypnotics వంటి మందులు నాడీ వ్యవస్థపై క్రమంగా ప్రభావం చూపే అవకాశం ఉందని కొందరు న్యూరాలజిస్టులు అంటున్నారు. అయితే దీనిపై ఇంకా మెరుగైన మెటా–అనాలిసిస్, మల్టీ–సెంటర్ అధ్యయనాలు అవసరమనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

**మొత్తంగా చూస్తే...**

ఈ అధ్యయనం ఒక గంభీర సంకేతాన్ని ఇస్తోంది – మానసిక ఆరోగ్య సమస్యలు అనేక రకాల శారీరక వ్యాధులకు సంకేతంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో డిప్రెషన్, ఆందోళన, నిద్రలేమికి మందులు ఇవ్వకముందే ఒకసారి శారీరక ఆరోగ్య ప్రొఫైలింగ్ చేయడం, ముఖ్యంగా నాడీ వ్యవస్థ పనితీరును పరీక్షించడం అవసరమవుతోంది.

ఎందుకంటే ఒకసారి ఎఎల్ఎస్ బారిన పడిన తరువాత చికిత్స చేయడం కష్టం. జీవితాంతం చలనం కోల్పోయే ప్రమాదం ఉంటుంది. అంతేకాకుండా, దీన్ని మానసిక వైద్యం మీద వ్యతిరేకతగా కాకుండా, సమగ్ర వైద్య దృష్టితో చూడాలి. మానసిక ఆరోగ్యం – శారీరక ఆరోగ్యం మధ్య అనుసంధానాన్ని వైద్య నిపుణులు, ప్రభుత్వ ఆరోగ్య విధానాలు సైతం పరిగణనలోకి తీసుకోవాలి. ఇప్పుడున్న నూతన వైద్య సామర్థ్యాలను మానసిక మందుల వాడకంపై మరింత శాస్త్రీయ పర్యవేక్షణకు వినియోగించాల్సిన సమయం ఇది.

# తలకు రాద్దాం మందారతైలం



'ఎందుకో తెలియదు... జుట్టు రాలిపోతోంది...' అనేవారే ఎక్కువ ఇప్పుడు. దానికీ కారణాలుంటాయి. అవేంటీ... జుట్టు రాలే సమస్యను ఎలా అధిగమించాలో చూద్దామా.

ఒత్తిడి, నిద్రలేమి, రసాయనాలున్న ఆహారం తీసుకోవడం... వంటి సమస్యల ప్రభావంతో జుట్టు రాలడం, బాల మెరుపు, చుండ్రు లాంటివి ఇబ్బంది పెడతాయి. వీటన్నింటికి తోడు వ్యక్తిగత శరీర ప్రకృతి, ఆహారపుటలవాట్లు, జీవనశైలి వంటివీ ఉంటాయి. శిరోజాలు ఆరోగ్యంగా ఉండాలంటే సరైన ఆహారంతోపాటు, పలు రకాల నూనెల్ని వాడాలి. అప్పుడే పట్టులాంటి జుట్టును సొంతం చేసుకోవచ్చు.

జుట్టుకి శారీరక, మానసిక ఆరోగ్యం కూడా అవసరమే. సమయానికి ఆహారం తీసుకోవాలి. ముఖ్యంగా కూరగాయలు, పండ్లు, మొలకెత్తిన గింజలు ఉండేలా చూసుకోవాలి. ఫాస్ట్‌ఫుడ్స్‌లో శరీరానికి హాని కలిగించే రసాయనిక పదార్థాలు, కొవ్వులుంటాయి. ఇవి దుష్ప్రభావాన్ని చూపిస్తాయి. కాబట్టి వాటికి దూరంగా ఉండాలి. డైటింగ్ పేరుతో సన్నబడాలనే దిశగా సరైన ఆహారం తీసుకోకపోవడం కూడా సరికాదు.

మానసిక ఒత్తిడి జుట్టుపై ప్రభావం చూపి, రాలిపోయేలా చేస్తుంది. కాబట్టి యోగా, ధ్యానం, వ్యాయామం వంటివి చేయాలి. అవి మనసును ప్రశాంతంగా ఉంచుతాయి. రోజులో చేసే పనులను సమయానుకూలంగా కేటాయించుకుని పూర్తి చేస్తూ, ఒత్తిడిని తగ్గించుకోవడం కూడా అవసరమే.

యష్టిమధు..దీన్ని అతి మధురం అని కూడా అంటారు. ఇది జుట్టుకు ఔషధంలా పని చేస్తుంది. గ్లాసు నీటిలో నాలుగు లేదా అయిదు చెంచాల యష్టిమధు చూర్ణం వేసి సగం నీరు ఆవిరైపోయేలా మరిగించాలి. మిగిలిన దానిని మెత్తని వస్త్రంలో వడపోసి ఉంచుకోవాలి. తలస్నానం చేసేటప్పుడు ఆఖరి మగ్గు నీళ్లు పోసే ముందు తలను ఈ కషాయంతో తడపాలి. రెండు నిమిషాలు ఆరనిచ్చి ఆ తరువాత చివరి మగ్గు నీటిని తలపై పోసుకుంటే చాలు. జుట్టు రాలడం తగ్గుతుంది.

ఇంటి చిట్కాలు...మందార: ఈ పూల రసాన్ని ప్రతిరోజూ కొబ్బరినూనె రాసుకున్నట్లుగా తలకు పట్టిస్తే జుట్టు రాలే సమస్య అదుపులో ఉంటుంది. దీనికోసం ఎండబెట్టిన మందార పూలను నీళ్లలో వేసి మరిగించి, సన్నటి వస్త్రంలో వడకట్టి చల్లార్చుకోవాలి. ఆ రసాన్ని తలకు రాసుకోవాలి.

మందార తైలం: నాలుగు కప్పుల మందార పూల రసం లేదా కషాయానికి కప్పు కొబ్బరినూనె కలపాలి. ఆ తరువాత నూనె మాత్రమే మిగిలేలా సన్నటి మంటపై కాచి చల్లార్చాలి. దీనిని వడకట్టి శుభ్రమైన గాజు సీసాలో భద్రపరుచుకొని తలనూనెగా వాడుకోవాలి. దీంతో జుట్టు రాలడం తగ్గి, నల్లగా నిగనిగలాడుతుంది. ఉసిరి: ఇది తలకు ఔషధంలా పని చేస్తుంది. తలస్నానం చేసేటప్పుడు చివరి మగ్గు నీళ్లు పోసుకునే ముందు అరకప్పు ఉసిరి రసంతో తలను తడపాలి. తరువాత ఆఖరి మగ్గు నీళ్లను తలపై పోయాలి. దీంతో జుట్టు రాలడం తగ్గుముఖం పడుతుంది. మ ృదువుగా, ఒత్తుగా తయారవుతుంది. ఆమ్ల తైలం: నాలుగు కప్పుల ఉసిరి రసం లేదా కషాయానికి కప్పు కొబ్బరి నూనె కలిపి సన్నటి మంటపై నూనె మాత్రమే మిగిలేలా కాచాలి. చల్లారిన తరువాత వడపోసి సీసాలో భద్రపరుచుకోవాలి. దీన్ని నిత్యం తలకు వాడితే జుట్టు రాలే సమస్య చాలామటుకూ తగ్గుతుంది.

# రక్తపోటు తగ్గిస్తుంది!




మనకు క్యాల్షియం, ఇనుము వంటి వాటి అవసరమేంటో ఎంతో కొంత తెలుసు. కానీ అంతే ప్రాధాన్యం ఉన్న మెగ్నీషియం ఏ సమయాల్లో ఉపయోగపడుతుందో తెలుసా? గర్భధారణ, మానసిక సమస్యల్ని అదుపు చేయడం మొదలుకుని మరెన్నో కీలక విషయాల్లో మెగ్నీషియం అవసరం ఉంది. అవేంటో చూద్దాం...

– మనసులో ఆందోళనా... మెడా, భుజాల నొప్పులూ, వికారం, గుండెదడ వంటి లక్షణాలు కనిపిస్తే దానికి కారణం మెగ్నీషియం లోపం కూడా కావొచ్చు. మనలో వ్యాధినిరోధక శక్తిని పెంచి ఎముకలు గుల్లబారి పోకుండా చేయడానికి ఈ ఖనిజం ఎంతగానో ఉపయోగపడుతుంది. కండరాలూ, నాడీవ్యవస్థ ఆరోగ్యానికి ఇదెంతో మేలు చేస్తుంది.

– కాల్షియం లోపం ఉన్నప్పుడు మాత్రమే ఆస్టియోపొరోసిస్ వస్తుందని అనుకుంటాం. కానీ మెగ్నీషియం కూడా అవసరమే. దీన్ని సరిపడా తీసుకున్నప్పుడే శరీరంలో విటమిన్ డి, క్యాల్షియం, రాగి, జింక్ పోషకాలను ఆహారం నుంచి శరీరం స్వీకరిస్తుంది. ఎముకల ఆరోగ్యానికి దోహదపడుతుంది.

– గర్భధారణ సమయంలో తగినంత మెగ్నీషియంని తీసుకోవడం వల్ల ప్రసవ సమయంలో అధిక రక్తపోటు అదుపులో ఉంటుంది. సుఖప్రసవం అయ్యేలా చూస్తుంది. గర్భిణులకే కాకుండా ఎవరికైనా మెగ్నీషియం సల్ఫేట్ ఉన్న పదార్థాలు అధిరక్తపోటు రాకుండా చేస్తాయి.

– ఇంతకీ మెగ్నీషియం ఏయే పదార్థాల నుంచి పుష్కలంగా అందుతుందో తెలుసా.. దంపుడు బియ్యం, పాలకూర, సోయాబీన్స్, జీడిపప్పు, బాదంపప్పు, అరటిపండ్లూ, అంజీర, అవిసె గింజలూ, గుమ్మడి గింజలూ, పనీర్‌ల నుంచి ఈ పోషకాన్ని పుష్కలంగా పొందవచ్చు.

## జపనీయులు ఎక్కువకాలం జీవించడానికి కారణం ఏంటో తెలుసా?.. వారిని మనమూ అనుసరిస్తే పోలా?

భూమ్మీద అతి ఎక్కువ కాలం జీవించే మనుషులు ఎక్కడ ఉన్నారని ఎవరైనా అంటే వెంటనే గుర్తుకువచ్చే పేరు జపాన్. ప్రత్యేకమైన జీవనవిధానం, సామాజిక, సాంస్కృతిక సంబంధాల కారణంగా జపనీయులకు సుదీర్ఘ జీవిత ప్రాప్తి కలిగింది. ఆ దేశస్తుల ఆరోగ్యకరమైన సుదీర్ఘ జీవితం వెనక కొన్ని అలవాట్లు ఉన్నాయి.

**నడక ప్రాధాన్యం**

చాలామంది జపాన్ దేశస్తులు పని ప్రదేశాలకు, విద్యాసంస్థలకు సాధ్యమైనంత వరకు నడిచి గానీ, సైకిల్ మీదగానీ వెళ్తారు. మరీ దూరం అనుకుంటే ప్రజా రవాణా ఉపయోగించుకుంటారు. ఇలా వారి జీవితంలో నడక, సైక్లింగ్ విడదీయరాని భాగాలు. ఇలా చేయడం వారి గుండె ఆరోగ్యానికి, కండరాల పటుత్వానికి, మంచి ఫిట్‌నెస్‌కు దోహదపడుతున్నది.

**హరా హచిబు**

జపాన్ ఆహార విధానంలో 'హరా హచి బు'ను విస్తృతంగా అనుసరిస్తారు. అంటే కడుపు నిండా కాకుండా 80 శాతం నిండే వరకే తినాలని అర్థం. ఇది ఎక్కువమొత్తంలో తినకుండా నియంత్రిస్తుంది. మెరుగైన అరుగుదలకు సహకరిస్తుంది. అలా జపనీయులు ఆరోగ్యకరమైన బరువును నిలుపుకొంటారు. రోగాల ముప్పును తగ్గించుకుంటారు.

**చాయ్ ప్రేమికులు**

తేనీరులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలం. ఇక ఇన్‌ఫ్లమేషన్‌తో పోరాటానికి గ్రీన్ టీ సాయపడుతుంది. జీవక్రియల రేటును మెరుగుపరుస్తుంది. గుండెజబ్బులు, క్యాన్సర్ ముప్పును తగ్గిస్తుంది. రోజూ గ్రీన్ టీ తాగితే కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో!

**శాంతి సామరస్యాలు**

జపాన్‌లో 'వ' అనే అంశానికి ప్రాధాన్యం ఉంది. ఇది సమాజంలో శాంతియుత సహజీవనాన్ని ప్రోత్సహిస్తుంది. అందరితో కలివిడిగా ఉండటం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. మానసిక ఆరోగ్యం బాగుపడుతుంది. తోటివారితో సత్సంబంధాలు ఏర్పడతాయి.

**ఇకిగాయ్**

ఇది జపనీయుల రోజువారీ జీవితంలో తమకంటూ ఏదో ఒక ప్రయోజనం వెతుక్కునేలా చేస్తుంది. దాంతో వాళ్లు తమ పనిలో సంతృప్తి చెందుతారు. ఒత్తిడిని తగ్గించుకుంటారు. మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉంచుకుంటారు. జపనీయుల దీర్ఘకాల జీవితంలో ఇకిగాయ్ అండ ఎంతో!

**పరిశుభ్రతే ప్రధానం**

వ్యక్తిగతం మొదలుకుని పరిసరాల వరకు జపనీయులు పరిశుభ్రతకు చాలా ప్రాధాన్యం ఇస్తారు. రోజూ స్నానం చేయడం, తరచుగా చేతులు కడుక్కోవడం, శుభ్రమైన పరిసరాల్లో జీవించడం పట్ల వాళ్లెంతో శ్రద్ధ చూపుతారు. అలా మంచి ఆరోగ్యానికి హామీ ఇచ్చుకుంటారు.

షిన్‌రిన్–యోకుఅంటే అడవిలో స్నానం చేయడం అని అర్థం. పచ్చటి ప్రకృతిలోగడిపితే రక్తపోటు, ఒత్తిడి హార్మోన్ల ఊట తగ్గుతుంది. మూడ్ మెరుగుపడుతుంది. బంధాలకు జై జపనీయులు సామాజిక సంబంధాలకు ప్రాధాన్యం ఇస్తారు.

# ఆర్కిడ్స్‌తో అందలానికి..



కేరళకు చెందిన సబీరా మొహమ్మద్, కాలక్షేపం కోసం మొదలుపెట్టిన పూల మొక్కల పెంపకం, కేరళ రాష్ట్ర ప్రభుత్వం నుంచి 'ఉద్యాన వన శ్రేష్ఠ' పురస్కారాన్ని అందుకునే స్థాయికి ఎదిగింది. విదేశాల నుంచి ఆర్కిడ్స్‌ను దిగుమతి చేసుకుంటూ, నెలకు నాలుగు లక్షలు ఆర్జిస్తున్న సబీరా ఆసక్తికరమైన కథనమిది.

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఏడేళ్ల పాటు జీవించి, స్వస్థలమైన కేరళలోని పాలక్కాడ్‌కు తిరిగొచ్చినప్పుడు సబీనాకు రోజులు గడవడం కష్టంగా మారింది. భర్త పనికీ, పిల్లలు బడికీ వెళ్లిపోయాక, ఖాళీ సమయాన్ని ఎలా గడపాలో ఆమెకు అర్థమయ్యేది కాదు. దాంతో తనకెంతో ఇష్టమైన గార్డెనింగ్‌తో కాలక్షేపం చేయాలని నిర్ణయించుకుంది సబీరా. అందుకోసం తన టెర్రస్‌నే తగిన ప్రదేశంగా ఎంచుకుంది. అలా 1998లో మల్లె, జాజి పూల మొక్కల పెంపకంతో మొదలైన సబీరా పూల మొక్కల పెంపకం ప్రయాణం ఎన్నో మలుపులు తిరిగింది. అప్పటి రోజులను గుర్తు చేసుకుంటూ... "నేను దేశం నలుమూలల నుంచీ పూల మొక్కలను సేకరించేదాన్ని. కొరియర్ ద్వారా కొన్ని మొక్కలనూ, స్వయంగా నర్సరీలను సందర్శించడం ద్వారా ఇంకొన్ని మొక్కలనూ సేకరించేదాన్ని. మొక్కలు దొరకని సందర్భాల్లో విత్తనాలనూ, మొక్కల నమూనాలనూ సేకరించి పెంచుతూ ఉండేదాన్ని. క్రమేపీ నా టెర్రస్ మొత్తం రకరకాల పూల మొక్కలతో నిండిపోయింది. ఆ తర్వాత నా ఆసక్తి అర్కిడ్ ప్లాంటేషన్ మీదకు మళ్లింది." అంటూ పూల మొక్కల పట్ల తన ఆసక్తిని పంచుకుంది సబీరా.

**ఉద్యాన శ్రేష్ఠ అవార్డు అందుకుని...**

సబీరా, ఆర్కిడ్ ప్లాంటేషన్ కోసం పాలక్కాడ్‌లోని కృష్ణ భవన్ నుంచి శాంప్లింగ్స్‌ను సేకరించింది. ఆర్కిడ్ కల్టివేషన్ గురించి లోతుగా అధ్యయనం చేసి, లెక్కలేనన్ని కొత్త వంగడాలనూ సేకరించింది. అలా ఆర్కిడ్ ప్లాంటేషన్‌లో ప్రత్యేకమైన గుర్తింపు పొందినందుకు గాను, 2006లో కేరళ రాష్ట్ర ప్రభుత్వం 'ఉద్యాన శ్రేష్ఠ' పురస్కారంతో సత్కరించడం విశేషం. అ అవార్డుతో సబీరా పూల తోట ఎంతోమంది దృష్టిని ఆకర్షించింది. రాష్ట్రవ్యాప్త పూల ప్రియులందరూ ఆమె టెర్రస్‌ను సందర్శించడం మొదలుపెట్టారు. ఆమె భర్త మొహమ్మద్ మూసా కూడా భార్యను ప్రోత్సహిస్తూ ఆర్కిడ్స్ పెంపకంలో సహాయపడడం మొదలుపెట్టాడు. అలా సబీరా థాయిల్యాండ్ నుంచి కూడా కొత్త రకం ఆర్కిడ్స్‌ను దిగుమతి చేసుకోవడం మొదలుపెట్టింది. ప్రస్తుతం ఆమె దగ్గర 1300 రకాల ఆర్కిడ్స్ ఉన్నాయి.

**టెర్రస్ నుంచి నర్సరీ వరకూ...**

టెర్రస్ మొత్తం మొక్కలతో నిండిపోవడంతో, సబీరా తన మొట్టమొదటి నర్సరీ కోసం ఎకరం స్థలాన్ని కొనుగోలు చేసింది. "నేను మొదట థాయిల్యాండ్ నుంచి, తర్వాత చైనా, తైవాన్, ఆగ్నేయాసియా దేశాల నుంచి ఆర్కిడ్ మొక్కలను దిగుమతి చేసుకోవడం మొదలుపెట్టాను" అంటూ ఆర్కిడ్ మొక్కల పట్ల తనకున్న ఆసక్తి గురించి వివరించింది. సబీరా ఆ ఒక్క నర్సరీతో ఆగిపోకుండా, పాలక్కాడ్ జిల్లాలోనే రెండో నర్సరీ మొదలుపెట్టి, దానికి పర్ల్ ఆర్కిడ్స్ అనే పేరు పెట్టింది. "ఆర్కిడ్స్‌ను పెంచడం కాస్త కష్టమైన పనే! అయినా టిష్యూ కల్చర్ ద్వారా నేను వాటిని సమర్థంగా పెంచగలిగాను.

మంచి బ్రీడర్ నుంచి టిష్యూ కల్చర్ సహాయంతో పెరిగిన ఆర్కిడ్స్‌ను కూడా కొనుగోలు చేశాను. వాణిజ్యపరమైన సాగుకు ఇలాంటి మొక్కలే ఉపయోగకరంగా ఉంటాయి" అని వివరిస్తున్న సబీరా నాణ్యమైన మొక్కల కోసం పేరున్న బ్రీడర్స్‌నే ఎంచుకుంటూ ఉంటుంది. అలాగే కస్టమర్లకు విక్రయించే ముందు, మొక్కల ఎదుగుదలను పరిశీలిచడానికి వీలుగా 50 వేల మొక్కలు ఉంచే ఒక క్వారంటీన్ ఫెసిలిటీ కేంద్రాన్ని కూడా నెలకొల్పింది.

**ఏడాదికి నాలుగు లక్షలు...**

ఔషధాల తయారీ కోసం, అలంకరణ ప్రయోజనాల కోసం ఆర్కిడ్స్ వాడకం ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగింది. కాబట్టి సబీరా తన పెర్ల్ ఆర్కిడ్స్ నర్సరీ సహాయంతో ఒక్కొక సీడ్లింగ్‌ను రకాన్ని బట్టి, 80 నుంచి 100 రూపాయలకు విక్రయిస్తోంది. ఎదిగిన మొక్కలను 250 నుంచి 350 రూపాయలకు విక్రయిస్తోంది. మొక్కలను సేకరించే అభిరుచి కలిగినవాళ్లు, గార్డెనర్లు, రైతులు, హోల్‌సేల్ నర్సరీలు సబీరా నుంచి ఆర్కిడ్స్‌ను కొనుగోలు చేస్తూ ఉంటారు. ఆ మొక్కల పెంపకం గురించి వివరిస్తూ... "పాటింగ్ మిక్స్‌ను తెప్పించుకుని, హైడ్రోక్లోరిక్ యాసిడ్‌తో దాన్ని శుభ్రపరిచి, వారం రోజుల పాటు నీళ్లతో కడిగి, తర్వాత ఎండలో ఆరబెట్టి వాడుకుంటామనీ, ఆ ప్రక్రియ మొత్తానికీ 8 నుంచి 9 రోజుల సమయం పడుతుంది" అంటూ వివరిస్తోంది సబీరా. శుభ్రం చేయని మిక్స్‌ను కిలోకు 100 రూపాయల చొప్పున, శుభ్రం చేసిన మిక్స్‌ను కిలోకు 150 రూపాయల చొప్పున విక్రయిస్తూ అదనపు ఆదాయాన్ని కూడా ఆర్జిస్తోందామె. ఇలా మొక్కల ద్వారా నెలకు దాదాపు నాలుగు లక్షల ఆదాయాన్ని ఆర్జిస్తున్నట్టు కూడా వివరించింది.

# రోజుకు ఎన్నిసార్లు తినాలి



సాధారణంగా రోజుకు మూడు సార్లు ఆహారం తీసుకుంటాం. అయితే కొందరు అంతకంటే ఎక్కువసార్లు తింటారు. ఇలా చేయడం వలన ఆరోగ్యం మీద ఎలాంటి ప్రభావం ఉంటుందో, వైద్యులు ఏమంటున్నారో తెలుసుకుందాం..

రోజులో మూడు కంటే ఎక్కువ సార్లు ఆహారం తీసుకోవడం వలన కొన్ని ప్రయోజనాలు, కొన్ని నష్టాలు ఉంటాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. మనం ఏం తింటున్నాం?, ఎంత మోతాదులో తింటున్నాం? అన్న దాని మీదే శరీరానికి లాభమా? నష్టమా? అనేది ఆధారపడి ఉంటుందని పేర్కొంటున్నారు. శరీరానికి సమతుల్య పోషకాహారం అవ సరం. కొద్ది, కొద్దిగా ఎక్కువసార్లు తినడం వల్ల ప్రయోజనాలు ఉంటాయని వైద్యులు అంటున్నారు. ముఖ్యంగా మధుమేగ రోగులకు, ఇన్సులిన్ సెన్సిటివిటీ ఉన్నవారికి దీని వలన ప్రయోజనం చేకూరుతుందని లక్డీకాపూల్‌లోని గ్లెనీగేల్స్ హాస్పిటల్ చీఫ్ డైటీషియన్, డాక్టర్ పి భావన తెలిపారు. ఇలా తినడం వల్ల రక్తంలో చక్కెరస్థాయులు సిరంగా ఉంటాయనీ, ఇలా కొద్ది కొద్దిగా తినడం వలన జీర్ణవ్యవస్థ మీద ఒత్తిడి తగ్గుతుందనీ అంటున్నారు. ఛాతీ మంట, జీర్ణకోశ సమస్యలతో బాధపడే వారికి దీనిని సిఫారసు చేస్తారని కూడా ఆమె చెప్పారు. ఇలా తినవడం వలన రోజంతా శక్తి సమకూరే అవకాశం ఉంటుంది. అయితే ఎక్కువసార్లు తినడం వలన నష్టాలు కూడా లేకపోలేదు. తరచూ తినడం వల్ల సహజంగా కలిగే ఆకలి సంకేతాలకు భంగం కలుగుతుందని ముంబైలోని గ్లెనీగల్స్ హాస్పిటల్ ఇంటర్నల్ మెడిసిన్ సీనియర్ కన్సల్టెంట్, డాక్టర్ మంజూష అగర్వాల్ పేర్కొన్నారు. ఆహారం జీర్ణమవడానికి సరిపడా సమయం ఉండకపోవడం, ఎక్కువ మొత్తంలో తింటూ ఉండడం, క్యాలరీలు, చక్కెర, కొవ్వులు ఎక్కువగా ఉన్న ఆహారం తినడం వలన అధిక బరువు సమస్య పొంచి ఉంటుందని ఆమె హెచ్చరించారు. అలాగే ఎక్కువసార్లు తినడం వల్ల జీర్ణవ్యవస్థ మీద ఒత్తిడి పెరుగుతుందని, గ్యాస్, ఉబ్బరం, అజీర్తి సమస్యలు తలెత్తుతాయని అన్నారు. అలాగే మెటబాలిక్ సమస్యల ప్రమాదం పెరిగే అవకాశం ఉందని కొన్ని అధ్యయనాల్లో తేలిందని డాక్టర్ మంజూష అగర్వాల్ వెల్లడించారు. అయితే భోజనానికి, భోజనానికి మధ్య ఎంత సమయం అవసరం అన్నది వ్యక్తుల జీవనశైలి, ఆరోగ్య పరిస్థితి మీద ఆధారపడి ఉంటుందని ఆమె వెల్లడించారు.







## గ్లాండ్ ఫార్మా రేసులో బ్రూక్‌ఫీల్డ్ ఈక్యూటీ

**ముంబై-నవభూమి:**దేశీయ ఫార్మా రంగంలో మరో భారీ డీల్‌కు రంగం సిద్ధమవుతోంది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే గ్లాండ్ ఫార్మా యాజమాన్యం మళ్లీ చేతులు మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ కంపెనీ ఈక్విటీలో 51.8 శాతం వాటా ఉన్న చైనా కంపెనీ ఫోసన్ గ్రూప్ తన వాటాను అమ్మకానికి పెట్టినట్టు సమాచారం. ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలు బ్రూక్‌ఫీల్డ్, ఈటీక్యూ ఈ వాటా కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నట్టు తెలుస్తోంది. సీవీసీ క్యాపిటల్ పార్ట్‌నర్స్, వార్‌బర్గ్ పింకస్ అనే పీఈ సంస్థలు కూడా త్వరలో ఈ వాటా కొనుగోలుకు ముందుకు వస్తాయని భావిస్తున్నారు.

ఫోసన్ వాటా విలువ రూ.30,000 కోట్లు

గ్లాండ్ ఫార్మా షేరు సోమవారం బీఎస్ఈలో స్వల్పలాభంతో రూ.2,012.15 వద్ద క్లోజైంది. గత నెల రోజుల్లోనే కంపెనీ షేరు ధర 16 శాతం పెరిగింది. ఈ లెక్కన గ్లాండ్ ఫార్మా ఈక్విటీలో చైనా కంపెనీ ఫోసన్‌కు ఉన్న 51.8 శాతం వాటా విలువ దాదాపు రూ.30,000 కోట్ల వరకు ఉంటుంది. దీంతో పాటు మైనారిటీ వాటాదారుల నుంచి మరో 26 శాతం వాటాను ఓపెన్ ఆఫర్ ద్వారా కొనుగోలు చేయాలి. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం చూస్తే ఇందుకు ఎంత లేదన్నా మరో రూ.25,800 కోట్ల వరకు ఖర్చవుతుంది. ఇంత భారీ మొత్తం పెట్టేందుకు ప్రైవేట్ ఈక్విటీ సంస్థలు వెనుకాడుతున్నట్లు సమాచారం.

## సైబర్ దాడితో మూతపడిన 158 ఏళ్ల నాటి కంపెనీ.. రోడ్డునపడ్డ 700 మంది ఉద్యోగులు



**న్యూఢిల్లీ-నవభూమి:**కారణంగా 158 ఏళ్ల చరిత్ర కలిగిన ఓ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీమూతపడింది. దీంతో అందులో పనిచేసే దాదాపు 700 మంది ఉద్యోగులు వీధినపడ్డారు. బ్రిటన్‌కు చెందిన ట్రాన్స్‌పోర్టు కంపెనీ కేఎన్‌పీ లాజిస్టిక్స్‌ది సుదీర్ఘ చరిత్ర. దాదాపు 158 ఏళ్లుగా రవాణా రంగంలో వ్యాపారం చేస్తోంది. ఈ సంస్థ సుమారు 500 లారీలను నిర్వహించేది. అయితే, వీక్‌పాస్ వర్డ్ కారణంగా సైబర్ నేరగాళ్లు కంపెనీ సిస్టమ్‌లోకి చొరబడి కీలకమైన సమాచారాన్ని తమ నియంత్రణలో తీసుకున్నారు. డాటా మొత్తాన్ని ఉద్యోగులు వినియోగించుకోలేని విధంగా ఎన్‌క్రిప్ట్ చేశారు. ఈ డాటాను తిరిగి పొందాలంటే కొంత డబ్బు చెల్లించాలని డిమాండ్ చేశారు. కానీ సంస్థ యాజమాన్యం వద్ద అంత డబ్బు లేకపోవడంతో చేతులెత్తేసింది. చివరకు సంస్థ మూతపడింది. అందులోని 700 మంది ఉద్యోగులు ఉపాధి కోల్పోయి వీధిన పడ్డారు. అయితే, సైబర్ నేరగాళ్లు ఎంత మొత్తం డిమాండ్ చేశారన్నదానిపై మాత్ర స్పష్టతరాలేదు.

## ఐఎంఎఫ్‌ను నుంచి వైదొలగనున్న గీతా గోపీనాథ్



**న్యూఢిల్లీ-నవభూమి:** అంతర్జాతీయ ద్రవ్య నిధిలో డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న గీతా గోపీనాథ్ త్వరలో ఆ పదవి నుంచి వైదొలగనున్నారు. ఆగస్టులో ఐఎంఎఫ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ పదవి నుంచి గీతా గోపీనాథ్ దిగిపోనున్నట్లు ఐఎంఎఫ్ అధికారికంగా ప్రకటించింది. ఆమె స్థానంలో ఆ పదవి చేపట్టే వ్యక్తి ఎవరన్నది త్వరలోనే ప్రకటిస్తామని తెలిపింది. ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జివా గీతా గోపీనాథ్ నిష్క్రమణను ధ్రువీకరించారు.
ఇక ఈ పదవి నుంచి వైదొలిగిన అనంతరం ఆమె తిరిగి హార్వర్డ్ యూనివర్సిటీ )లో ప్రొఫెసర్‌గా చేరనున్నారు. అమెరికా, భారత్‌లో పౌరసత్వం ఉన్న గీతా గోపినాథ్.. 2019 అక్టోబర్‌లో ఐఎంఎఫ్ చీఫ్ ఎకానమిస్ట్‌గా నియమితులయ్యారు. ఐఎంఎఫ్ చరిత్రలో ఆ బాధ్యతలు చేపట్టిన తొలిమహిళగా నిలిచారు. 2022 జనవరిలో ఆమెకు ఫస్ట్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్‌గా పదోన్నతి లభించిన విషయం తెలిసిందే.

## మళ్లీ లాభాల్లోకి మార్కెట్లు




**ముంబై-నవభూమి:** గత వారాంతంలో వరుసగా రెండు రోజులు నష్టాలు చవిచూసిన దేశీయ మార్కెట్ సూచీలు సోమవారం మళ్లీ లాభాల్లో పయనించాయి. సెన్సెక్స్ 442.61 పాయింట్ల వృద్ధితో 82,200.34 వద్దకు చేరుకోగా.. నిఫ్టీ 122.30 పాయింట్ల లాభంతో 25,090.70 వద్ద ముగిసింది. ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజాలైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లలో ఇన్వెస్టర్లు జోరుగా కొనుగోళ్లు చేపట్టడం ఇందుకు దోహదపడింది. అయితే, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో అమ్మకాలు సూచీల లాభాలను పరిమితం చేశాయి.బ్రిగేడ్ హోటల్ ఐపీఓ ధరల శ్రేణి రూ.85-90: బెంగళూరుకు చెందిన రియల్టీ కంపెనీ బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెసకు చెందిన ఆతిథ్య సేవల అనుబంధ విభాగమైన బ్రిగేడ్ హోటల్ వెంచర్స్ లిమిటెడ్ రూ.760 కోట్ల ఐపీఓ ఈ నెల 24న ప్రారంభమై 28న ముగియనుంది. పబ్లిక్ ఇష్యూ ధరల శ్రేణిని రూ.85-90గా నిర్ణయించింది.

## జీసీసీల అడ్డా హైదరాబాద్



**హైదరాబాద్-నవభూమి:** ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) కంపెనీలతో పాటు గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ)కూ హైదరాబాద్ కేంద్రంగా మారుతోంది. ప్రస్తుతం దేశంలో బెంగళూరు తర్వాత హైదరాబాద్‌లోనే ఎక్కువ జీసీసీలు కొలువుదీరాయి. దేశంలో ఉన్న దాదాపు 1,700 జీసీసీల్లో 29 శాతం (487) బెంగళూరులో ఉంటే, 273 జీసీసీలతో హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. అమెరికా కేంద్రంగా పనిచేసే రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ వెస్టియన్ ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది.
ఢిల్లీ-ఎన్‌సీఆర్ (272), ముంబై (207), పుణె (178), చెన్నై (162) వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. దేశవ్యాప్తంగా నగరాల్లో పెరుగుతున్న మౌలిక వసతులు, నిపుణులైన ఉద్యోగులు దొరకడం, ప్రభుత్వాల ప్రోత్సాహం, ఇతర దేశాలతో పోలిస్తే తక్కువ ఖర్చులు మన దేశంలో పెద్దఎత్తున జీసీసీల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నాయి.
నివేదికలోని ఇతర ప్రధానాంశాలు
దేశంలోని మొత్తం జీసీసీల్లో 55 శాతం (922) బెంగళూరు, హైదరాబాద్, చెన్నై నగరాల్లోనే
ప్రపంచవ్యాప్తంగా ఉన్న 3,200 జీసీసీల్లో 53 శాతం భారత్‌లోనే
దేశంలోని మొత్తం జీసీసీల్లో 94 శాతం ఆరు నగరాల్లోనే ఉన్నాయి
2028 నాటికి దేశంలో జీసీసీల సంఖ్య 2,100 దాటే అవకాశం

## ఫోక్స్‌వ్యాగన్ ఇండియా మాన్సూన్ సర్వీస్ క్యాంప్‌తో భద్రతకు తొలి ప్రాధాన్యత



**న్యూఢిల్లీ-నవభూమి:** ఫోక్స్‌వ్యాగన్ ఇండియా తన వార్షిక మాన్సూన్ సర్వీస్ క్యాంప్ సేవలను ప్రారంభించి వినియోగదారునికి భద్రత, సంతృప్తికి తన నిబద్ధతను మరోసారి పునరుద్ఘాటించింది. వర్షాకాలం సవాళ్లను నమ్మకంగా, సులభంగా అధిగమించేలా చేయడంలో వినియోగదారులకు సహాయపడేందుకు రూపొందించబడిన ఈ మాన్సూన్ సర్వీస్ క్యాంప్ భారతదేశంలోని అన్ని అధీకృత సేవా సౌకర్యాలలో అందుబాటులోకి వచ్చింది. ఈ ప్రయత్నం ద్వారా ఎక్స్‌పర్ట్ వాహన సంరక్షణ, ప్రత్యేకమైన ఆదా, వేగవంతమైన ఓనర్‌షిప్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది.క్యాంపెయిన్‌లో భాగంగా, వినియోగదారులు ఉచిత 40-పాయింట్ వాహన చెక్-అప్‌ను పొందవచ్చు. ఇది సవాళ్లతో కూడిన రుతుపవన పరిస్థితులలో సురక్షితమైన డ్రైవింగ్‌కు కీలకమైన బ్రేక్‌లు, టైర్లు, వైపర్లు, లైటింగ్ సిస్టమ్‌లు వంటి ముఖ్యమైన భాగాల సర్వీస్ చెక్-అప్ ఇది కవర్ చేస్తుంది.అదనంగా, సర్వీస్ వాల్యూ ప్యాకేజీలపై అందుబాటులో ఉన్న ప్రత్యేక డిస్కౌంట్లతో వినియోగదారులు ఆకర్షణీయమైన ప్రయోజనాలను పొందవచ్చు. ఈ ప్యాకేజీలు పెరుగుతున్న సర్వీస్ ఖర్చులు, 100% నిజమైన వాహన విడిభాగాలు, సర్టిఫైడ్ టెక్నీషియన్లు, పాన్-ఇండియా కవరేజ్, బదిలీ చేయగల ఓనర్‌షిప్ నుంచి రక్షణను అందిస్తాయి. ఇవి సౌలభ్యాన్ని , దీర్ఘకాలిక విలువ రెండింటినీ పెంచుతాయి. సర్వీసు ఆఫర్లకు మించి, ఫోక్స్‌వ్యాగన్ మాన్సూన్ సమయంలో కారుకు సంరక్షణ చిట్కాలను అందించడం వినియోగదారుడి అవగాహన పెంచడంపైనా కూడా దృష్టి సారిస్తోంది. సీజన్ మొత్తం, వినియోగదారులు సమాచారం పొందడానికి సహాయపడుతుంది.ఫోక్స్‌వ్యాగన్ ఇండియా బ్రాండ్ డైరెక్టర్ నితిన్ కోహ్లీ మాట్లాడుతూ, "ఫోక్స్‌వ్యాగన్‌లో, మా వినియోగదారులు రహదారులపై నమ్మకంగా, సురక్షితంగా ఉన్నారని నిర్ధారించుకోవడం మా ప్రాధాన్యత. ముఖ్యంగా సవాళ్లతో కూడిన రుతుపవన కాలంలో ఇది చాలా ముఖ్యం. మాన్సూన్ సర్వీస్ క్యాంప్ విలువ, నమ్మకం, నిపుణుల సంరక్షణను అందించడంలో మా నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. ఉచిత చెక్-అప్‌ల నుంచి అర్థవంతమైన ఆదాచ నిజమైన సేవ వరకు, మా కార్ల తరహాలో నమ్మదగిన ఓనర్‌షిప్ అనుభవాన్ని అందించాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాము" అని వివరించారు.ఫోక్స్‌వ్యాగన్ ఉత్పత్తులు మరియు సేవల గురించి మరింత సమాచారం కోసం, వినియోగదారులు తమకు సమీపంలోని ఫోక్స్‌వ్యాగన్ షోరూమ్ లేదా www.volkswagen.co.inని సందర్శించవచ్చు.

## డీఏపీ ఎరువుల లభ్యతపై రాజ్యసభలో కేంద్రమంత్రి కీలక ప్రకటన..!




**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారతదేశం 9.74 లక్షల టన్నుల డై-అమ్మోనియం ఫాస్ఫేట్ ని దిగుమతి చేసుకుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుత సంవత్సరానికి డీఏపీ దిగుమతికి గణాంకాలను రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ రాజ్యసభలో వెల్లడించారు. భారతదేశం ఏప్రిల్‌లో 2.89 లక్షల టన్నులు, మేలో 2.36 లక్షల టన్నులు, జూన్‌లో 4.49 లక్షల టన్నులు దిగుమతి చేసుకుందని చెప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 45.69 లక్షల టన్నులు, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 55.67 లక్షల టన్నులు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో 65.83 లక్షల టన్నులు, 2021-22 ఆర్థిక సంవత్సరంలో 54.62 లక్షల టన్నులు, 2020-21 ఆర్థిక సంవత్సరంలో 48.82 లక్షల టన్నులు దిగుమతి చేసుకుందని వివరించారు.
యూరియాను 2024-25లో 56.47 లక్షల టన్నులు, 2023-24లో 70.42 లక్షల టన్నులు, 2022-23లో 75.80 లక్షల టన్నులు, 2021-22లో 91.36 లక్షల టన్నులు, 2020-2లో 98.28 లక్షల టన్నులు దిగుమతి చేసుకున్నట్లు వివరించింది.ఖరీఫ్ నేపథ్యంలో రైతుల అవసరాలను తీర్చేందుకు అవసరమైన ఎరువులు ఉన్నాయని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో రసాయన ఎరువుల అవసరం గతేడాది కంటే ఎక్కువగా ఉందన్నారు. రుతుపవనాలతో పాటు సాగు విస్తీర్ణం పెరిగింది. ఏప్రిల్ 2010 నుంచి కేంద్రం ఫాస్ఫేటిక్, పొటాసిక్ ఎరువుల కోసం పోషక ఆధారిత సబ్సిడీ విధానాన్ని అమలు చేసింది. ఎరువుల డిమాండ్, ఉత్పత్తి మధ్య అంతరాన్ని దిగుమతుల ద్వారా తీరుస్తామని కేంద్రమంత్రి అనుప్రియ పటేల్ చెప్పారు. భౌగోళిక రాజకీయ కారణంగా సరఫరాలో గొలుసులో ఎదురైన అంతరాయాల ప్రభావాన్ని తగ్గించేందుకు.. ఎరువుల కంపెనీలు నిరంతరాయంగా సరఫరాను చేసేలా డీఏపీ ఉత్పత్తి చేసే దేశాలతో దీర్ఘకాలిక ఒప్పందాలను కుదుర్చుకున్నాయి.

## 11వేల యూట్యూబ్ చానల్స్‌పై గూగుల్ వేటు..!




**న్యూఢిల్లీ-నవభూమి:** పెద్ద ఎత్తున యూట్యూబ్ చానల్స్‌పై గూగుల్ చర్యలు చేపట్టింది. ప్రపంచవ్యాప్తంగా 11వేల యూట్యూబ్ చానల్స్‌ను తొలగించినట్లు టెక్ కంపెనీ ప్రకటించింది. ఇందులో చైనా, రష్యాకు చెందిన చానల్స్ అత్యధికంగా ఉన్నాయని కంపెనీ పేర్కొంది. చైనాకు చెందిన 7,700 ఛానెల్స్ ఉన్నాయని తెలిపింది. ఇంగ్లిష్, చైనీస్‌లో ప్రసారం చేసేవి ఉన్నాయని పేర్కొంది. అసత్య ప్రచారం, అపోహలు ప్రచారం చేస్తున్న నేపథ్యంలో వాటిని బ్లాక్ చేసినట్లు చెప్పింది. భారత్‌లో చైనా కమ్యూనిస్టు పార్టీకి అనుకూలంగా ప్రచారాలు నిర్వహిస్తూ.. అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను ప్రశంసించే విధంగా కంటెంట్‌ను పోస్ట్ చేస్తున్నట్లు గూగుల్ తెలిపింది. రష్యా చెందిన 2వేలకుపైగా యూట్యూబ్ చానల్స్‌పై వేటు వేసినట్లు పేర్కొంది.ఆయా చానల్స్ నాటో, ఉక్రెయిన్‌పై విమర్శలు చేస్తూ రష్యాకు అనుకూలంగా సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నట్లుగా గూగుల్ గుర్తించింది. రష్యాలోని కొన్ని సంస్థలతో ఈ చానల్స్‌కు సంబంధాలు ఉన్నాయని పేర్కొంది. వీటితో పాటు ఇజ్రాయెల్, తుర్కియే, ఇరాన్, ఘానా, అజర్‌బైజాన్, రొమేనియా దేశాలకు చెందిన యూట్యూబ్ చానల్స్ మత విద్వేషాలు రెచ్చగొట్టేలా, శాంతి భద్రతలకు విఘాతం కలిగే, నిరాధార, కల్పిత కంటెంట్‌ను ప్రచారం చేస్తున్నాయని.. రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుంటున్నాయని గూగుల్ తెలిపింది. ఇదిలా ఉండగా.. గూగుల్ ఈ ఏడాది తొలి త్రైమాసికంలో ఇదే తరహా కారణాలతో దాదాపు 23వేల అకౌంట్స్‌ను తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నది.

## సంపన్నులు తమ ఆస్తులను ఎలా పెంచుకుంటారో తెలుసా.. సీఏ చెప్పిన ఈ సూత్రం తెలిస్తే..




**న్యూఢిల్లీ-నవభూమి:** భారతీయ వ్యాపారస్థుల దృక్పథంలో మార్పు వస్తోందని ఓ చార్టర్డ్ అకౌంటెంట్ చెప్పుకొచ్చారు. సరైన సమయంలో రుణాలతో వ్యాపారాలను విస్తరించుకుని కోట్లకు పడగలెత్తుతున్నారని వివరించారు. క్రమ పద్ధతిలో రుణాల సేకరణ ద్వారా భారతీయ వ్యాపారులు కొత్త మార్కెట్‌లకు విస్తరిస్తున్నారని తెలిపారు. వ్యాపారంలో దూసుకుపోవడానికి, వెనకబడటానికి మధ్య ప్రధాన అంతరం ఇదేనని వివరించారు. రుణాల విషయంలో అవగాహన లేక అనేక మంది వ్యాపారులు వెనుకబడిపోతున్నారని అన్నారు . 'అధికశాతం వ్యాపారస్థులు తమ బిజినెస్‌ను విస్తరించలేక పోవడానికి ప్రధాన కారణం సొంత నిధులపై ఎక్కువగా ఆధారపడటమే. కానీ సంపన్నులు ఇలా చేయరు. తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకునేందుకు వారు రుణాలపై ఆధారపడతారు' అని తెలిపారు. ఈ చిట్కాతో సంపన్నులు తమ యాజమాన్య హక్కులు కోల్పోకుండానే వ్యాపారాన్ని సులువుగా విస్తరిస్తున్నారని తెలిపారు. చిన్న, మధ్య శ్రేణి సంస్థల యాజమాన్యం మాత్రం లోన్స్ విషయంలో అతి జాగ్రత్త పాటించి చివరకు వ్యాపార విస్తరణలో వెనకబడుతున్నారని అన్నారు. ఆదాయం, వ్యాపారాభివృద్ధి ప్రణాళికలకు అనుగుణంగా రుణాలు తీసుకుని ముందడుగు వేస్తే ఎలాంటి ఒత్తిడి లేకుండానే వ్యాపారాన్ని సులువుగా విస్తరించుకోవచ్చని తెలిపారు.'అప్పు అంటే ఇబ్బందుల్లో ఉన్నప్పుడు మాత్రమే ఎంచుకునే మార్గం కాదు. ప్రణాళికాబద్ధంగా తీసుకోవాల్సిన నిర్ణయం. ఒక లక్ష్యంతో తీసుకున్న రుణాలతో కొత్త ఆస్తులను సొంతం చేసుకోవచ్చు. ఆదాయం పెంచుకోవచ్చు. ఎంచుకున్న రంగాల్లో అగ్రగామిగా ఉండొచ్చు. నిధుల లేమి వ్యాపారాభివద్ధికి అడ్డంకి కాకూడదు' అంటూ కీలక వ్యాపార సూత్రాన్ని వివరించే ప్రయత్నం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యాపార వాణిజ్య సంస్థలకు అనేక మార్గాల్లో నిధులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అవగాహన లేమి, ఆలోచనల్లో మార్పు లేకపోవడమే వ్యాపారాభివృద్ధికి ప్రధాన అవరోధాలుగా మారాయని వివరించారు.
అయితే, యువ వ్యాపారవేత్తలు, వ్యాపార కుటుంబాల నుంచి వచ్చిన రెండో తరం వ్యక్తుల్లో మాత్రం ఈ దిశగా మార్పు కనిపిస్తోందని తెలిపారు.
సాహసోపేత నిర్ణయాలు తీసుకునేందుకు వారు వెనకాడట్లేదని అన్నారు. డబ్బున్న వారి ఆలోచన ధోరణిని కూడా వివరించారు. 'ఒక్క రూపాయి అప్పుతో రాబడి ఎంత మేరకు పెరిగిందని వారు ఆలోచిస్తారు.
కోటి రూపాయల అప్పుతో రెండేళ్ల తరువాత ఆదాయం రూ.5 కోట్లకు చేరిందంటే రుణాన్ని సద్వినియోగం చేసుకున్నట్టే' అని చెప్పారు. బిజినెస్ లైఫ్ సైకిల్, రిస్క్‌ల ఆధారంగా సంపన్నులు రుణాలు తీసుకుంటారని తెలిపారు.

## ఎంజీ ఎం9 ఎలక్ట్రిక్ కారు



**న్యూఢిల్లీ-నవభూమి:**జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా.. మార్కెట్లోకి ఎంజీ ఎం9 ఎలక్ట్రిక్ లిమోసిన్ కారును తీసుకువచ్చింది. ఈ కారు పరిచయ ధర రూ.69.90 లక్షలు (ఎక్స్‌షోరూమ్). కంపెనీ లగ్జరీ రిటైల్ విభాగం ఎంజీ సెలెక్ట్ ద్వారా ఈ కార్లను విక్రయించనుంది. రూ.లక్ష చెల్లించి ఈ కారును బుక్ చేసుకోవచ్చని ఎంజీ వెల్లడించింది. ఆగస్టు 10 నుంచి ఈ కారు డెలివరీలను ప్రారంభించనున్నట్లు తెలిపింది. 90కేడబ్ల్యూహెచ్ నికెల్ మాంగనీస్ కోబాల్ట్ (ఎన్ఎంసీ) బ్యాటరీతో కూడిన ఈ కారు ఒకసారి చార్జింగ్‌తో 548 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. 160 కేడబ్ల్యూ డీసీ ఫాస్ట్ చార్జర్‌తో ఈ బ్యాటరీ కేవలం గంటన్నరలోనే వంద శాతం చార్జింగ్ అవుతుంది.

## యూకో బ్యాంక్ లాభం రూ.607 కోట్లు




**కోల్‌కతా-నవభూమి:** ప్రభుత్వ రంగంలోని యూకో బ్యాంక్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.607 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.551 కోట్లతో పోల్చితే లాభం 10.16% పెరిగింది. బలమైన రుణ వృద్ధితో పాటు ఆస్తుల నాణ్యత మెరుగుపడడం ఇందుకు దోహదపడినట్టు బ్యాంక్ తెలిపింది. ఇటు వడ్డీ ఆదాయం, అటు వడ్డీయేతర ఆదాయం కూడా పెరిగాయని బ్యాంక్ ఎండీ, సీఈఓ అశ్విని కుమార్ తెలిపారు. రుణాలపై ఆర్జించిన వడ్డీ ఆదాయమే రూ.6,000 కోట్ల నుంచి రూ.6,400 కోట్లకు పెరిగిందన్నారు. దీనికి తోడు నిర్వహణా వ్యయా లు 4% మాత్రమే పెరగడం లాభదాయకత పెరుగుదలకు దోహదపడిందని తెలిపారు. అయితే రుణాలపై వడ్డీ సవరణ ముందస్తుగానే ప్రకటించిన కారణంగా నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) గతంలో అంచనా వేసిన 3-3.10% నుంచి 2.9-3 శాతానికి తగ్గవచ్చని ఆయన చెప్పారు. జూన్ త్రైమాసికంలో ఎన్ఐఎం 2.96 శాతంగా ఉన్నట్టు తెలిపారు. జూన్ 30 నాటికి బ్యాంక్ మొత్తం వ్యాపారం 13.51% వృద్ధితో రూ.5,23,736 కోట్లకు పెరగగా, రుణాలు 16.48% వృద్ధితో రూ.2,25,101 కోట్లకు, డిపాజిట్లు 11.37% వృద్ధితో రూ.2,98,635 కోట్లకు చేరాయని పేర్కొంది. ఈ కాలంలో స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 3.32% నుంచి 2.63 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు కూడా 0.78% నుంచి 0.45 శాతానికి తగ్గాయి.

## ముఖేష్ అంబానీ ఒక్కరోజు సంపాదన ఎంతో తెలుసా? రిలయెన్స్ అధిపతి నెట్‌వర్త్ ఎంతంటే..



**ముంబై-నవభూమి:** రిలయెన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ దేశంలోనే అత్యంత సంపద కలిగిన ధనికుడు. భారత్‌లో మాత్రమే కాదు.. ఆసియాలోనే ఆయన నెంబర్ వన్ ధనవంతుడు. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఆయన పలు కంపెనీలను విజయవంతంగా నడిపిస్తున్నారు. ముఖేష్ సారథ్యంలోని రిలయెన్స్ పెట్రోలియం, డిజిటల్, టెలికాం, రిటైల్, ఫైనాన్స్, టెక్స్‌టైల్ రంగాల్లో అగ్రగామిగా ఎదిగింది.రిలయెన్స్ సంస్థ మార్కెట్ క్యాపిటల్ 19 లక్షల కోట్ల రూపాయలకు పైగానే ఉంది. తాజా త్రైమాసికంలో కూడా రిలయెన్స్ సంస్థ అద్భుత లాభాలను ఆర్జించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో భారీ లాభాల్ని నమోదు చేసింది. గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే లాభం ఏకంగా 76 శాతం పెరిగింది. ఈ త్రైమాసికంలో రూ. 30, 681 కోట్ల లాభాలను నమోదు చేసింది. ఈ నేపథ్యంలో ముఖేష్ సంపద మరింత పెరిగింది. త్వరలో రిలయెన్స్ సంస్థ మరిన్ని కొత్త రంగాల్లోకి కూడా అడుగుపెట్టబోతోంది.

## మార్చి నాటికి దాచేపల్లి ప్లాంట్ విస్తరణ పూర్తి



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** సాగర్ సిమెంట్స్ కార్యకలాపాల విస్తరణ తుది దశకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి కంపెనీ నిర్వహణలోని ఆంధ్రా సిమెంట్స్ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 60 లక్షల టన్నులకు విస్తరిస్తున్నట్లు సాగర్ సిమెంట్స్ జెఎండీ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. దివాలా పరిష్కార ప్రక్రియలో ఉన్న ఆంధ్రా సిమెంట్స్‌ను సాగర్ సిమెంట్స్ 2023 ఫిబ్రవరిలో రూ.922 కోట్లకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని సుమారు రూ.468 కోట్లతో ప్రస్తుత 30 లక్షల టన్నుల నుంచి 60 లక్షల టన్నులకు విస్తరిస్తోంది. 'దాచేపల్లిలోని ఆంధ్రా సిమెంట్స్ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్య విస్తరణ పనులు అనుకున్న ప్రకారం జరుగుతున్నాయి. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం చివరికల్లా ఈ ప్లాంటు ఉత్పత్తి సామర్థ్యం 60 లక్షల టన్నులకు చేరుతుంది' అని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. దాచేపల్లి ప్లాంట్ విస్తరణతో పాటు తన అనుబంధ సంస్థ సాగర్ సిమెంట్స్ (ఎం) ప్రైవేట్ లిమిటెడ్ వార్షిక సిమెంట్ గ్రైండింగ్ సామర్థ్యాన్నీ ప్రస్తుత 15 లక్షల టన్నుల నుంచి 30 లక్షల టన్నులకు విస్తరిస్తోంది. వీటికి తోడు ఇంధన ఖర్చులు తగ్గించుకునేందుకు రూ.140 కోట్ల అంచనాతో 6 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన సౌర విద్యుదుత్పత్తి కేంద్రా న్ని ఏర్పాటు చేయనుంది. ఇందుకు సాగర్ సిమెంట్స్ (ఎం) ప్రైవేట్ లిమిటెడ్ బోర్డు ఆమోదం తెలిపినట్టు శ్రీకాంత్ రెడ్డి వెల్లడించారు.

నవచిత్ర

# రామ్ చరణ్ మూవీ కోసం ఏకంగా ఆ ఊరినే నిర్మిస్తున్నారా?.. ఖర్చు ఎన్ని కోట్లంటే..!



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం గ్లోబల్ స్టార్‌గా దూసుకుపోతున్నాడు. 'ఆర్ఆర్ఆర్' తరువాత ఆయనకు అంతర్జాతీయ గుర్తింపు లభించడంతో ఇప్పుడు చరణ్ తీసే సినిమాలన్నింటిని పాన్ ఇండియా రేంజ్‌లో విడుదల చేస్తున్నారు. ఆ మధ్యలో వచ్చిన గేమ్ ఛేంజర్ ఆశించినంత వర్క్ అవుట్ కాకపోయినా, చరణ్ మాత్రం వెనకడుగు వేసే పరిస్థితిలో లేదు. ప్రస్తుతం ఆయన పెద్ది అనే మాస్ అండ్ మోటివేషనల్ మూవీపై ఫోకస్ పెట్టారు. 'ఉప్పెన'తో సెన్సేషనల్ డెబ్యూ ఇచ్చిన బుచ్చిబాబు సాన డైరెక్షన్‌లో ఈ మూవీ తెరకెక్కుతోంది. కథకు ప్రధానమైన సన్నివేశాలు విజయనగరం నేపథ్యంలో చిత్రీకరించాల్సి ఉంది.



## బెడ్ రూమ్‌లో ఎల్లీ అవ్‌రామ్ చిలిపితనం




ఉత్తరాదిన బుల్లితెర వీక్షకులకు ఎల్లీ అవ్ రామ్ నిరంతరం ట్రీటిస్తోంది. టెలివిజన్ రియాలిటీ షోలతో బిజీగా ఉన్న ఎల్లీ అవ్ రామ్ ఇటీవలే ఓ సింగిల్ ఆల్బమ్ లోను నటించింది. ఇంతలోనే ఎల్లీ తన సోషల్ మీడియా ఫ్యాన్స్ కోసం స్పెషల్ ఫోటోషూట్‌తో దూసుకొచ్చింది. ఈ ఫోటోషూట్ సంథింగ్ స్పెషల్ అనేంతగా అద్భుతమైన ఎక్స్‌ప్రెషన్స్ తో ఎల్లీ కట్టిపడేసింది. ఇది ఆహ్లాదకరమైన బెడ్ రూమ్ లో అవ్ రామ్ స్మైలీ రూపాన్ని ఎలివేట్ చేసిన ఫోటోషూట్. పడక గదిలో బెడ్ పై ఎల్లీ రకరకాల భంగిమల్లో ఫోజులిచ్చింది. స్మైలిస్తూ, చిలిపిగా అల్లరిగా, కొంటెగా రకరకాలుగా ముఖ కవళికల్ని మారుస్తూ ఫోటోలకు ఫోజులిచ్చింది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. చిలిపి అల్లరి ఎల్లీ మనసులు గెలుచుకుంది అంటూ అభిమానులు ఈ ఫోటోషూట్ ని ప్రశంసిస్తున్నారు. తన తాజా ఆల్బమ్‌చందానియా..ప్రమోషన్స్ లో బిజీగా ఉన్న ఎల్లీ ఇలా ఫోటోషూట్లతోను అభిమానులకు స్పెషల్ ట్రీటిస్తోంది. ప్రముఖ యూట్యూబర్, కంటెంట్ సృష్టికర్త అయిన ఆశిష్ చంచలానీతో ఎల్లీ అవ్ రామ్ ప్రేమలో ఉందంటూ ప్రచారం సాగుతోంది.

## 'అవతార్ 3' సూపర్ అప్‌డేట్ వచ్చేసింది



ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రేమికులను కట్టి పడేయగల సత్తా ఉన్న దర్శకుడు జేమ్స్ కామెరూన్. ఆయన దర్శకత్వంలో 2009 సంవత్సరంలో వచ్చిన అవతార్ సినిమాను అప్పట్లో అద్భుతం, మహా అద్భుతం అనుకోవడం జరిగింది. 2022లో అంతకు మించి అన్నట్లుగా అవతార్ 2 తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఆయన అవతార్ కోసం సృష్టించిన ప్రపంచంను ప్రేక్షకులు మరోసారి ఆస్వాదించారు. మరో వరల్డ్ బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ విజయాన్ని అవతార్ 2 దక్కించుకున్న విషయం తెల్సిందే. అవతార్ 2 తో పాటు అవతార్ 3 ని సైతం జేమ్స్ కామెరూన్ ప్రకటించిన విషయం తెల్సిందే. 2022లో అవతార్ 2 రాగా, 2025 లో అవతార్ 3 రానున్నట్లు ప్రకటించారు. అవతార్ 2 ను 2022, డిసెంబర్ 16న విడుదల చేయడం జరిగింది. అవతార్ 3 సినిమాను 2025, డిసెంబర్ 19న ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. ఈ విషయాన్ని మరోసారి అధికారికంగా ప్రకటిస్తూ అవతార్ 3 కొత్త పోస్టర్‌ను దర్శకుడు జేమ్స్ కామెరూన్ విడుదల చేశారు. అవతార్ సినిమా ట్రైలర్ ను ఈనెలలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. అవతార్ 3 సినిమా యొక్క మొదటి ట్రైలర్‌ను హాలీవుడ్ మూవీ 'ది ఫెంటాస్టిక్ ఫోర్ : ఫస్ట్ స్టెప్స్' సినిమాతో రిలీజ్ చేయబోతున్నారు. ట్రైలర్ ను ఈ సినిమా స్క్రీనింగ్‌కు ముందు ప్రదర్శించబోతున్నట్లుగా హాలీవుడ్ వర్గాల ద్వారా తెలుస్తోంది. అవతార్ 3 ట్రైలర్ అంచనాలను మించి ఉంటుందని తెలుస్తోంది. సీనియర్ నటుడు జేమ్స్ కామెరూన్ అవతార్ 2 ను వాటర్ ప్రపంచంలో చూపించడం జరిగింది. నీటిలో ఎక్కువగా సన్నివేశాలు ఉన్నాయి, నీటి గురించి సన్నివేశాలు ఉన్నాయి. అయితే అవతార్ 3 లో మాత్రం అగ్నికి సంబంధించిన సన్నివేశాలు ఉండబోతున్నాయి. అవతార్ : ఫైర్ అండ్ యాష్ అనే టైటిల్ తో రాబోతున్న ఈ మూడో పార్ట్ ను ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక థియేటర్‌లలో విడుదల చేయడం కోసం ట్రైలర్‌ను ముందస్తుగానే విడుదల చేసి ప్రమోషన్ హడావిడి మొదలు పెట్టబోతున్నారు. సినిమా విడుదలకు అటు ఇటుగా అయిదు నెలల సమయం మాత్రమే ఉంది. కనుక ఆలస్యం చేయకుండా ట్రైలర్ 1 ను విడుదల చేసే ఉద్దేశంతో మేకర్స్ ఉన్నారట. అవతార్‌ను గతంలో మాదిరిగానే ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక థియేటర్‌లలో విడుదల చేయాలని భావిస్తున్నారు.

## బిగ్‌బాస్ 9 : ఈ పాత వాళ్లు రీ ఎంట్రీ ఇవ్వనున్నారా?



:

తెలుగు బిగ్ బాస్ సీజన్ 9కు గ్రౌండ్ వర్క్ చాలా స్పీడ్‌గా జరుగుతోంది. ఇప్పటికే కంటెస్టెంట్స్ ఎంపిక విషయంలో ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. దాదాపుగా 25 మందితో ఫైనల్ జాబితా తయారు చేశారని, అందులో సామాన్యులు కూడా ఉన్నారని తెలుస్తోంది. ఇప్పటికే ఈ 25 మందికి మెసేజ్‌లు వెళ్లాయి, వారు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అందులో నుంచి కొందరిని తప్పించి ఫైనల్ కంటెస్టెంట్స్‌గా హౌస్‌లోకి పంపించే అవకాశాలు ఉన్నాయి. షో ప్రారంభానికి ముందు ఎవరైనా నియమ నిబంధనలు పాటించకుంటే వెంటనే వారిని తప్పించి వేరే వారికి అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో అయిదు నుంచి పది మందిని స్టాండ్ బై లో పెడతారు అని టాక్. ఆ విషయం గురించి పక్కన పెడితే బిగ్ బాస్ 9 లో కొత్త వారు మాత్రమే కాకుండా పాత వారు కూడా ఉండే అవకాశం ఉందట. సెప్టెంబర్ మొదటి వారంలో షో మొదలు కావచ్చు. సాధారణంగా బిగ్ బాస్‌కి వెళ్లాలి అంటే జీవితంలో ఒక్కసారి మాత్రమే అవకాశం ఉంటుంది అంటారు. కానీ ఇతర భాషల బిగ్‌బాస్‌కి అది వర్తిస్తుందేమో కానీ, తెలుగు బిగ్ బాస్‌కి మాత్రం అది వర్తించడం లేదు. గతంలోనూ బిగ్ బాస్ లోకి రీ ఎంట్రీ ఇచ్చిన వారు ఉన్నారు. ఒక సీజన్‌లో ఎలిమినేట్ అయ్యి, అదే సీజన్‌లో బిగ్ బాస్ రీ ఎంట్రీ ఇచ్చిన వారు చాలా మంది ఉన్నారు. అంతే కాకుండా బిగ్ బాస్ ఒక సీజన్‌లో పాల్గొన్న వారు మరో సీజన్‌లు కనిపించారు. ఇతర భాషల బిగ్‌బాస్ లో పాల్గొన్న వారు తెలుగు బిగ్‌బాస్‌లో సందడి చేసిన సందర్భాలు ఉన్నాయి. ఇతర భాషల బిగ్‌బాస్‌లతో పోల్చితే మన తెలుగు బిగ్ బాస్ చాలా విభిన్నం అనడంలో సందేహం లేదు. తెలుగు బిగ్‌బాస్ సీజన్ 9 లో సెలబ్రిటీలతో పాటు దాదాపు సమానంగా సామాన్యులను హౌస్‌లోకి పంపించే యోచనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే ఆడిషన్స్ జరిగాయి. సెలబ్రిటీల్లో కొందరు ఇంతకు ముందు కంటెస్టెంట్స్‌గా వెళ్లిన వారు సైతం ఈ సీజన్‌కి వెళ్లే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. వారిలో ముఖ్యంగా వీజే సన్నీ, ప్రియాంక జైన్, మానస్‌లు బిగ్ బాస్‌లో సందడి చేశారు. ముగ్గురికి ముగ్గురు కూడా తమదైన శైలిలో మంచి వినోదాన్ని అందించారు. అందుకే బిగ్ బాస్ నిర్వాహకులు మరోసారి వీరిని హౌస్‌లోకి పంపించాలనే ఉద్దేశంతో ఉన్నారని తెలుస్తోంది.

## పంజా హీరోయిన్ బికినీ హొయలు

సారా జేన్ డయాస్.. పరిచయం అవసరం లేదు. పవన్ కల్యాణ్ 'పంజా' చిత్రంలో ఈ భామ కథానాయికగా నటించింది. అయితే దురదృష్టవశాత్తూ సినిమా ఫ్లాపయ్యాక అవకాశాల కోసం చాలా ఇబ్బంది పడింది. ఆ తర్వాత సారా కోలీవుడ్‌లో నటించింది. అక్కడ అడపాదడపా విజయాలు దక్కినా కానీ, సుదీర్ఘ కెరీర్ ని సాగించేందుకు అవసరమైన ట్రాక్ ని నిర్మించుకోలేకపోయింది. స్టార్ డమ్ అందుకునేంత స్టఫ్ దొరకలేదు. నటిగా నిరూపించుకునేందుకు సరైన ఒక్క అవకాశం కూడా రాలేదు.అదే క్రమంలో డిజిటల్- వెబ్ సిరీస్ ప్రపంచం సారా జేన్ డయాస్ కి ఆయాచిత వరంగా మారాయి. ఇప్పటికే పలు వెబ్ సిరీస్ లలో నటిస్తూ సారా జేన్ నటిగా నిరూపించుకుంది. కొన్ని వెబ్ సిరీస్ లలో పవర్‌ఫుల్ పాత్రలతో రక్తి కట్టించింది. ఇప్పుడు నటుడు-దర్శకనిర్మాత అన్షుమాన్ ఝా తెరకెక్కిస్తున్న సిరీస్ 'లకడ్‌బఘా 2 - ది మంకీ బిజినెస్' లో నటిస్తోంది. ఇది సీక్వెల్ కథతో రూపొందుతున్న సిరీస్. లకడ్ బఘా-1 పెద్ద సక్సెసైంది. భారతదేశపు మొట్టమొదటి జంతు ప్రేమికుల విజిలెంట్ యూనివర్స్ ని సృష్టించి దానితో దర్శకుడు చాలా మ్యాజిక్ చేస్తున్నాడు. ఇలాంటి ఆసక్తికర కాన్సెప్ట్ ఉన్న సిరీస్ లో సారా జేన్ అవకాశం అందుకోవడాన్ని అదృష్టంగా భావిస్తోంది.సారా ఇటీవల హార్డ్-హిట్టింగ్ స్పోర్ట్స్ డ్రామా 'ఇన్సైడ్ ఎడ్జ్', అంతర్జాతీయంగా పాపులరైన 'యాంగ్రీ ఇండియన్ గాడెసెస్'లలో నటించింది. ప్రపంచవ్యాప్తంగా అలరించిన భారతదేశపు మొట్టమొదటి మహిళా బడ్డీ చిత్రంగా యాంగ్రీ ఇండియన్ గాడెసెస్ పాపులరైంది. జంతువులపై కరుణతో వ్యవహరించాలని చెబుతూ ఒక కొత్త యాక్షన్ ప్రపంచాన్ని 'లకడ్‌బఘా 2 - ది మంకీ బిజినెస్' సిరీస్ కోసం దర్శకుడు క్రియేట్ చేయడం ఆసక్తికరం. ఇలాంటి క్రేజీ సిరీస్ లో సారా తనను తాను మరోసారి నిరూపించుకోనుంది. మరోవైపు సోషల్ మీడియాల్లో నిరంతరం స్పీడ్ గా ఉండే సారా జేన్ తాజాగా బికినీ బీచ్ సెలబ్రేషన్స్ నుంచి అరుదైన ఫోటోగ్రాఫ్ ని షేర్ చేసింది. బికినీలో మంటలు పెడుతోందంటూ అభిమానులు ఈ ఫోటోగ్రాఫ్ పై కామెంట్లు చేస్తున్నారు. నటిగా పెరుగుతున్న గ్రాఫ్ ఇప్పుడు సారాకు టాలీవుడ్ లో అవకాశాలు కల్పిస్తుందేమో చూడాలి.



## 'హరి హర వీరమల్లు ఈవెంట్' గెస్టులు ఏమన్నారంటే?



హైదరాబాద్ శిల్పకళా వేదికలో 'హరి హర వీరమల్లు' ప్రీ రిలీజ్ వేడుక అట్టహాసంగా జరిగింది. ఈ భారీ వేడుకకు అభిమానులతో పాటు ప్రముఖులు కూడా పెద్ద ఎత్తున హాజరయ్యారు. పవన్ కళ్యాణ్ స్పీచ్ ప్రధాన ఆకర్షణగా నిలిచినా, ఈ వేడుకలో పలువురు అతిథులు కూడా సినిమాపై తమ ప్రత్యేక అభిప్రాయాలను పంచుకున్నారు. ముందుగా కర్ణాటక అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే మాట్లాడుతూ, "పవన్ కళ్యాణ్‌కి కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా ఎంతో మంది అభిమానులు ఉన్నారు. మాకు కూడా కర్ణాటకలో ఆయన ఫ్యాన్స్ ఉన్నారు. పవన్ కళ్యాణ్ ఈ జనరేషన్‌లో గొప్ప నటుడే కాదు, గొప్ప వ్యక్తి కూడా. సమాజానికి సేవ చేయడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారు. సినిమా, రాజకీయ రంగాల్లో రాణిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇలా బడా హీరో, బడా నిర్మాత కలిసినప్పుడు తప్పకుండా విజయం రావాల్సిందే" అంటూ అభినందనలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, "ఈ ప్రాజెక్ట్‌కి భారీ స్థాయిలో మాస్ ఫాలోయింగ్ ఉంది. పవన్ కళ్యాణ్ రాజకీయంగా పేదవాడి కంట కన్నీరు తుడవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఆయన చెప్పే మాటలన్నీ ఆచరణలో పెట్టే వ్యక్తి. దేశభక్తి, జాతీయవాదంపై ఆయన చెప్పే మాటలు, సినిమాలైన 'హరి హర వీరమల్లు' కథాంశంతో యూత్‌కి దేశప్రేమను చాటిచెబుతుందని చెప్పవచ్చు. ఇలాంటి గొప్ప ప్రయత్నానికి శుభాకాంక్షలు" అని కొనియాడారు.ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణ రాజు మాట్లాడుతూ, "పవన్ కళ్యాణ్ అంటేనే, ఉద్వేగం. శివాజీ కలలు కన్న సామ్రాజ్య స్థాపన కోసం పవన్ హరిహర వీరమల్లుగా ఎలాంటి పోరాటం చేశారో సినిమాలో చూడబోతున్నాం. నిర్మాత ఎ.ఎం.రత్నం ధైర్యాన్ని మెచ్చుకోకుండా ఉండలేం. ఈ సినిమా ఒక పెద్ద సంచలనాన్ని సృష్టిస్తుందని ఆశిస్తున్నాను" అని అన్నారు. ప్రముఖ కమెడియన్ బ్రహ్మానందం మాట్లాడుతూ, "పవన్ కళ్యాణ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆయన మానవత్వం పరిమళించిన మంచి మనిషి. తనంతట తానే వేసుకున్న బాటలో పోరాడి ముందుకు వచ్చారు. ఇంత మంది అభిమానులను తనతో కలిపి నడిపించడమంటే చిన్న విషయం కాదు. పుట్టుక నీది, చావు నీది బతుకంతా దేశానిది అనే మాట పవన్‌కు పూర్తిగా సరిపోతుంది. ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నాను" అని హృదయపూర్వకంగా చెప్పారు. నిర్మాత ఎ.ఎం. రత్నం మాట్లాడుతూ, "నా కెరీర్‌లో చాలా సినిమాలు చేశాను. కానీ పవన్ డిప్యూటీ సీఎం అయిన తర్వాత వస్తున్న ఫస్ట్ మూవీ కాబట్టి ఇది నాకు ప్రత్యేకం. పవన్ తొలి హిస్టారికల్ మూవీ, పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ని నిర్మించినందుకు గర్వంగా ఉంది. సినిమాతోపాటు కొంత సందేశాన్ని కూడా ఇవ్వాలనుకున్నాను. ఈ చిత్రం ప్రేక్షకుల్ని ఉత్సాహపరిచడమే కాదు, ఆలోచింపజేస్తుంది. పవన్ కళ్యాణ్ విశ్వరూపం ఇందులో చూడొచ్చు.

## ఈ వయసులోనూ ఇంతందమా..!



సినిమాలు చూసేవారికి శైలజ ప్రియ పరిచయమే. ఎన్నో సినిమాల్లో అక్కగా, వదినగా, పిన్నిగా, అమ్మగా నటించి తన అద్భుతమైన నటనతో ప్రేక్షకుల్ని మెప్పించారు ప్రియ. 1997లో వెండితెరకు పరిచమైన శైలజ ప్రియ ఆ తర్వాత సినిమాలు, సీరియల్స్ లో నటిస్తూ బిజీగా ఉన్నారు. ఎంత బిజీగా ఉన్నప్పటికీ ప్రియ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ ఎప్పటికప్పుడు తన అప్డేట్స్ ను షేర్ చేస్తూ ఉంటారు. ప్రియ అందానికి ఫిదా అవని వారుండరు. దానికి తోడు ఆమె ఎంతో మంచి నటి కూడా. అందుకే ఆమె ఎప్పుడూ చేతి నిండా అవకాశాలతో బిజీగా ఉంటారు. కేవలం ప్రియ యాక్టింగ్‌కే కాకుండా, ఆమె అందానికి కూడా ఎంతో మంది ఫ్యాన్స్ ఉన్నారు. ప్రస్తుతం ఆమె వయసు 47. ఈ వయసులో కూడా ప్రియ చాలా అందంగా, హీరోయిన్ కు ఏ మాత్రం తీసిపోని విధంగా ఉన్నారు. ' తాజాగా ప్రియ వెకేషన్ కు వెళ్లి దానికి సంబంధించిన కొన్ని ఫోటోలను తన సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఆ ఫోటోల్లో ప్రియ మరింత అందంగా కనిపిస్తున్నారు. మామూలుగా ప్రియ కాస్త బొద్దుగానే ఉంటారు. ఆమె హైట్ కు తగ్గ పర్సనాలిటీతో ఉండే ప్రియ రీసెంట్ గా షేర్ చేసిన ఫోటోల్లో చాలా స్లిమ్ గా మారినట్టు కనిపించారు. స్లిమ్ గా అవడమే కాకుండా ప్రియ ఈ ఫోటోల్లో మరింత అందంగా కూడా కనిపించారు. ఈ ఫోటోలను చూసి వయసు కేవలం నెంబర్ మాత్రమే అని ప్రూవ్ చేశారంటూ కామెంట్స్ చేస్తూ, ఆమె షేర్ చేసిన న్యూ లుక్ కు సంబంధించిన ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. సినిమాలు, సీరియల్స్ ద్వారా మంచి క్రేజ్ అందుకున్న ప్రియ, బిగ్ బాస్ తెలుగు సీజన్5 లో కనిపించి

## ప్రాక్టీస్ ప్రాక్టీస్..నెట్స్‌లో చెమటోడ్చిన భారత క్రికెటర్లు



**మాంచెస్టర్-నవభూమి:** అండర్సన్-టెండూల్కర్ టెస్టు సిరీస్‌లో భారత్ మరో కీలక పోరుకు సిద్ధమైంది. లార్డ్స్ టెస్టులో పోరాడి ఓడిన టీమ్‌ఇండియా ప్రస్తుతం ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో 1-2తో వెనుకంజలో ఉన్నది. సిరీస్‌లో నిలువాలంటే తప్పక గెలువాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్న భారత్‌ను గాయాలు వేధిస్తున్నాయి. బుధవారం నుంచి మొదలయ్యే నాలుగో టెస్టుకు ముందు జట్టుకు ప్లేయర్ల గాయాలు ప్రతిబంధకంగా మారాయి. ఆకాశ్‌దీప్, అర్ష్‌దీప్‌సింగ్ గాయాలతో నాలుగో టెస్టుకు దూరం కాగా, యువ ఆల్‌రౌండర్ నితీశ్‌కుమార్‌రెడ్డి మోకాలి గాయంతో ఏకంగా సిరీస్‌కే దూరమయ్యాడు. మరోవైపు లార్డ్స్ టెస్టులో గాయపడ్డ వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ ఫిట్‌నెస్‌పై స్పష్టత రావాల్సి ఉండగా, నితీశ్ స్థానంలో అన్షుల్ కాంబోజ్ సోమవారం జట్టుతో చేరాడు. గత కొన్ని రోజుల నుంచి వర్షంతో తడిసిముద్దవుతున్న మాంచెస్టర్‌లో కొద్దిగా గెరువు ఇవ్వడంతో ప్లేయర్లు ప్రాక్టీస్‌లో మునిగి తేలారు. ఫీల్డింగ్ ప్రాక్టీస్ డ్రిల్స్‌తో పాటు నెట్స్‌లో చాలా సేపు చెమటోడ్చారు. స్టార్ పేసర్ బుమ్రా నాలుగో టెస్టులో బరిలోకి దిగుతాడంటూ మీడియా భేటీలో మహమ్మద్ సిరాజ్ ప్రకటించగా, గాయాలతో పలువురు ప్లేయర్లు దూరం కావడంతో తుది జట్టు కూర్పుపై ఆసక్తి నెలకొన్నది. బుమ్రా ఆడేది పక్కా అని పేర్కొన్న సిరాజ్ బెస్ట్ కాంబినేషన్‌తో ఇంగ్లండ్‌ను ఎదుర్కొంటామని తెలిపాడు.

## నాలుగో టెస్ట్‌లో ఇంగ్లండ్‌కు బలమైన రీ-ఎంట్రీ.. ఇండియాకు కష్టమేనా..



**మాంచెస్టర్-నవభూమి:** భారత్, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ గురించి కీలక అప్?డేట్ వచ్చేసింది. నాలుగో టెస్ట్ మ్యాచ్ మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా జులై 23 నుంచి ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్ కోసం ఇంగ్లండ్ తమ జట్టులో ఒక మార్పును ప్రకటించింది. గాయం కారణంగా షోయబ్ బషీర్ ఈ సిరీస్‌కు దూరమవడంతో, హాంప్‌షైర్ స్పిన్నర్ లియామ్ డాసన్ జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు.లియామ్ డాసన్ చివరిసారిగా 2017 జులైలో సౌతాఫ్రికాతో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో ఆడాడు. ఇప్పుడు, దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత, అతను మళ్లీ టెస్ట్ జట్టులో అడుగుపెడుతున్నాడు. ఇంగ్లండ్ ఆటగాళ్లలో టెస్ట్ మ్యాచ్‌ల మధ్య అత్యధిక గ్యాప్ ఉన్న ఆటగాళ్ల జాబితాలో డాసన్ నాలుగో స్థానంలో నిలిచాడు. అతని ముందు గారెత్ బ్యాటీ (11 సంవత్సరాలు, 137 రోజులు), మార్టిన్ బిక్‌నెల్ (10 సంవత్సరాలు, 12 రోజులు), డెరెక్ షాకిల్‌టన్ (11 సంవత్సరాలు, 225 రోజులు) ఉన్నారు. ఈ రీఎంట్రీ డాసన్‌కు ఒక అద్భుత అవకాశమని చెప్పవచ్చు. అతను తన స్పిన్ బౌలింగ్‌తో జట్టుకు బలం చేకూర్చేందుకు సిద్ధంగా ఉన్నాడు.

నవక్రీడ

## డాసన్‌కు చోటు



**మాంచెస్టర్-నవభూమి:** లార్డ్స్ టెస్టులో విజయం ఇచ్చిన జోష్‌లో ఉన్న ఇంగ్లండ్.. బుధవారం నుంచి భారత్‌తో మాంచెస్టర్‌లో జరగాల్సిన నాలుగో టెస్టుకు తుది జట్టును ప్రకటించింది. లార్డ్స్‌లో గాయపడ్డ స్పిన్నర్ షోయభ్ బషీర్ స్థానంలో లియామ్ డాసన్‌కు తుది జట్టులో చోటు కల్పించడం మినహా మిగతా జట్టులో మార్పులేమీ చేయలేదు. సుమారు 8 ఏండ్ల విరామం తర్వాత డాసన్.. ఇంగ్లండ్ జట్టులో చోటు దక్కించుకోవడం విశేషం. 2018 తర్వాత అతడు అంతర్జాతీయ స్థాయిలో టెస్టు ఆడనున్నాడు.ముంబై: యూఏఈ వేదికగా సెప్టెంబర్ 10 నుంచి 28వ తేదీ వరకు జరుగనున్న ఆసియాకప్ టోర్నీపై సందిగ్ధత నెలకొన్నది. ఢాకాలో ఈనెల 24, 25వ తేదీల్లో ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఏసీసీ) వార్షిక సర్వసభ్య సమావేశం(ఏజీఎమ్) జరుగాల్సి ఉంది. పీసీబీ చైర్మన్, ఏసీసీ అధ్యక్షుడు మోహిసిన్ నక్వి సారథ్యంలో ఢాకాలో జరిగే ఏజీఎమ్‌కు హాజరయ్యేది లేదని బీసీసీఐ కుండబద్దలు కొట్టింది. ఢాకా కాకుండా వేరే వేదికలో జరిగితే అప్పుడు హాజరవుతామంటూ బీసీసీఐ స్పష్టం చేసింది. ఏసీసీ ఏజీఎమ్‌కు కనీసం మూడు శాశ్వత సభ్యదేశాలు హాజరైతే తప్ప కోరం పూర్తికాదు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**